www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

ఆ భూములను ఖాళీ చేయండి

వారంలోగా సమాధానం ఇవ్వండి

శారదా పీఠానికి రెవెన్యూశాఖ నోటీసులు

ఆక్రమణలపై ఎట్టకేలకు కదలిక

12



సోమవారం | 24-3-2025 | పేజీలు: 12 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 | సంచిక (Issue) : 338

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, ఫాల్గుణమాసం, బహుళపక్షం, తిథి: దశమి తె.5:06 తదుపరి ఏకాదశి, నక్షత్రం: ఉత్తరాషాఢ తె.4:27 తదుపరి శ్రవణం, వర్జ్యం: మ.12:21-1:57, అమృతఘడియలు: రా.10:00-11:37, దుర్ముహూర్తం: మ.12:45-1:33, మ.3:10-3:58, రాహుకాలం: ఉ.7:30-9:00, సూర్యోదయం: 6:19, సూర్యాస్తమయం: 6:23 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru


విజయనగరం జిల్లా నెల్లిమర్ల-గుర్ల మధ్య చంపావతి నది వంతెన కింద ఇన్‌ఫిల్టర్ బావి వద్ద మురుగునీరు, వ్యర్థాలు

నదులు.. విలవిల!

వ్యర్థాలు, మురుగునీటితో జలాలు కలుషితం.. సిక్కోలు నుంచి 'అనంత' వరకు ఇదే దుస్థితి

ఆంధ్రజ్యోతి గ్రౌండ్ రిపోర్ట్

- కాలుష్య కోరల్లో గోదావరి, కృష్ణా, తుంగభద్ర
- గ్రామాలు, కాలనీల నుంచి మురుగు నదుల్లోకి
- శుద్ధి చేయకుండా డ్రైనేజీ అవుట్ లెట్ల నుంచి విడుదల
- పరివాహక ప్రాంతాల్లో భూగర్భ జలాలూ కలుషితం
- ఇటీవల విజయనగరంలో డయేరియా కేసులు
- ఇతర ప్రాంతాల్లోనూ పొంచిఉన్న రోగాల ముప్పు


రాజమహేంద్రవరంలోని రోడ్ కమ్ రైలు బ్రిడ్జి వద్ద గోదావరిలో పేరుకుపోయిన వ్యర్థాలు

జవసత్వాలను జలాలు మనకందిస్తే, ముందుచూపు లేని విధానాలతో మనం వాటిని హాలాహలంగా మార్చేశాం. మానవ స్వార్థం డ్రైనేజీగా మారి నదుల్లోకి పొంగి పొర్లుతోంది. కొండల్లో హోరెత్తే ప్రవాహాలకు జనావాసాల్లో సంకెళ్లు పడుతున్నాయి. అడ్డుపడే చెత్తాచెదారంలో చిక్కుకుపోతున్నాయి. దీంతో కలుషిత నీరే దిక్కైన జనాలను అంటువ్యాధులు కాటేస్తున్నాయి. నీటి తావులు కాలుష్య కాసారాలుగా మారుతున్న తీరుపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం..

11

ప్రాథమిక ఆధారాలున్నాయి.. లోతైన దర్యాప్తు

జరపాల్సిందే

జడ్జి ఇంట్లో నోట్ల కట్టల వ్యవహారంపై సీజేఐకి ఢిల్లీ హైకోర్టు సీజే జస్టిస్ ఉపాధ్యాయ సిఫారసు

- మార్చి 15నే సీజేఐ దృష్టికి డబ్బు కట్టల విషయం
- జస్టిస్ వర్మకు మూడు ప్రశ్నలు వేసి లిఖితపూర్వక సమాధానాలు రాబట్టాలని సూచించిన సీజే
- ఆర్నెల్ల కాల్ రికార్డులూ తీసుకోవాలని సూచన
- మొబైల్‌ఫోన్లు పారేయవద్దని, వాటిలో డేటా డిలీట్ చేయొద్దని జస్టిస్ వర్మకు సూచించాలని ఆదేశం
- ఆ గది నా ఇంట్లో భాగం కాదు.. ప్రాంగణంలో ఉంది
- ఇది నా ప్రతిష్ఠను దెబ్బతీసే కుట్ర: జస్టిస్ వర్మ



ఢిల్లీలో జస్టిస్ యశ్వంత్ వర్మ నివాసం సమీపంలో చెత్త మధ్య కాలిన నోట్లు

న్యూఢిల్లీ, మార్చి 23: ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ ఇంట్లో నోట్ల కట్టల వ్యవహారానికి సంబంధించి.. సుప్రీంకోర్టు తన వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసిన నివేదిక ద్వారా పలు కీలక అంశాలు బయటపడ్డాయి! ఢిల్లీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దేవేంద్ర కుమార్ ఉపాధ్యాయకు ఈ వ్యవహారం గురించి మార్చి 15 సాయంత్రం తెలియగా.. ఆ తర్వాత కొద్దిసేపటికే ఆయన ఈ విషయాన్ని సుప్రీం సీజే జస్టిస్ సంజీవ్ ఖన్నా దృష్టికి తీసుకెళ్లారు. శనివారం రాత్రి పొద్దుపోయాక సుప్రీంకోర్టు అప్‌లోడ్ చేసిన 25 పేజీల డాక్యుమెంట్‌లో రెండో పేజీలోనే ఈ విషయం స్పష్టంగా ఉంది. జస్టిస్ వర్మ ఇంటి ప్రాంగణంలోని స్టోర్‌రూమ్‌లో సగం తగలబడిపోయిన డబ్బు కట్టలున్న నాలుగైదు గోనెసంచులున్నట్టు ఢిల్లీ పోలీసు కమిషనర్ ఇచ్చిన నివేదిక, సీజేఐకి ఢిల్లీ హైకోర్టు సీజే జస్టిస్ దేవేంద్ర కుమార్ ఉపాధ్యాయ ఇచ్చిన నివేదిక, వారి మధ్య జరిగిన ఉత్తరప్రత్యుత్తరాలు, ప్రమాదం జరిగిన స్టోర్ రూమ్‌లో డబ్బుకట్టలున్న ఫొటోలు, వీడియో లింకుతో సహా.. మొత్తం 25 పేజీల పీడీఎఫ్‌ను సుప్రీంకోర్టు తన వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసింది. ఇందులో జస్టిస్ ఉపాధ్యాయ సీజేఐకి ఇచ్చిన నివేదికలో పలు కీలక విషయాలు ఉన్నాయి. మార్చి 14వ తేదీన రాత్రి 11.30 గంటల సమయంలో జస్టిస్ వర్మ ఇంటి ప్రాంగణంలో జరిగిన అగ్ని ప్రమాదం, సగం కాలిన నోట్ల కట్టల గురించి ఢిల్లీ పోలీసు కమిషనర్ సంజయ్ అరోరా... మార్చి 15 సాయంత్రం 4.50 గంటల సమయంలో లఖ్‌నవూలో ఉన్న తనకు

మిగతా 2వ పేజీలో...

ఇప్పటికీ మాకు ఆ ప్రాంతంలో కాలిన నోట్లు దొరుకుతున్నాయి.. పారిశుధ్య కార్మికుల వెల్లడి

సర్కారుకు తెలియకుండా 350 డీటీ పోస్టుల సృష్టి

- 175 మంది జూనియర్లకు అక్రమంగా పదోన్నతులు
- సొంత మనుషులను పెట్టి భారీగా సొమ్ము వసూలు
- తహసీల్దార్లకు జిల్లాల కేటాయింపులో మరో దందా
- రాజకీయ లక్ష్యాలతో ఎన్నికల ఫండ్ కోసం వేట
- రూ. తొమ్మిదిన్నర కోట్లు వసూలు చేసిన అధికారి
- ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందు రాజీనామా..
- ముడుపులు చెల్లించినవారంతా లబోదిబో
- సర్కారుకు చేరిన నిఘా విభాగం నివేదిక

గత ఎన్నికలకు ముందు రాజకీయ లక్ష్యాలతో రంగంలోకి దిగిన ఆ అధికారి.. రెవెన్యూశాఖను ఏకంగా ఏటీఎంగా చేసుకున్నారు. ఒకేసారి 350 డిప్యూటీ తహసీల్దార్ పోస్టులు సృష్టించారు. పదోన్నతులు ఇచ్చేశాక కూడా ఇంకా మిగిలిన 175 ఖాళీలను జూనియర్లతో నింపేశారు. పెండింగ్‌లో ఉన్న తహసీల్దార్ల సీనియారిటీని ఖరారుచేసి ప్యానల్లను సిద్ధం చేసి, కోరినవారికి కోరినట్లుగా సొంత జిల్లాలు కేటాయించారు. ఇలా దాదాపు రూ.9.50 కోట్ల ఎన్నికల ఫండ్ వసూలు చేసినట్టు తెలిసింది. అయితే, ఇదంతా ప్రభుత్వానికి తెలియకుండా జరగడంతో ఉత్తర్వుల రూపంలో అమల్లోకి రాలేదు. పోస్టుల ద్వారా లబ్ధి పొందుతామని ఆశపడి బడాసాబ్‌కు భారీగా సొమ్ములు సమర్పించుకున్న వారంతా లబోదిబోమంటున్నారు. తాజాగా దీనిపై నిఘా వ్యవస్థ ప్రభుత్వ పెద్దలకు నివేదిక ఇచ్చినట్లు తెలిసింది.

రెవెన్యూలో 'ఫండ్' పట్టాడు



(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రెవెన్యూశాఖలో మండల ఆఫీసుల్లో తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్, సూపరింటెండెంట్, సీనియర్ అసిస్టెంట్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, జూనియర్ అసిస్టెంట్ వంటి పోస్టులు ఉంటాయి. ఇందులో ఏ పోస్టుకు సంబంధించిన కొత్తగా ఖాళీలు భర్తీచేయాలన్నా లేదా ఆ పోస్టుల కేడర్ సంఖ్యను పెంచాలన్నా విధిగా రెవెన్యూశాఖ ప్రభుత్వ అనుమతి తీసుకోవాలి. అంటే ఆర్థిక శాఖ ఆమోదంతోపాటు ముఖ్యమంత్రి ఆమోదం ఉండితీరాల్సిందే. ఆఫీసు సబార్డినేట్ పోస్టుకయినా ఇదే విధానం! అయితే, జగన్ ప్రభుత్వంలో అత్యంత కీలకమైన నాలుగైదు శాఖలకు ఇన్‌చార్జీగా ఉంటూనే, రెవెన్యూలో కీలకమైనస్థానంలో ఉన్న ఓ అధికారి ఆ సూత్రాలను ఉల్లంఘించారు. ఇందుకు కారణం ఆయనకు ఈజీమనీ కావాల్సి రావడమే. ఎన్నికల్లో పోటీ చేయాలనుకున్నారు. అడ్డగోలుగా ఖర్చుపెట్టి ఓట్లు దండుకునేందుకు సొమ్ము కావాలనుకున్నారు. ఇందుకోసం తన పరిధిలోని ఓ అధికారాన్ని ఉపయోగించారు. అదే డీటీ పోస్టుల సృష్టి. 2023 మే నాటికి మంజూరయిన డీటీ పోస్టులు 1,213. అదనంగా ఒక్క పోస్టును కొత్తగా సృష్టించాలన్నా ప్రభుత్వం అనుమతి తీసుకోవాలి. కానీ ఆయన ఈ విధానాన్ని బేఖాతరు చేసి ప్రభుత్వానికి అక్షరం ముక్క సమాచారం ఇవ్వకుండానే ఏకబిగిన 350 డీటీ పోస్టులను సృష్టించారు. మొత్తం కేడర్ పోస్టులను పెంచేశారు. కొత్త పోస్టుల సృష్టిద్వారా అదనంగా 175 ఖాళీలు ఏర్పడ్డాయి. అంటే, సీనియారిటీని

మిగతా 12వ పేజీలో...

పౌల్ట్రీ.. పరేషాన్!

- దెబ్బతీసిన బర్డ్ ఫ్లూ.. వేసవితో మరింత నష్టం
- గత సర్కారు పౌల్ట్రీ పాలసీతో సంక్షోభంలోకి..
- పునఃసమీక్షించాలని చంద్రబాబుకు విజ్ఞప్తి
- సీఎం ఆదేశాలతో కదిలిన పశు సంవర్ధక శాఖ

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలో బ్రాయిలర్ కోళ్ల ఫారాలు 3వేలు, గుడ్లు ఉత్పత్తి చేసే ఫారాలు 1,200 ఉన్నాయి. మొత్తం పౌల్ట్రీ ఫారాల్లో 6 కోట్ల దాకా కోళ్లు ఉన్నాయి. రోజుకు సుమారు 4.5కోట్ల గుడ్లు ఉత్పత్తవుతున్నాయి. కానీ రెండు నెలలుగా బర్డ్‌ఫ్లూపై భయంతో గుడ్లు, చికెన్ వినియోగం

మిగతా 3వ పేజీలో...

రాష్ట్రంలో పౌల్ట్రీ రంగం సంక్షోభంలో కూరుకుపోయింది! కోళ్ల పెంపకందార్లకు గత ఐదేళ్లుగా ప్రోత్సాహం కరువవడంతోపాటు ఈ ఏడాది బర్డ్ ఫ్లూ పౌల్ట్రీ రైతులను మరింత దెబ్బతీసింది. కొన్నేళ్లుగా దాణా ధరల పెరుగుదల, విద్యుత్ చార్జీల భారం, కూలీల డిమాండ్, వాతావరణ పరిస్థితులతో అనేక ఆటుపోట్లు ఎదుర్కొంటూ వస్తున్న పౌల్ట్రీ రైతులు ఈ దెబ్బతో దిక్కుతోచని స్థితిలో పడిపోయారు! ఇప్పుడు కూటమి ప్రభుత్వంపైనే కోటి ఆశలు పెట్టుకున్నారు. తమను అగాధంలోకి నెట్టేసిన జగన్ సర్కారు పౌల్ట్రీ పాలసీని పునఃసమీక్షించడంతోపాటు, రుణాలు రీషెడ్యూల్ చేయాలని.. ఇతరత్రా చేయూతనందించి సంక్షోభం నుంచి గట్టెక్కించాలని పౌల్ట్రీ రైతులు ఇటీవల సీఎంను కలిశారు!.


ఇషాన్ కిషన్ 106 నాటౌట్

పరుగుల వరద

- ఉప్పల్‌లో రికార్డు స్కోర్లు నమోదు
- సన్‌రైజర్స్ 286/6.. రాజస్థాన్ రాయల్స్ 242/6
- 44 పరుగుల తేడాతో గెలిచిన హైదరాబాద్
- ట్రావిస్ హెడ్ ధనాధన్.. ఇషాన్ తుఫాన్ సెంచరీ
- మరో పోరులో ముంబైకి షాకిచ్చిన సీఎస్కే

10

విశాఖలో లఖ్‌నవూ X ఢిల్లీ ఢీ

సమరం నేడే



15-20 తేదీల మధ్య అమరావతికి ప్రధాని?

- 250 ఎకరాల్లో భారీ బహిరంగ సభ
- వెలగపూడి సచివాలయం వెనుక ఎన్-9 రోడ్డు సమీపాన ఏర్పాట్లు
- మోదీ వరాలిస్తారని రైతుల్లో ఆశలు

11

27న పోలవరానికి సీఎం

అకాల వర్షం.. ఈదురుగాలుల బీభత్సం


అనంతపురం జిల్లా పుట్లూరు మండలంలో నేలమట్టమైన మొక్కజొన్న పంట

11

- సీమలో దెబ్బతిన్న పంటలు
- సత్యసాయి జిల్లా గంజివారిపల్లెలో 33.25 మి.మీ. వాన
- అనంతలో ఉద్యాన పంటలకు రూ.36.11 కోట్ల నష్టం
- కడప జిల్లాలో 2455 ఎకరాల అరటి తోటలు నేలమట్టం
- బెంగళూరులో విమానాల రాకపోకలకు అంతరాయం
- రైతుల్ని ఆదుకుంటాం: చంద్రబాబు

బెట్టింగ్ యాప్స్ రచ్చలోకి అగ్ర నటులు

బాలకృష్ణ, ప్రభాస్, గోపీచంద్‌పై సైబర్ క్రైం విభాగానికి న్యాయవాది ఫిర్యాదు

- ఫన్-88 యాప్‌ను ప్రమోట్ చేశారని ఆరోపణ
- తెలంగాణలో బెట్టింగ్ యాప్స్‌పై 385 ఫిర్యాదులు
- మ్యూల్ ఖాతాల ద్వారా చైనాకు వెళ్తున్న సొమ్ము
- జియో ఫెన్సింగ్ ద్వారా బెట్టింగ్ సైట్లకు అడ్డుకట్ట
- ఇప్పటికే 108 సైట్లను బ్లాక్ చేసిన అధికారులు



12

చైనా ఉత్పత్తులపై భారత్ సుంకం

2

- చవక సరుకుల నుంచి దేశీయ పరిశ్రమలను కాపాడటం కోసం నిర్ణయం
- ఫ్లాస్కులు, అల్యూమినియం ఫాయిల్స్‌తో కలిపి 5 రకాల ఉత్పత్తులకు వర్తింపు

ఏప్రిల్ నుంచే ఇంటర్ తరగతులు

- 7వ తేదీ నుంచి అడ్మిషన్లు.. మధ్యలో వేసవి సెలవులు
- వచ్చే ఏడాది నుంచి ఎంబైపీసీ.. గణితం, సైన్స్ సబ్జెక్టులు విలీనం
- విద్యాసంవత్సరం క్యాలెండర్ సిద్ధం.. త్వరలోనే ప్రకటించనున్న బోర్డు

3



అంతా ఉచితం.. అయినా కోట్లు పెట్టి కొంటాం!

ఆర్టీసీలోని సీసీఎస్ ఆఫీసు కోసం 4 కోట్లతో ఫ్లాట్

- బెజవాడలో బస్టాండుకు 6 కిలోమీటర్ల దూరంలో
- ఇప్పటికే బిల్డర్‌తో ఒప్పందం.. 26న తీర్మానం
- ప్రస్తుతం బస్టాండు ప్రాంగణంలోనే కార్యాలయం
- పాలక మండలి నిర్ణయంపై సర్వత్రా విమర్శలు
- స్వప్రయోజనాల కోసమేనని ఉద్యోగుల ఆగ్రహం

12

ప్రాంతీయ భాషల్లో సుప్రీం తీర్పులు

2

కృత్రిమ మేధతో అనువాదం



రచయిత్రి కమలాదేవి అరవిందన్‌కు సింగపూర్ హాల్ఆఫ్ ఫేమ్ అవార్డు



చెన్నై, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): సింగపూర్‌లో వివిధ రంగాలలో ప్రతిభను కనబరిచిన మహిళలకు అందించే హాల్ ఆఫ్ ఫేమ్ అవార్డు ఈ ఏడాది భారత సంతతి రచయిత్రి కమలాదేవి అరవిందన్‌ని వరించింది. కమలాదేవి (75) తమిళం, మలయాళంలో రచనలు చేస్తున్నారు. ఆమె సాహితీకృషిని సింగపూర్ కౌన్సిల్ ఆఫ్ ఉమెన్స్ ఆర్గనైజేషన్స్ (ఎస్సీడబ్ల్యూ) గుర్తించి, ఈ అవార్డుకు ఎంపిక చేసింది. కమలాదేవి నాటక రచయిత్రిగా విశేష ప్రతిభ కనబరిచారు. నేషనల్ లైబ్రరీ, సింగపూర్ తమిళ రచయితల సంఘం సంయుక్తంగా వర్ధమాన రచయితల కోసం నిర్వహించిన వర్క్‌షాప్‌లను ఆమె నడిపించారు. ఆమె నవల 'సెంబవాంగ్' సింగపూర్‌లో విడుదలైన అత్యుత్తమ రచనలలో ఒకటి. ఆమె రచనలు సింగపూర్, మలేసియా, కెనడా, భారత్‌లో విడుదలై, విశేష ఆదరణ పొందాయి. ఇప్పటిదాకా ఆమె 160కి పైగా కథానికలు, వ్యాసాలు, 18 రంగస్థల నాటకాలు, 300 రేడియో నాటకాలను రచించారు.

బీజేపీ కేరళ శాఖ అధ్యక్షుడిగా రాజీవ్‌చంద్రశేఖర్

తిరువనంతపురం, మార్చి 23: బీజేపీ కేరళశాఖ అధ్యక్షుడిగా కేంద్ర మాజీ మంత్రి రాజీవ్ చంద్రశేఖర్ (60) బాధ్యతలు స్వీకరించనున్నారు. పార్టీ రాష్ట్రశాఖ అధ్యక్ష పదవి ఎన్నికల్లో ఆయన ఒక్కరే నామినేషన్ దాఖలు చేశారని బీజేపీ వర్గాలు తెలిపాయి. సోమవారం జరిగే బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాల్లో పార్టీ కేంద్ర పరిశీలకుడు - కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి అధికారికంగా రాజీవ్ చంద్రశేఖర్ ఎన్నిక విషయం ప్రకటిస్తారని ఆ వర్గాల కథనం. తిరువనంతపురంలోని బీజేపీ కార్యాలయంలో రాష్ట్రశాఖ అధ్యక్ష పదవికి జరుగుతున్న ఎన్నికల్లో ఆదివారం రాజీవ్ చంద్రశేఖర్ రెండు సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. ప్రస్తుత బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా సుందరేశన్ ఐదేండ్ల పదవీ కాలం పూర్తి కావడంతో కొత్త అధ్యక్షుడి ఎన్నిక నిర్వహిస్తున్నారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో తిరువనంతపురం లోక్‌సభాస్థానం నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి శశిథరూర్ చేతిలో రాజీవ్ చంద్రశేఖర్ 16,077 ఓట్ల తేడాతో ఓటమి పాలయ్యారు.

పేపర్ లీక్‌తో అసోం 11వ తరగతి పరీక్షలు రద్దు

గువాహటి, మార్చి 23: అసోంలో జరుగుతున్న 11వ తరగతి పరీక్షలు రద్దు అయ్యాయి. పలుచోట్ల గణితం ప్రశ్నపత్రం లీక్ అవ్వడంతో సోమవారం నుంచి జరగాల్సిన మిగిలిన పరీక్షలను రద్దు చేసినట్లు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి రనోజ్ పేగు వెల్లడించారు. ఈనెల 6న ప్రారంభమైన 11వ తరగతి పరీక్షలు 29వ తేదీ వరకు కొనసాగాల్సి ఉంది. గణితం ప్రశ్నపత్రం ఒకరోజు ముందుగానే లీక్ అయ్యి సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవడంతో 21న జరగాల్సిన ఆ పరీక్షను రద్దు చేశారు. ఈ క్రమంలో మిగిలిన పరీక్షలను కూడా రద్దు చేశారు. సోమవారం జరగనున్న బోర్డు సమావేశంలో కొత్త షెడ్యూల్‌కు సంబంధించి నిర్ణయం తీసుకుంటామని అధికారులు తెలిపారు. పేపర్ లీక్‌కు సంబంధించి 15 ప్రైవేట్ విద్యాసంస్థల అఫిలియేషన్‌ను అధికారులు తాత్కాలికంగా రద్దు చేశారు.

సరిహద్దుల్లో ఏఐ రోబోలతో నిఘా

న్యూఢిల్లీ, మార్చి 23: భారత సరిహద్దులను పర్యవేక్షించడానికి ఐఐటీ గువాహటి పరిశోధకులు అధునాతన రోబోలను అభివృద్ధి చేశారు. కృత్రిమ మేధ (ఏఐ) సాయంతో పనిచేసే ఈ రోబోలు బోర్డర్‌లో నిరంతరం కాపలా కాస్తుంటాయి. అలాగే సైన్యం కూడా వెళ్లలేని క్లిష్టమైన, సవాళ్లతో కూడిన భూభాగాల్లోనూ రియల్‌టైమ్‌లో పర్యవేక్షణ చేస్తాయి. ఐఐటీ గువాహటిలోని స్టార్టప్ డీఏ స్పాటియో రోబోటిక్ లేబొరేటరీ ప్రైవేట్ లిమిటెడ్ (డీఎస్ఆర్ఎల్) అభివృద్ధి చేసిన ఈ రోబోలను భారత రక్షణ వ్యవస్థలోకి తీసుకునేందుకు డీఆర్‌డీవో అనుమతి కూడా లభించింది. నిఘా వ్యవస్థ కోసం భారత సైన్యం ఇప్పటికే వీటికి క్షేత్రస్థాయి పరీక్షలు నిర్వహిస్తోంది. మానవ గస్తీపై ఆధారపడే సంప్రదాయ భద్రతా చర్యలకు భిన్నంగా ఈ రోబోలు ఎలాంటి భూభాగంలోనైనా, ఎలాంటి వాతావరణ పరిస్థితుల్లోనైనా సమర్థవంతంగా పనిచేస్తాయని డీఎస్ఆర్ఎల్ సీఈవో అర్నబ్ కుమార్ బర్మన్ తెలిపారు. దుండగులు అంతర్జాతీయ సరిహద్దుల్లో చొరబాట్లకు ప్రయత్నించినా, డ్రోన్లను పంపినా.. ఈ రోబోలకు ఉన్న సెన్సర్లు వెంటనే గుర్తించి అప్రమత్తం చేస్తాయన్నారు.

అమెరికాలో కాల్పులు..ఇద్దరు భారతీయుల మృతి

న్యూయార్క్, మార్చి 23: అమెరికాలో జరిగిన కాల్పుల్లో మరో ఇద్దరు భారతీయులు ప్రాణాలు కోల్పోయారు. వర్జీనియాలోని ఓ కన్వీనియన్స్ స్టోర్‌లో పని చేస్తున్న ప్రదీప్ కుమార్ పటేల్ (56), ఆయన కుమార్తె (24)పై ఓ దుండగుడు కాల్పులు జరపడంతో వారిద్దరూ ప్రాణాలు కోల్పోయారు. కాల్పులకు పాల్పడిన వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. అకోమాక్ కౌంటీలో లాంక్ ఫోర్డ్ హైవేలోని దుకాణంలో గురువారం ఉదయం తండ్రీ కుమార్తె పని చేస్తున్న సందర్భంగా దుండగుడు వీరిపై కాల్పులకు తెగబడినట్టు మీడియా కథనాల ద్వారా తెలుస్తోంది. గుజరాత్‌లోని మెహ్సానా జిల్లాకు చెందిన ప్రదీప్ పటేల్ ఆయన భార్య, కుమార్తె ఆరేళ్ల క్రితం అమెరికాకు వెళ్లినట్లు తెలుస్తోంది.

మత రిజర్వేషన్లు రాజ్యాంగ ఉల్లంఘనే: హోసబలే

బెంగళూరు, మార్చి 23: మతం ఆధారిత రిజర్వేషన్లను భారత రాజ్యాంగం అనుమతించబోదని ఆరెస్సెస్ ప్రధాన కార్యదర్శి దత్తాత్రేయ హోసబలే అన్నారు. ప్రభుత్వ కాంట్రాక్టుల్లో ముస్లింలకు 4% రిజర్వేషన్లు కల్పిస్తూ కర్ణాటక ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై ఆయన స్పందించారు. ఆదివారం ఆయన బెంగళూరులో మీడియాతో మాట్లాడుతూ.. ముస్లింలకు మత ఆధారిత రిజర్వేషన్లు ప్రవేశపెట్టడానికి గతంలో ఉమ్మడి ఏపీ, మహారాష్ట్రల్లో చేసిన ప్రయత్నాలను హైకోర్టులు, సుప్రీంకోర్టులు కొట్టేశాయని గుర్తు చేశారు. ఆక్రమణ మనస్తత్వం ఉన్న వ్యక్తులు భారత్‌కు ముప్పుగా పరిణమించారన్నారు.భారతీయ సంస్కృతికి అండగా నిలిచేవారికి అందరూ మద్దతు పలకాలని కోరారు. మరోవైపు, ప్రపంచ శాంతి, శ్రేయస్సు కోసం సామరస్యపూర్వక, వ్యవస్థీకృత హిందూ సమాజాన్ని నిర్మించాలని ఆరెస్సెస్ తీర్మానించింది.

సంభల్ మసీదు కమిటీ అధ్యక్షుడి అరెస్టు

సంభల్, మార్చి 22: ఉత్తరప్రదేశ్ సంభల్‌లోని షాహీ జామా మసీదు కమిటీ అధ్యక్షుడు జాఫర్ ఆలీని ఆదివారం పోలీసులు అరెస్టు చేశారు. గత ఏడాది నవంబరు 24న మసీదు వద్ద జరిగిన అల్లర్లలో ఆయన ప్రమేయం ఉందన్న ఆరోపణల మేరకు అదుపులోకి తీసుకున్నారు. కోర్టు ఆదేశాల మేరకు మసీదు ప్రాంగణంలో సర్వే నిర్వహించేందుకు అధికార్లు రాగా వారిని అడ్డుకునే క్రమంలో ఘర్షణలు చోటుచేసుకున్నాయి. నలుగురు వ్యక్తులు ప్రాణాలు కోల్పోయారు. ఆ సంఘటనపై ఆయన వాంగ్మూలం నమోదు చేసుకునేందుకు అదుపులోకి తీసుకున్నామని స్థానిక పోలీసులు తెలిపారు. మరోవైపు ఆ ఘర్షణలపై దర్యాప్తు జరిపేందుకు రాష్ట్ర ప్రభుత్వం నియమించిన న్యాయ విచారణ సంఘం సోమవారం ఇక్కడికి రానుంది.

గబాన్‌లో చిక్కుకున్న కర్ణాటక నాటువైద్యులు

బెంగళూరు, మార్చి 23(ఆంధ్రజ్యోతి): దావణగెరె జిల్లాలో సంచార జాతులకు చెందిన నాటు వైద్యులు మధ్య ఆఫ్రికా ప్రాంతం గబాన్ దేశంలో చిక్కుకున్నారు. 6నెలల క్రితం ఔషధ మొక్కల విక్రయానికి గబాన్ దేశ రాజధాని లిబ్రవిల్‌కు వెళ్లిన 21 మందిని అక్కడి పోలీసులు అరెస్టు చేశారు. గబాన్‌లో రాజకీయ మార్పులు చోటు చేసుకున్న తర్వాత 2023లో అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం విదేశీయులందరూ దేశం విడిచి వెళ్లాలని ఆదేశించింది. కాగా, ఈ నాటువైద్యులు వ్యాపారాల కోసం ఉపయోగిస్తున్న వీసాలు నకిలీవని గుర్తించి లిబ్రవిల్ పోలీసులు అరెస్టు చేశారు.

మధ్యంతర ఎన్నికలకు కెనడా కొత్త ప్రధాని పిలుపు

ఒట్టావా, మార్చి23: కెనడాలో మధ్యంతర ఎన్నికలకు నూతన ప్రధాని మార్క్ కార్నీ పిలుపునిచ్చారు. ఏప్రిల్ 28న మొత్తం 343 పార్లమెంట్ స్థానాలకు ఎన్నికలు జరుగుతాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. కెనడాపై విధిస్తున్న సుంకాల అంశమే ఈ సారి ఎన్నికల ప్రచారంలో కీలకం కానుంది. జస్టిన్ ట్రుడో స్థానంలో కొత్త ప్రధానిగా బాధ్యతలు స్వీకరించిన లిబరల్ నాయకుడు కార్నీ.. సుంకాల అంశాన్నే తొలి రోజు ఎన్నికల ప్రచారంలో లేవనెత్తారు. కెనడా ఆర్థిక వ్యవస్థను చక్కదిద్దడమే తన ప్రధాన లక్ష్యమని చెప్పారు. ఐదు వారాల పాటు ఎన్నికల ప్రచారం జరగనుంది. లిబరల్స్, కన్జర్వేటివ్‌ల మధ్య ప్రధాన పోటీ నెలకొంది.

లోతైన దర్యాప్తు జరపాల్సిందే

(మొదటి పేజీ తరువాయి)

వెల్లడించారని తెలిపారు. అదే రోజు తాను ఆ విషయాన్ని సీజేఐ దృష్టికి తీసుకువెళ్లిన విషయాన్నీ అందులో ప్రస్తావించారు. ప్రమాదం జరిగిన రోజు జస్టిస్ వర్మ వ్యక్తిగత కార్యదర్శి పోలీస్ కంట్రోల్ రూమ్‌కు ఫోన్ చేశారని.. అగ్నిమాపక కేంద్రానికి ఫోన్ చేయలేదని జస్టిస్ ఉపాధ్యాయ స్పష్టం చేశారు. అగ్నిప్రమాదం జరిగిన స్టోర్ రూమ్‌లోకి ఎవరో బలవంతంగా ప్రవేశించిన ఆనవాళ్లేవీ లేవని.. జస్టిస్ వర్మ కుటుంసభ్యులకు, పనివారికి మాత్రమే దాంట్లోకి ప్రవేశం ఉందని తేల్చిచెప్పారు. ఆ గదికి తాళం కూడా ఉందన్న విషయాన్ని.. 15వ తేదీ ఉదయం ఆ గది నుంచి సగం కాలిన వస్తువులు, ఇతర వ్యర్థాలను తొలగించిన విషయాన్ని.. అక్కడున్న సెక్యూరిటీ గార్డ్ ధ్రువీకరించాడని వెల్లడించారు. ఘటనాస్థలికి వెళ్లి వివరాలు తెలుసుకోవాల్సిందిగా తనకు కేటాయించిన రిజిస్ట్రార్ కమ్ సెక్రటరీని ఆదేశించానని.. లఖ్‌నవూ నుంచి వచ్చాక, 16వ తేదీన తాను స్వయంగా అక్కడికి వెళ్లి పరిశీలించానని చెప్పారు. అనంతరం సీజేఐని కలిసి వివరాలు సమర్పించినట్టు వెల్లడించారు. సీజేఐ ఆదేశాల మేరకు జస్టిస్ యశ్వంత్ వర్మతో ఫోన్‌లో మాట్లాడానని, 17వ తేదీన ఉదయం 8.30 గంటల సమయంలో ఆయన తనను కలిశారని చెప్పారు. "మంటలు చెలరేగిన స్టోర్ రూమ్‌లో పనికిరాని వస్తువులు, పాడైపోయిన గృహపకరణాలు, పాత ఫర్నిచర్, పరుపుల వంటివాటిని పడేస్తాం. పనివారికి, తోటపని చేసేవారికి కొన్ని సందర్భాల్లో సీపీడబ్ల్యూడీ (కేంద్ర ప్రజాపనుల విభాగం) సిబ్బందికి కూడా ఆ గది అందుబాటులో ఉంటుంది" అని జస్టిస్ వర్మ తనకు చెప్పినట్టు వెల్లడించారు. ఢిల్లీ పోలీస్ కమిషనర్ తనకు వాట్సాప్ ద్వారా షేర్ చేసిన ఫొటోలు, వీడియోలను (సగం కాలిన నోట్ల కట్టల తాలూకూ) చూపించగా.. అదంతా తనపై జరుగుతున్న కుట్రగా జస్టిస్ వర్మ పేర్కొన్నారని వివరించారు. 20వ తేదీన ఆ ఫొటోలు, వీడియోలను సీజేఐకి పంపినట్టు వెల్లడించారు. అదే రోజు సాయంత్రం.. జస్టిస్ వర్మను అలహాబాద్ హైకోర్టుకు బదిలీ చేయాలన్న ప్రతిపాదన గురించి తనకు సీజేఐ నుంచి సమాచారం వచ్చిందని, అందుకు తాను అంగీకరించానని పేర్కొన్నారు. అందుబాటులో ఉన్న వివరాలు, జస్టిస్ వర్మ స్పందన, పోలీసు కమిషనర్ ఇచ్చిన నివేదిక, తాను జరిపిన విచారణ ప్రకారం.. ఆ గదిలోకి పనివారు, తోటపనివారు, కుటుంబసభ్యులు, సీపీడబ్ల్యూడీ సిబ్బందికి తప్ప బయటివారెవరికీ ప్రవేశం లేదని తేల్చిచెప్పారు. ప్రాథమిక ఆధారాలు ఉన్నందున ఈ కేసులో మరింత లోతైన దర్యాప్తు అవసరమని అభిప్రాయపడ్డారు.

ఈ ప్రశ్నలు అడగండి..

ఢిల్లీ హైకోర్టు సీజే జస్టిస్ ఉపాధ్యాయ ఇచ్చిన నివేదికను పరిశీలించిన సుప్రీం సీజే జస్టిస్ సంజీవ్ ఖన్నా..



ఢిల్లీలోని జస్టిస్ యశ్వంత్ వర్మ నివాసం వద్ద పోలీసులు

- అసలు జస్టిస్ వర్మ ఇంటి ప్రాంగణంలో దొరికిన డబ్బుకు ఆయనకు సంబంధమేమిటి?
- స్టోర్ రూమ్‌లో కనిపించిన నగదు ఎక్కణ్నుంచీ వచ్చింది? దాని మూలమేమిటో వివరించాలి?
- మార్చి 15వ తేదీ ఉదయం.. సగం తగలబడిన నోట్లను ఎవరు తొలగించారు?

...అనే మూడు ప్రశ్నలూ జస్టిస్ వర్మను అడిగి, మార్చి 22 మధ్యాహ్నం 12 గంటల్లోగా ఆయన్నుంచి లిఖితపూర్వక సమాధానం తీసుకోవాలంటూ జస్టిస్ ఉపాధ్యాయకు లేఖ రాశారు. అలాగే, గత ఆరు నెలలుగా జస్టిస్ వర్మ వద్ద పనిచేస్తున్న వ్యక్తిగత భద్రతాధికారుల వివరాలను, ఆయన ఇంటివద్ద విధులు నిర్వర్తిస్తున్న భద్రతా సిబ్బంది వివరాలను పొందుపరచాలని పేర్కొన్నారు. జస్టిస్ వర్మ అధికారిక, వ్యక్తిగత ఫోన్ నంబర్లకు సంబంధించిన ఆరు నెల కాల్ రికార్డ్స్ వివరాలను ఇవ్వాల్సిందిగా సర్వీస్ ప్రొవైడర్లకు లేఖలు పంపాలని సూచించారు. అంతేకాదు.. తన మొబైల్ ఫోన్(ల)ను పారేయడం/అందులోని సంభాషణలను, మెసేజ్‌లను, డేటాను డిలీట్ చేయడం (లేదా) మార్చేయడం వంటివాటికి పాల్పడవద్దని జస్టిస్ వర్మకు సూచించాల్సిందిగా కూడా సీజేఐ ఆదేశించారు. జస్టిస్ వర్మ ఇచ్చిన లిఖితపూర్వక సమాధానాన్ని వెంటనే తనకు సమర్పించాలని.. అప్పుడు తదుపరి చర్యలు తీసుకుంటానని స్పష్టం చేశారు. ఈమేరకు.. జస్టిస్ ఉపాధ్యాయ జస్టిస్ వర్మకు ఆ మూడు ప్రశ్నలూ సంధించారు. వాటికి నిర్ణీతగడువులోపు జస్టిస్ వర్మ సమాధానమిచ్చారు. ఆ గదిలో పనికిరాని వస్తువులే ఉంటాయని పునరుద్ఘాటించారు. ఆ గదిలోకి తన ఇంటి ముందువైపు గేటు నుంచి, వెనకవైపు స్టాఫ్ క్వార్టర్స్ నుంచి ప్రవేశించవచ్చని.. పైగా, అది ప్రధాన నివాసానికి దూరంగా ఉందని.. వివిధ పత్రికల్లో వచ్చినట్టుగా అది తన ఇంట్లో భాగం కాదని పేర్కొన్నారు. మంటలు ఆర్పే క్రమంలో అగ్నిమాపక సిబ్బంది తమ ఇంట్లో ఉన్నవారందరినీ అక్కణ్నుంచీ దూరంగా పంపించారని తెలిపారు. మంటలు ఆరిన తర్వాతే వారంతా అక్కడికి వచ్చారని.. అక్కడ డబ్బు ఆనవాళ్లేవీ లేవని వెల్లడించారు. "ఆ స్టోర్‌రూమ్‌లో నేనుగానీ, నా కుటుంబసభ్యులుగానీ ఎలాంటి డబ్బూ పెట్టలేదని రూఢిగా చెప్తున్నాను. ఆ డబ్బు మాదేనన్న ఆరోపణను నిర్ద్వంద్వంగా తిరస్కరిస్తున్నాను. అక్కడ మేము డబ్బు భద్రపరిచామన్న మాటే పూర్తిగా అసంబద్ధం. అందరూ ఉపయోగించే, స్వేచ్ఛగా వచ్చిపోగలిగే చోట.. స్టాఫ్ క్వార్టర్స్‌కు సమీపంలో అందరూ ఉపయోగించే స్టోర్ రూమ్‌లో డబ్బును దాచిపెడతారన్న ఆలోచనే విడ్డూరమైనది, నమ్మశక్యం కానిది." అని పేర్కొన్నారు. మార్చి 15న తాను భోపాల్ నుంచి వచ్చాక అక్కడికి వెళ్లి చూశానని.. అక్కడ ఎలాంటి నగదు ఆనవాళ్లూ లేవని తెలిపారు. మార్చి 15న ఉదయం తమ సిబ్బందిలో ఎవరూ ఆ గదిలోంచి నగదును తొలగించలేదని చెప్పారు. "అవుట్‌హౌస్‌లోని స్టోర్‌రూమ్‌లో డబ్బు ఉన్న విషయం నాకుగానీ, నా కుటుంబసభ్యులకుగానీ తెలియదు. మాకు దాంతో ఏ సంబంధమూ లేదు. అందుచేత.. ఆ డబ్బు ఎక్కడి నుంచి వచ్చిందో చెప్పాలనే ప్రశ్నే ఉత్పన్నం కాదు. ఆ గదిలో నుంచి మేం నగదును తొలగించామన్న ఆరోపణను నేను గట్టిగా, పూర్తిగా తిరస్కరిస్తున్నాను. తగలబడ్డట్టుగా చెబుతున్న నోట్లను మాకెవరూ చూపలేదు, అప్పగించనూ లేదు." అని వివరణ ఇచ్చారు. తన నివాసంలో నోట్ల కట్టలు బయటపడ్డాయన్న ఆరోపణలను.. తనను ఇరికించడానికి, తన పేరు ప్రతిష్ఠలను దెబ్బతీయడానికి జరుగుతున్న కుట్రగా అభివర్ణించారు. ఆయన ఇచ్చిన సమాధానాలతో జస్టిస్ డీకే ఉపాధ్యాయ.. సీజేఐకి మరో లేఖ రాశారు. దాంతోపాటు, ఆయన మొబైల్‌ఫోన్లకు సంబంధించిన ఆర్నెల్ల కాల్ డేటా రికార్డుల వివరాలనూ పెన్‌డ్రైవ్‌లో వేసి సమర్పించారు.



జస్టిస్ యశ్వంత్ వర్మ ఇంటి ప్రాంగణంలో కాలిపోయి కనిపించిన కరెన్సీ నోట్లు



సగం కాలిన నోట్లు మేం చూశాం

పారిశుధ్య కార్మికుల వెల్లడి

స్టోర్ రూమ్‌లో నోట్ల కట్టలను తానుగానీ, తన కుటుంబసభ్యులుగానీ చూడలేదని జస్టిస్ యశ్వంత్ వర్మ.. జడ్జి ఇంట్లో నోట్ల కట్టలే దొరకలేదని ఢిల్లీ ఫైర్ సర్వీసెస్ డీజీ.. చెబుతున్నప్పటికీ, ఆ ప్రాంతంలో వీధులను శుభ్రం చేసే పారిశుధ్య పనివారు మాత్రం నాలుగైదు రోజుల క్రితం జస్టిస్ యశ్వంత్ వర్మ నివాసానికి సమీపంలో కాలిన రూ.500 నోట్లు తమకు కనిపించాయని చెప్పడం గమనార్హం. "జస్టిస్ యశ్వంత్ వర్మ నివాసం ఉన్న సర్కిల్‌లో మేం పనిచేస్తాం. వీధుల్లో చెత్తను సేకరిస్తాం. నాలుగైదు రోజుల క్రితం ఈ ప్రాంతాన్ని శుభ్రం చేస్తుండగా.. (కాలిన) రూ.500 నోట్ల ముక్కలు కనిపించాయి. అయితే, అగ్ని ప్రమాదం ఎక్కడ జరిగిందో మాకు తెలియదు" అని ఇందర్‌జీత్ అనే పారిశుధ్య కార్మికుడు ఏఎన్ఐ వార్తా సంస్థకు తెలిపాడు. సురేందర్ అనే మరో పారిశుధ్య కార్మికుడు కూడా.. అక్కడ కాలిన రూ.500 నోట్లు దొరికినట్టు వెల్లడించాడు. "ఇప్పటికి కూడా మాకు కొన్ని నోట్లు కనిపిస్తున్నాయి" అని అతడు పేర్కొనడం గమనార్హం. కాగా.. ఈ వ్యవహారంపై త్రిసభ్య కమిటీని నియమించిన సుప్రీంకోర్టు కొన్నాళ్లపాటు జస్టిస్ యశ్వంత్‌వర్మకు ఎలాంటి జ్యుడీషియల్ వర్క్ అప్పగించొద్దని ఢిల్లీ హైకోర్టు సీజే జస్టిస్ ఉపాధ్యాయకు సూచించింది.

ప్రాంతీయ భాషల్లో సుప్రీంకోర్టు తీర్పులు

- కృత్రిమ మేధతో అనువాదం
- కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ వెల్లడి



న్యూఢిల్లీ, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు తీర్పులను ప్రాంతీయ భాషల్లో అందుబాటులోకి తీసుకొస్తున్నట్టు కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ తెలిపారు. కృత్రిమ మేధ(ఏఐ) సాంకేతికతో అనువదించే ప్రక్రియ జరుగుతోందని చెప్పారు. కృత్రిమ మేధ (ఏఐ), మెషీన్ లెర్నింగ్ (ఎంఎల్)ల సహకారంతో కోర్టుల్లో జరిగే వాదనలు, తీర్పులను ప్రాంతీయ భాషల్లోకి అనువదించే ప్రక్రియ జరుగుతోందని తెలిపారు. నేషనల్ ఇన్‌ఫర్మాటిక్ సెంటర్ (ఎన్ఐసీ) ఇందులో కీలకపాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు. పార్లమెంటులో ఇటీవల మాట్లాడుతూ ఈ విషయాలను వెల్లడించారు. తెలుగుతోపాటు అస్సామీ, బెంగాలీ, గారో, గుజరాతీ, హిందీ, కన్నడ, కశ్మీరీ, ఖాసీ, కొంకణి, మలయాళం, మరాఠీ, నేపాలీ, ఒడియా, పంజాబీ, సంథాలీ, తమిళం, ఉర్దూల్లోకి అనువదిస్తున్నట్టు వివరించారు. ఇందుకోసం సుప్రీంకోర్టు రిజిస్ట్రీ.. ఐఐటీ-మద్రాసు సహకారం తీసుకుంటోందని తెలిపారు. అనువాదాలకు సంబంధించిన నమూనాలను 200 మంది అడ్వకేట్ ఆన్ రికార్డు(ఏవోఆర్)లకు అందించామని పేర్కొన్నారు. వాటిపై వారి అభిప్రాయాలను కోరామని తెలిపారు. ఏఐ సాంకేతికతను కేవలం కోర్టులోని వాదనలు, తీర్పుల అనువాదానికి మాత్రమే పరిమితం చేస్తున్నామని, న్యాయ నిర్ణయంలో ఎటువంటి పాత్ర ఉండబోదని స్పష్టం చేశారు.

చైనా ఉత్పత్తులపై భారత్ సుంకం

- చవక సరుకుల నుంచి దేశీయ పరిశ్రమలను కాపాడటానికే నిర్ణయం
- ఫ్లాస్కులు, అల్యూమినియం ఫాయిల్స్ సహా ఐదు రకాల ఉత్పత్తులకు వర్తింపు



న్యూఢిల్లీ, మార్చి 23: ఫ్లాస్కులు, పలచటి అల్యూమినియం రేకులు (ఫాయిల్స్) సహా మొత్తం ఐదు రకాల చైనా ఉత్పత్తులపై భారత్ యాంటీ డంపింగ్ సుంకాన్ని విధించింది. చైనా నుంచి దిగుమతి అయ్యే చవక ఉత్పత్తుల నుంచి దేశీయ పరిశ్రమలను రక్షించే లక్ష్యంతో కేంద్రం ఈ చర్య తీసుకుంది. వీటిలో సాఫ్ట్ ఫెర్రైట్ కోర్స్, వాక్యూమ్‌తో కూడిన ఫ్లాస్కులు, అల్యూమినియం ఫాయిల్స్, ట్రైక్లోరో ఐసోసైనారిక్ యాసిడ్, పాలీవినైల్ క్లోరైడ్ పేస్ట్ రెజిన్ ఉన్నాయి. వీటి మీద సుంకాలను టన్నుకు 276 డాలర్ల నుంచి అత్యధికంగా 1732 డాలర్ల వరకూ విధించారు. ఈ మేరకు కేంద్ర ఆర్థికశాఖకు చెందిన 'పరోక్ష పన్నులు, కస్టమ్స్ సుంకాల సెంట్రల్ బోర్డు' వేర్వేరు నోటిఫికేషన్లను జారీ చేసింది. తాజా సుంకాలు అల్యూమినియం ఫాయిల్స్‌పై ఆర్నెళ్లపాటు, మిగిలిన ఉత్పత్తుల మీద ఐదేళ్లపాటు అమల్లో ఉంటాయని పేర్కొంది. పాలీవినైల్ క్లోరైడ్ పేస్ట్ రెజిన్ విషయంలో మాత్రం చైనాతోపాటు కొరియా, మలేషియా, నార్వే, తైవాన్, థాయ్‌లాండ్ దేశాలకు చెందిన వాటి మీద కూడా ఐదేళ్లపాటు నిషేధం ఉంటుందని తెలిపింది.

ఆహారం వద్దు.. గంజాయి కావాలి!

- జైలులో ముస్కాన్, ఆమె ప్రియుడి రచ్చ

న్యూఢిల్లీ, మార్చి 23: మేరఠ్‌లో మర్చంట్ నేవీ అధికారి సౌరభ్ రాజ్‌పుత్ హత్య కేసులో అరెస్టయిన సౌరభ్ భార్య ముస్కాన్ రస్తోగి, ఆమె ప్రియుడు సాహిల్ జైలులో రచ్చరచ్చ చేస్తున్నారు. మాదకద్రవ్యాలకు బానిసలైన ముస్కాన్, సాహిల్.. తమకు ఆహారం వద్దని, మత్తు కావాలని జైలులో నానాయాగీ చేస్తున్నారు. జైలుకు వచ్చిన రోజు రాత్రి సాహిల్.. గంజాయి ఇవ్వండంటూ రచ్చరచ్చ చేశాడని పోలీసులు వెల్లడించారు. అలాగే, ముస్కాన్ కూడా మత్తు ఇంజక్షన్ల కోసం గొడవ చేసిందని తెలిపారు. మాదకద్రవ్యాలకు బానిసలైన వీరిద్దరికీ జైలు అధికారులు వైద్య సాయం అందిస్తున్నారు. ఇద్దరూ సాధారణ స్థితికి రావడానికి కనీసం 10 రోజులు పడుతుందని వైద్యులు చెబుతున్నారు. ఇక, తనకు న్యాయవాదిని కేటాయించాలని ముస్కాన్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది.

కొడుకు గొంతు కోసిన తల్లి

అమెరికాలో భారత సంతతి మహిళ అరెస్టు

న్యూయార్క్, మార్చి 23: అమెరికాలో ఓ భారత సంతతి మహిళ కన్నప్రేమను మరిచి అమానుషంగా ప్రవర్తించింది. విడాకులు తీసుకుని భర్తకు దూరంగా ఉంటున్న ఆమె.. 11 ఏళ్ల వయస్సు ఉన్న తన కొడుకుని మాజీ భర్తకు అప్పగించడం ఇష్టం లేక ఆ బాలుడి గొంతు కోసి ప్రాణం తీసింది. అమెరికాలోని కాలిఫోర్నియాలో మార్చి 19న జరిగిన ఈ హత్యకు సంబంధించి సరిత(48) అనే మహిళ అరెస్టైంది. సరిత 2018 జనవరిలో తన భర్త ప్రకాశ్‌కు విడాకులు ఇచ్చింది. అయితే, వారి కొడుకు యతిన్(11) బాధ్యతను కోర్టు ప్రకాశ్‌కు అప్పగించింది. ఐదు రోజుల పాటు యతిన్‌ను తన వద్ద ఉంచుకునేలా కోర్టు అనుమతి పొందిన సరిత మార్చి 14న తనతో తీసుకువెళ్లింది. మార్చి 19న తిరిగి ప్రకాశ్ దగ్గరకు పంపాల్సి ఉండగా.. అది ఇష్టం లేక యతిన్ గొంతుకోసింది.

వక్ఫ్ బిల్లు.. రాజ్యాంగంపై దాడి!

- మత సామరస్యాన్ని దెబ్బతీసే బీజేపీ వ్యూహంలో భాగమే: జైరాం రమేశ్



న్యూఢిల్లీ, మార్చి 23: కేంద్రం తీసుకొచ్చిన వక్ఫ్ (సవరణ) బిల్లును రాజ్యాంగంపై దాడిగా కాంగ్రెస్ పేర్కొంది. శతాబ్దాల కాలం నుంచి బలంగా ఉన్న మన దేశ బహుళ మత సమాజ సామరస్యాన్ని దెబ్బతీసేందుకు బీజేపీ నిరంతరంగా చేస్తున్న ప్రయత్నాల్లో భాగంగా దీన్ని తీసుకొచ్చారని ఆరోపించింది. తప్పుడు ప్రచారం చేయడం, దురభిప్రాయాలను సృష్టించడం ద్వారా మైనారిటీ వర్గాలను బూచిగా చూపేందుకు బీజేపీ యత్నిస్తోందని విమర్శించింది. వక్ఫ్ బిల్లు పూర్తిగా లోపభూయిష్టమని కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వక్ఫ్‌లను నిర్వహించేందుకు గత చట్టాల ద్వారా ఏర్పాటు చేసిన సంస్థల స్థాయి, అధికారాన్ని తగ్గించేందుకు యత్నిస్తున్నారని పేర్కొన్నారు. వక్ఫ్ ప్రయోజనాల కోసం భూమిని ఎవరు దానం చేయవచ్చో నిర్ణయించడంపై ఉద్దేశపూర్వకంగా అస్పష్టత ఇచ్చారని, వక్ఫ్ నిర్వచనాన్నే మార్చారని రమేశ్ ఆరోపించారు. వక్ఫ్ పాలనను బలహీనం చేసేందుకు ప్రస్తుతం ఉన్న చట్టంలోని నిబంధనలు తొలగించారని, వక్ఫ్ భూములను ఆక్రమించిన వారికి రక్షణ కల్పించేలా మార్పులు చేశారని ఆరోపించారు. వక్ఫ్ ఆస్తులపై వివాదాలు, వాటి రిజిస్ట్రేషన్‌కు సంబంధించిన అంశాలపై కలెక్టర్లు, నియమించిన ఇతర రాష్ట్ర ప్రభుత్వ అధికారులకు విశేష అధికారాలు కల్పించడాన్ని ఆయన తప్పుబట్టారు.

బిల్లుకు వ్యతిరేకంగా దేశవ్యాప్త ఆందోళన

వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా దేశ వ్యాప్త ఆందోళన చేపట్టనున్నట్టు ఆదివారం ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు ప్రకటించింది. ఈ నెల 17న ఢిల్లీలో నిర్వహించిన నిరసన ప్రదర్శన విజయవంతం కావడంతో జాతీయస్థాయి ఆందోళన జరపాలని కార్యాచరణ రూపొందించినట్టు తెలిపింది. ఇందుకోసం 31 మందితో యాక్షన్ కమిటీని ఏర్పాటు చేసింది. మొదట దశలో భాగంగా ఈ నెల 26న పట్నాలోని అసెంబ్లీ ఎదుట, 29న విజయవాడ (అమరావతి)లోని అసెంబ్లీ ఎదుట ధర్నాలు చేయనున్నట్టు తెలిపింది. 'వక్ఫ్ బిల్లుకు మద్దతు ఉపసంహరించండి...లేకుంటే మా మద్దతును కోల్పోతారు' అన్న సందేశాన్ని బీజేపీ మిత్ర పక్షాలకు పంపించడమే ఈ ధర్నాల ఉద్దేశమని పేర్కొన్నారు. అన్ని రాష్ట్రాల రాజధానుల్లో ప్రదర్శనలను జరుపుతామని, ముఖ్యంగా హైదరాబాద్, ముంబయి. కోల్‌కతా, బెంగళూరు, మలేర్‌కోట్లా (పంజాబ్), రాంచీల్లో భారీ ఊరేగింపులు ఉంటాయని వివరించారు.

ఎన్నికల సంఘం ఓ విఫల సంస్థ

- డీలిమిటేషన్‌తో దేశ రాజకీయాలపై తీవ్ర ప్రభావం: కపిల్ సిబ్బల్

న్యూఢిల్లీ, మార్చి 23: "ఎన్నికల సంఘం ఓ విఫల సంస్థ" అని సీనియర్ న్యాయవాది, రాజ్యసభ ఎంపీ కపిల్ సిబ్బల్ ఆరోపించారు. రాజ్యాంగంలో పేర్కొన్నట్లు ఆ సంస్థ తన విధులను నిర్వర్తించడం లేదని, సమాజంలో అత్యధిక శాతం ప్రజలు దానిపై నమ్మకం కోల్పోయారని చెప్పారు. ఈ సమస్యను తక్షణం పరిష్కరించడం ద్వారానే ప్రజాస్వామ్యాన్ని కాపాడగలమన్నారు. డీలిమిటేషన్ అంశం దేశ రాజకీయాలపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. పీటీఐకి ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ.. దేశ న్యాయ వ్యవస్థపై ప్రజలకు నమ్మకం తగ్గుతోందన్నారు. జడ్జిల నియామకంతోపాటు ప్రస్తుతం ఉన్న వ్యవస్థ సరిగ్గా పనిచేయడం లేదని.. ఈ సమస్యను ప్రభుత్వం, న్యాయ వ్యవస్థ గుర్తించినప్పుడే ఇందులో మార్పు వస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. 'ఇండియా' కూటమి గురించి మాట్లాడుతూ.. అందులోని పార్టీలు కూటమిగానే వ్యవహరించాలన్నారు. వాటికి ఒకే విధానం, సిద్ధాంతం, భవిష్యత్ కార్యాచరణ ఉండాలన్నారు. ఇటీవల కొన్ని రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో అవి వ్యవహరించిన తీరు సరికాదని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, దేశంలో జనాభా గణన ఇంకా జరగనందున ఇప్పటికిప్పుడు డీలిమిటేషన్ సాధ్యం కాదని సిబ్బల్ అన్నారు.

నిందితుల ఇళ్ల కూల్చివేత రాజ్యాంగంపై బుల్డోజర్ నడపడమే

- సుప్రీంకోర్టు జడ్జి జస్టిస్ భుయాన్ వ్యాఖ్యలు

పుణె, మార్చి 22: 'బుల్డోజర్ న్యాయాన్ని' సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్ తీవ్రంగా వ్యతిరేకించారు. నిందితుల ఇళ్లను బుల్డోజర్లతో కూల్చివేయడమంటే చట్టబద్ధమైన పాలనను కాదనడమేనని అన్నారు. ఇది రాజ్యాంగంపై బుల్డోజర్‌ను నడిపించడంలాంటిదేనని వ్యాఖ్యానించారు. ఆదివారం ఇక్కడి భారతి విద్యాపీఠ్ న్యూ లా కాలేజీలో జరిగిన 13వ పి.ఎన్.భగవతి అంతర్జాతీయ మూట్ కోర్టు పోటీల్లో ఆయన ప్రసంగించారు. మొదట ఇల్లును కూల్చివేసి, అనంతరం దాన్ని అక్రమ కట్టడమని చెప్పి సమర్థించుకోవడం ఆందోళనకరమని చెప్పారు.

50 వేలు దాటిన పాలస్తీనా మృతుల సంఖ్య

టెల్ అవీవ్ మార్చి23: ఇజ్రాయెల్ ఆదివారం జరిపిన తాజా వైమానిక దాడుల్లో 26 మంది పాలస్తీనియన్లు ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో హమాస్ సీనియర్ రాజకీయ నేత సలా బర్దావిల్, ఆయన భార్య కూడా ఉన్నారు. దీంతో మొత్తం మృతుల సంఖ్య 50 వేలకు చేరింది. హమాస్ బందీలుగా చేసుకున్న వారిని విడిచిపెట్టకపోతే దాడులు మరింత ఉధృతం చేస్తామని ఇజ్రాయెల్ హెచ్చరించింది. తాజాగా ఇజ్రాయెల్ యుద్ధ ట్యాంకులు రఫా పట్టణంలోకి దూసుకుపోయాయి.

ప్రముఖ గాంధేయవాది కృష్ణభారతి కన్నుమూత



92 ఏళ్ల వయసులో హైదరాబాద్‌లో తుదిశ్వాస

- సేవాభావంతో దేశాన్ని ఆకర్షించిన కృష్ణభారతి
- తల్లిదండ్రులనుంచి స్వాతంత్ర్య సమర వారసత్వం
- జైలులో జన్మించడంతో కృష్ణ భారతిగా నామకరణం
- అల్లూరి విగ్రహసభలో కృష్ణభారతికి మోదీ పాదాభివందనం
- రాష్ట్రంలో విద్యావ్యాప్తికి అసమాన కృషి : చంద్రబాబు నివాళి
- హైదరాబాద్‌లో ముగిసిన అంత్యక్రియలు

తాడేపల్లిగూడెం రూరల్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ గాంధేయవాది పసల కృష్ణభారతి (92) కన్నుమూశారు. ఆదివారం హైదరాబాద్‌లోని స్నేహపురి కాలనీలోని సోదరి నివాసంలో ఆమె తుది శ్వాస విడిచారు. సమాజంలోని చివరి వ్యక్తి వరకు విద్యను తీసుకెళ్లడంకోసం సేవాభావంతో కృష్ణభారతి చేసిన కృషి యావత్తు దేశాన్ని ఆకర్షించింది. పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో 2022 జూలైలో జరిగిన మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు విగ్రహ ఆవిష్కరణ సభలో కృష్ణ భారతికి ప్రధానమంత్రి నరేంద్రమోదీ పాదాభివందనం చేసి సత్కరించారు. వృద్ధాప్య సమస్యలతో బాధపడుతున్న ఆమె హైదరాబాద్‌లోని తన సోదరి వీణ నివాసంలో కొంతకాలంగా ఉంటున్నారు. అక్కడే కృష్ణభారతి మృతిచెందారు. ఆమె పార్థివదేహానికి బంధువులు, ఆత్మీయుల సమక్షంలో హైదరాబాద్‌లో అంత్యక్రియలు ముగిశాయి. కృష్ణభారతికి నలుగురు అన్నదమ్ములు, ముగ్గురు అక్కచెల్లెళ్లు ఉన్నారు.



కృష్ణభారతి నుంచి ఆశీస్సులు తీసుకుంటున్న ప్రధాని మోదీ (ఫైల్)

కృష్ణ జన్మస్థానంలో జననం..


పశ్చిమగోదావరి జిల్లా పెంటపాడు మండలం పడమర విప్పర్రుకు చెందిన ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు పసల కృష్ణమూర్తి, అంజలక్ష్మి దంపతుల రెండో కుమార్తె కృష్ణభారతి. జాతీయోద్యమంలో భాగంగా వారు జైలు జీవితం గడిపారు. జైలుకు వెళ్లే సమయానికి అంజలక్ష్మి ఆరునెలల గర్భిణి. జైలులోనే కృష్ణభారతికి జన్మనిచ్చారు. కారాగారంలో జన్మించిన శ్రీకృష్ణుణ్ణి, స్వతంత్ర భారత ఆకాంక్షను గుర్తుచేస్తూ కుమార్తెకు వారు కృష్ణ భారతి అని నామకరణం చేశారు. ఆమె అన్నప్రాసన జైలులోనే తోటి రాజకీయ ఖైదీల సమక్షంలో జరిగింది. పుట్టిన పదినెలల వరకు బాల్యం జైలులోనే గడిచింది.

సమరయోధుల పింఛన్ తిరస్కరించి..

కృష్ణభారతి తల్లిదండ్రులు వారి ఆస్తిమొత్తాన్ని స్వాతంత్ర్య పోరాటం కోసం దానం చేశారు. వారి స్ఫూర్తితో ఆమె చివరివరకు గాంధేయవాదిగా గడిపారు. అవివాహితగా పూర్తి జీవితం సమాజ సేవకే అంకితం చేశారు. తాడేపల్లిగూడెం కేంద్రంగా అనేక సాంఘిక సంస్కరణలను ఆమె చేపట్టారు. దళితుల్లో విద్యావ్యాప్తికి కృషిచేశారు. గోశాలలకు భారీ విరాళాలు సమకూర్చారు. తనకు సంక్రమించిన నాలుగు ఎకరాల భూమిని హరిజనవాడకు అందించారు. మరో ఎకరాన్ని విద్యాసంస్థలకు దానం చేశారు. కుష్ఠురోగులకు సేవలు అందించారు. జైలులో పుట్టినందున కేంద్ర ప్రభుత్వం కృష్ణభారతిని స్వాతంత్ర్య సమరయోధురాలుగా పరిగణించి పెన్షన్ ఇచ్చేందుకు ముందుకు వచ్చింది. అయితే దానిని ఆమె తిరస్కరించారు.

బ్రిటిష్ ఆంక్షలు ధిక్కరించి జెండా రెపరెపలు..

గాంధీజీ పశ్చిమ గోదావరిజిల్లా పర్యటనకు వచ్చినప్పుడు కృష్ణ భారతి తండ్రి కృష్ణమూర్తి ఆయనకు వ్యక్తిగత కార్యదర్శిగా పనిచేశారు. బ్రిటిష్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన తీవ్ర ఆంక్షలు ధిక్కరించి భీమవరం సబ్ కలెక్టర్ కార్యాలయంపై 1932లో భారత జాతీయ జెండా ఎగురవేశారు. ఇందుకుగాను సతీమణి అంజలక్ష్మితో కలిసి ఆయన జైలుశిక్ష అనుభవించారు. స్వాతంత్ర్యానంతరం వినోబా భావే భూదానోద్యమంలో కృష్ణమూర్తి, అంజలక్ష్మి పాల్గొని తన గ్రామంలో దళితులకు ఇళ్ల పట్టాలు ఇప్పించారు. వారికి నిజమైన వారసురాలిగా కృష్ణ భారతి నిలిచారని పలువురు నివాళులు అర్పించారు. ఆమె మృతి పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు సంతాపం ప్రకటించారు. రాష్ట్రంలో విద్యావ్యాప్తికి అసమాన కృషి చేశారంటూ 'ఎక్స్'ఖాతాలో నివాళులు అర్పించారు.



ప్రముఖ పారిశ్రామికవేత్త నార్నే రంగారావు జ్ఞాపకార్థం ఆయన సతీమణి డాక్టర్ శాంతారావు అన్న క్యాంటీన్‌కు విరాళంగా రూ.కోటి వెయ్యి నూటపదహార్ల చెక్కును సీఎం చంద్రబాబుకు అందజేస్తున్న దృశ్యం

'అన్న క్యాంటీన్'కు నార్నే ఎస్టేట్స్ కోటి విరాళం

- సీఎం చంద్రబాబుకు చెక్కు అందజేత

అమరావతి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పారిశ్రామికవేత్త, ఏపీ రియల్ ఎస్టేట్ డెవలపర్స్ వ్యవస్థాపకులు, చైర్మన్ నార్నే రంగారావు జ్ఞాపకార్థం ఆయన సతీమణి డాక్టర్ శాంతారావు 'అన్న క్యాంటీన్'కు రూ.కోటి విరాళం ఇచ్చారు. ఈ మేరకు ఆదివారం హైదరాబాద్‌లో సీఎం చంద్రబాబుకు రూ.1,00,01,016 చెక్కు అందజేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక అన్న క్యాంటీన్లను తిరిగి ప్రారంభించిన సమయంలో నారా భువనేశ్వరి రూ.కోటి విరాళంగా ఇచ్చి తనకు స్ఫూర్తి నింపారని శాంతారావు అన్నారు. అనారోగ్యం కారణంగా చనిపోవడానికి ఒకరోజు ముందు రూ.కోటి విరాళం అందించే విషయాన్ని తన భర్త గుర్తుచేశారని తెలిపారు. దీంతో రంగారావు మరణాంతరం ఆయన కుమార్తె, నార్నే ఎస్టేట్స్ డైరెక్టర్ అడుసుమిల్లి దీప, వైట్ ఫీల్డ్ బయో ఎండీ అడుసుమిల్లి నరేష్‌కుమార్‌తో కలిసి వచ్చి.. శాంతారావు ఈ విరాళాన్ని సీఈవో నార్నే గోకుల్ తోడ్పాటుతో రాష్ట్ర ప్రభుత్వానికి అందజేశారని సీఎం చంద్రబాబు ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు. పేదలకు రూ.5కే అన్నం పెట్టాలన్న ఆలోచనకు ఇలాంటి వారి మంచి మనస్సు ఎంతో దోహదం చేస్తుందని అన్నారు. ఎంతో నిజాయితీగా, ఆదర్శ జీవితాన్ని గడిపిన నార్నే రంగారావు కాలం చేయడానికి ఒక రోజు ముందు కూడా అన్న క్యాంటీన్లకు విరాళం గురించి భార్యకు గుర్తు చేయడం వారి గొప్ప మనస్సుకు నిదర్శనమని కొనియాడారు. రియల్ ఎస్టేట్ రంగంలో రంగారావు చేసిన సేవల్ని స్మరించుకుంటూ, వారి కుటుంబసభ్యులకు ధన్యవాదాలు తెలిపారు.

ఏపీ మాజీ సైనిక సంక్షేమ సంఘానికి నూతన కార్యవర్గం

విజయవాడ(గవర్నర్‌పేట), మార్చి 23(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ సైనిక సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా తాండ్ర వెంకట సాంబశివ రావు ఎన్నికయ్యారు. విజయవాడలోని స్వాతంత్ర్య సమరయోధుల భవన్‌లో ఆదివారం రాష్ట్రంలోని 130 స్థానిక అసోసియేషన్ సంఘాల ప్రతినిధులు, మాజీ సైనిక సభ్యులు 'ఒకే రాష్ట్రం-ఒకే సంఘం' అనే నినాదంతో నూతన సంఘాన్ని ఏర్పాటు చేసుకుని ఎన్నికలు నిర్వహించారు. నూతన కమిటీ అధ్యక్షుడిగా తాండ్ర వెంకట సాంబశివరావు, ఉపాధ్యక్షుడిగా పి.విశ్వేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ సూరెడ్డి శివకుమార్, జాయింట్ సెక్రటరీగా మన్మథరావు, ట్రెజరర్‌గా కె.ఉమామహేశ్వరరావు ఎన్నికైనట్టు ఎన్నిక నిర్వహణ కమిటీ తెలిపింది.

దేశాన్ని అదానీకి దోచిపెడుతున్న మోదీ: సీపీఐ రామకృష్ణ



అనంతపురం విద్య, మార్చి 23(ఆంధ్రజ్యోతి): దేశ సంపదను ప్రధాని మోదీ.. అదానీకి దోచిపెడుతున్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ ఆరోపించారు. అనంతపురంలో ఆదివారం నిర్వహించిన సీపీఐ బహిరంగ సభకు ముఖ్య అతిథిగా హాజరైన రామకృష్ణ మాట్లాడుతూ... మోదీ దేశానికి చేసిందేమీ లేదని, ఎన్నికల వాగ్దానాలేవీ అమలు చేయలేదని విమర్శించారు. ఏడాదికి 2 కోట్ల ఉద్యోగాలిస్తామన్న హామీ ఏమైందో చెప్పాలని ప్రశ్నించారు. బీజేపీ మతోన్మాద, ప్రజావ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్తామన్నారు. ఏప్రిల్ 14 వరకూ 26 జిల్లాల్లో ప్రచారం చేస్తామని తెలిపారు. గడిచిన 7 నెలల్లో ఏపీకి రూ.3 లక్షల కోట్లు ఇచ్చామని బీజేపీ చెబుతోందని, ఆ నిధులు ఎక్కడికెళ్లాయని ప్రశ్నించారు. కేంద్రంలోని ఎన్డీఏ, ఏపీలో కూటమి డబుల్ ఇంజన్ సర్కారంటూ చంద్రబాబు, పవన్ చెబుతున్నారని.. ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చకపోతే ఎర్ర జెండా పార్టీలతో ఏకమై... తాము కూడా డబుల్, ట్రిపుల్ ఇంజన్‌తో కొడతామంటూ రామకృష్ణ హెచ్చరించారు.

వృద్ధుడి సజీవ దహనం కేసులో 9 మంది అరెస్టు

పాడేరు, మార్చి 23(ఆంధ్రజ్యోతి): అరకులోయ మండలంలో వృద్ధుడు డొంబ్రు సజీవ దహనం కేసులో తొమ్మిది మందిని అరెస్టు చేశామని జిల్లా ఎస్పీ అమిత్ బర్దార్ తెలిపారు. ఆదివారం తన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ చిల్లంగి చేస్తున్నాడనే అనుమానంతోనే డుంబ్రిగుడలో అడారి డొంబు (60)ను హతమార్చారని, ఈ కేసులో తొమ్మిది మంది నిందితులను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించామన్నారు. ఏజెన్సీలో హుకుంపేట, డుంబ్రిగుడ, అరకులోయ, అనంతగిరి మండలాల్లో మూఢనమ్మకాల ప్రభావం అధికంగా ఉందన్నారు. ఈ క్రమంలో ఆ నాలుగు మండలాల్లో మూఢ నమ్మకాలపై గిరిజనులకు అవగాహన కార్యక్రమాలు చేపడతామన్నారు. సచివాలయాల సిబ్బంది, ఇతర ఉద్యోగులను భాగస్వాములను చేసి మూఢ నమ్మకాలపై ప్రజలను చైతన్యం చేస్తామన్నారు.

ఏప్రిల్ నుంచే ఇంటర్ తరగతులు

- 7వ తేదీ నుంచి అడ్మిషన్లు.. మధ్యలో వేసవి సెలవులు
- వచ్చే ఏడాది నుంచి ఎంబైపీసీ.. గణితం, సైన్స్ సబ్జెక్టులు విలీనం
- విద్యాసంవత్సరం క్యాలెండర్ సిద్ధం.. త్వరలో ప్రకటన

అమరావతి, మార్చి 23(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ విద్యలో ప్రభుత్వం కీలక మార్పులు తీసుకు రానుంది. ఓవైపు విద్యాపరంగా అనేక సంస్కరణలు తీసుకువచ్చారు. తాజాగా విద్యా సంవత్సర కాలాన్ని కూడా మార్పు చేశారు. ఏటా జూన్ 1 నుంచి ఇంటర్ విద్యా సంవత్సరం ప్రారంభమవుతుంది. కానీ, ఈ ఏడాది నుంచి ఏప్రిల్ 1 నుంచే ఇంటర్ విద్యా సంవత్సరం ప్రారంభం కానుంది. ఈ మేరకు ఇంటర్ విద్యామండలి అకడమిక్ క్యాలెండర్‌ను సిద్ధం చేసింది. దీని ప్రకారం 2025-26 ఇంటర్ విద్యా సంవత్సరం రానున్న ఏప్రిల్‌లోనే ప్రారంభమవుతుంది. 23వ తేదీ వరకు తరగతులు నిర్వహిస్తారు. ఏప్రిల్ 7వ తేదీ నుంచి అడ్మిషన్లు మొదలుకానున్నాయి. అదే నెల 24 నుంచి మే నెలాఖరు వరకు వేసవి సెలవులు ఇస్తారు. జూన్ 1న మళ్లీ కాలేజీలు పునఃప్రారంభమవుతాయి. అయితే, ఈ ఏడాది జూన్1 ఆదివారం కావడంతో 2న కాలేజీలు తిరిగి ప్రారంభమవుతాయి. మొత్తం 235 రోజుల పాటు ఇంటర్ తరగతులు నిర్వహించేలా విద్యా సంవత్సరం క్యాలెండర్‌ను రూపొందించారు. వేసవి సెలవులు కాకుండా 79 సెలవులు విద్యా సంవత్సరంలో ఉంటాయి. అలాగే వచ్చే ఏడాది నుంచి సబ్జెక్టుల్లోనూ ఇంటర్ బోర్డు సమూల మార్పులు చేసింది. ప్రస్తుతం గణితం ఏ, బీ రెండు సబ్జెక్టులుగా ఉండగా, వాటిని ఒకటిగా మార్చింది. అలాగే వృక్షశాస్త్రం, జంతుశాస్త్రం సబ్జెక్టులను జీవశాస్త్రంగా(బయాలజీ) మార్పు చేశారు దీంతో ఇంటర్‌లో సైన్స్ గ్రూపుల్లో ఇకపై 5 సబ్జెక్టులే ఉంటాయి. ఎంపీసీలో గణితం, ఫిజిక్స్, కెమిస్ట్రీ, ఇంగ్లిష్ తప్పనిసరి సబ్జెక్టులుగా ఉంటాయి. మరో సబ్జెక్టును ఆప్షనల్‌గా ఎంపిక చేసుకోవచ్చు. విద్యార్థులు వారికి నచ్చిన సబ్జెక్టును ఎంపిక చేసుకుని చదవొచ్చు. బైపీసీలో ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ, ఇంగ్లిష్, ఒక ఎంపిక సబ్జెక్టు ఉంటాయి. ఈ రెండు గ్రూపుల విద్యార్థులు ఆరో సబ్జెక్టు ఏదైనా కావాలనుకుంటే చదువుకోవచ్చు. అదనపు సబ్జెక్టు మార్కులు మొత్తం మార్కుల్లో కలపరు. అలాగే ఉన్నతవిద్యలో ఇంజనీరింగ్, మెడిసిన్‌లో అవకాశాన్ని బట్టి ఏదైనా చదవాలనుకునేవారికి 'ఎంబైపీసీ' గ్రూపును ప్రవేశపెడుతున్నారు. దీనిలో గణితం, బయాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ, ఇంగ్లిష్ ఉంటాయి. కావాలంటే అదనపు సబ్జెక్టు తీసుకోవచ్చు. మొత్తం వెయ్యి మార్కులకే పరీక్షలు జరుగుతాయి. దీనిపై త్వరలోనే ప్రకటన విడుదలకానుంది.

'మినిస్టీరియల్ ఎంప్లాయీస్' అధ్యక్షుడిగా ఆర్‌వీవీ రమేష్

ఆంధ్రప్రదేశ్ మినిస్టీరియల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా తూర్పుగోదావరి జిల్లాకు చెందిన ఆర్‌వీవీ రమేష్ ఎంపికయ్యారు. ఆదివారం విజయవాడలో నిర్వహించిన అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సర్వసభ సమావేశంలో ఆయన్ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇప్పటి వరకు అధ్యక్షుడిగా ఉన్న బండి శ్రీనివాసరావు ఎంపీడీఓగా పదోన్నతి పొందడంతో ప్రస్తుత రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా ఉన్న రమేష్‌ను ఎంపిక చేసుకున్నట్లు ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

పౌల్ట్రీ.. పరేషాన్!

గత సర్కారు పాలసీతోనే సంక్షోభంలోకి..

(మొదటి పేజీ తరువాయి)

తగ్గింది. వాస్తవానికి అమెరికాలో బర్డ్‌ఫ్లూ వస్తే.. మార్కెట్‌లో ఉన్న గుడ్లు, చికెన్‌కు డిమాండ్ వచ్చింది. కానీ భారత్‌లో బర్డ్ ఫ్లూ నేపథ్యంలో చికెన్ షాపుల్ని బంద్ చేయించడంతో ప్రజల్లో అపోహలు తలెత్తాయి. బర్డ్‌ఫ్లూ వల్ల లక్షలాది కోళ్లు మృత్యువాత పడినా.. మనుషులకు ఏ ప్రమాదం లేదన్న విషయంపై అధికారులు ప్రచారం చేసినా ప్రజల్లో భయం పోలేదు. పౌల్ట్రీ ఫెడరేషన్ ఆధ్వర్యంలో పలు నగరాల్లో చికెన్ మేళాలు నిర్వహిస్తే.. ఉచితంగా ఆరగించడానికి చికెన్ ప్రియులు పోటెత్తారు. ఓ వైపు బర్డ్‌ఫ్లూతో కోళ్లు చనిపోగా, మరోవైపు చికెన్, గుడ్లు అమ్మకాలు, ఎగుమతులు మందగించాయి. దీంతో పౌల్ట్రీలకు రూ.లక్షల్లో నష్టాలొచ్చాయి. ఎండలకు కోళ్లు చనిపోవడం, గుడ్లు ఉత్పత్తి తగ్గడం సహజం. కానీ రానున్న 80 రోజులు వేసవి ప్రభావంతో పౌల్ట్రీలు మూతపడే అవకాశం ఉంది. పాఠశాలలకు కోడిగుడ్ల సరఫరా నిలిచిపోనున్నది. ఇవే పరిస్థితులు ఇంకొన్నాళ్లు కొనసాగితే.. పౌల్ట్రీ పరిశ్రమ దివాలా తీసే ప్రమాదం పొంచి ఉందని యజమానులు ఆందోళన చెందుతున్నారు.

ఇప్పటికే పౌల్ట్రీ పరిశ్రమ సంక్షోభంలో నడుస్తున్నది. గత ప్రభుత్వం తెచ్చిన పౌల్ట్రీ పాలసీతోనే కోళ్ల ఫారాల నిర్వాహకులు కుదేలయ్యారు. పౌల్ట్రీ కాంప్లెక్స్‌ల ఏర్పాటు, విద్యుత్ చార్జీలు, దాణా తయారీ, రవాణా, గుడ్లు ఎగుమతుల వంటి విషయాల్లో అనేక సమస్యలు చవిచూశారు. పాఠశాలలు, అంగన్వాడీలకు సరఫరా చేసిన గుడ్లకు బిల్లులు కూడా సకాలంలో రాక పౌల్ట్రీ యజమానులు తీవ్రంగా ఇబ్బందులు పడ్డారు. ప్రస్తుతం కోళ్ల దాణా ధరలు నికరంగా ఉన్నా.. గత ఐదేళ్లూ దాణా ధరలు అనేక రెట్లు పెరిగి, నిర్వహణ భారమైందని పౌల్ట్రీ యజమానులు చెప్తున్నారు. కాగా గత టీడీపీ ప్రభుత్వం పౌల్ట్రీ రైతులకు రాయితీలిచ్చి, ప్రోత్సహించింది. కానీ వైసీపీ ప్రభుత్వం నయాపైసా సాయం చేయలేదు.

ఇదీ పౌల్ట్రీ ఫెడరేషన్ విజ్ఞప్తి

రాష్ట్రంలో పౌల్ట్రీ పరిశ్రమ పరిస్థితిపై ఏపీ పౌల్ట్రీ ఫెడరేషన్ ప్రతినిధులు ముఖ్యమంత్రి చంద్రబాబును ఇటీవల కలిశారు. పౌల్ట్రీ రంగాన్ని సంక్షోభంలోకి నెట్టేలా గత ప్రభుత్వంలో తెచ్చిన పౌల్ట్రీ పాలసీని పునఃసమీక్షించాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా లేయర్ పౌల్ట్రీ ఫార్మర్స్ ఎదుర్కొంటున్న సమస్యలను సీఎంకు వివరించారు. 'పౌల్ట్రీ రంగానికి గతంలో మాదిరిగా చేయూత అందించాలి. కోళ్ల దాణాకు వినియోగించే మొక్కజొన్న ఉత్పత్తిపై దిగుమతి సుంకాన్ని పూర్తిగా వినహాయించేలా కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం లేఖ రాయాలి. మార్కెట్‌లో కోడిగుడ్ల ధరలను తారుమారు చేసే విధానాలను నియంత్రించడానికి పౌల్ట్రీ రైతులు, గుడ్డు వ్యాపారులతో సమన్వయ కమిటీని ఏర్పాటు చేయాలి. 2018-19లో పౌల్ట్రీ రైతులకు ప్రభుత్వం ప్రకటించిన రూ.45.65 కోట్ల రాయితీ సొమ్ముకు టోకెన్లు ఉన్నా.. గత ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టినందున.. ఆ నిధులు విడుదల చేయాలి., ఇప్పటికే బ్యాంకులకు బకాయి ఉన్న పౌల్ట్రీ రైతుల రుణాలను ఏడాది పాటు రీషెడ్యూల్ చేసేలా ఆదేశాలివ్వాలి. కోళ్ల దాణా విధానాన్ని బలోపేతం చేయాలి. సూపర్ స్పెషాలిటీ సౌకర్యంతో ప్రతి జిల్లాలో కోళ్ల వ్యాధుల నిర్ధారణ, నివారణ చర్యలు పెంచాలి. కల్తీ మందుల నిర్ధారణకు చట్టాలను కచ్చితంగా అమలు చేయాలి' అని విజ్ఞప్తి చేశారు. దీనిపై సీఎం ఆదేశాలతో పశు సంవర్ధకశాఖ ఒక ఫైల్ తయారు చేసింది. తమ సమస్యలపై ప్రభుత్వం త్వరగా నిర్ణయం తీసుకుని, పౌల్ట్రీ పరిశ్రమను ఆదుకోవాలని పౌల్ట్రీ ఫెడరేషన్ కోరుతోంది.

చికెన్‌లో పురుగుల కలకలం

సామర్లకోట, మార్చి 23(ఆంధ్రజ్యోతి): బర్డ్ ఫ్లూ కారణంగా కొంత కాలంగా చికెన్‌కు దూరంగా ఉంటున్న పలువురు ఉత్సాహంగా ఆదివారం చికెన్ కొనుగోలు చేశారు. అయితే ఇంటికొచ్చాక చికెన్ నుంచి పురుగులు వస్తుండటం చూసి కలవరం చెందారు. కాకినాడ జిల్లా సామర్లకోటలో పాత తహశీల్దార్ కార్యాలయం ప్రాంతానికి చెందిన ఇద్దరు సంత మార్కెట్ రామాలయం సమీపంలోని ఒక చికెన్ దుకాణంలో కొనుగోలు చేసిన చికెన్‌లోనే ఈ పురుగులు ఉన్నాయని ఆరోపించారు. ఈ విషయం వెలుగుచూడకుండా చికెన్‌షాపు యజమాని వారిని సంతృప్తి పరిచినట్లు తెలిసింది. ఆదివారం కావడంతో ఈ విషయం తమ దృష్టికి రాలేదని మున్సిపల్ శానిటరీ అధికారులు చెప్పారు.



చికెన్‌లో పురుగులు ఉన్న దృశ్యం



తిరుమల ఆలయం ముందు జస్టిస్ సుజాత, జస్టిస్ సురేష్‌రెడ్డి

శ్రీవారి సేవలో హైకోర్టు న్యాయమూర్తులు

తిరుమల, మార్చి 23(ఆంధ్రజ్యోతి): హైకోర్టు న్యాయమూర్తులు తిరుమల శ్రీవారిని ఆదివారం దర్శించుకున్నారు. ఏపీ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ కె.సురేష్ రెడ్డి, జస్టిస్ వి.సుజాత కుటుంబ సభ్యులతో కలిసి ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు.

రేపు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

- వీఐపీ బ్రేక్ దర్శనాలు రద్దు

తిరుమల, మార్చి 23(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయంలో ఈ నెల 30వ తేదీన ఉగాది ఆస్థానాన్ని పురస్కరించుకుని మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం(ఆలయ శుద్ధి) నిర్వహించనున్నారు. ఉదయం 6 నుంచి 11 గంటలకు తిరుమంజనం కార్యక్రమాన్ని అర్చకులు ఆగమోక్తంగా చేపట్టనున్నారు. అనంతరం భక్తులను దర్శనానికి అనుమతిస్తారు. కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం కారణంగా మంగళవారం వీఐపీ బ్రేక్ దర్శనాలను, అష్టదళ పాదపద్మారాధన సేవను టీటీడీ రద్దు చేసింది.

శ్రీవారి బ్రేక్ దర్శనానికి టీ-నేతల సిఫారసులు

- తొలిరోజే ఏఈవో కార్యాలయంలో 90 లేఖలు నమోదు

తిరుమల, మార్చి 23(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి వీఐపీ బ్రేక్ దర్శనాలకు తెలంగాణ ప్రజాప్రతినిధుల నుంచి భారీగా సిఫారసు లేఖలు వచ్చాయి. తొలిరోజే 90 లేఖలను భక్తులు తీసుకొచ్చి అదనపు ఈవో కార్యాలయంలో నమోదు చేసుకున్నారు. గతంలో అనుమతించిన తరహాలో తమ లేఖలపై కూడా వీఐపీ బ్రేక్ దర్శనాలు కల్పించాలంటూ కొద్దినెలల నుంచి టీ-ప్రజాప్రతినిధుల నుంచి టీటీడీపై తీవ్రస్థాయిలో ఒత్తిడి వచ్చింది. ఇదే విషయమై సీఎం చంద్రబాబుకు ఆ రాష్ట్ర సీఎం రేవంత్‌రెడ్డి లేఖ కూడా రాశారు. దానిపై ఆయన సానుకూలంగా స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని టీటీడీని ఆదేశించారు. దీంతో తెలంగాణ ప్రజాప్రతినిధుల సిఫారసు లేఖలపై ఈ నెల 24 నుంచి దర్శనాలు కల్పిస్తామని టీటీడీ ప్రకటించింది. సోమ, మంగళవారాల్లో ఒక లేఖపై ఆరుగురికి మించకుండా వీఐపీ బ్రేక్ దర్శనాలు, బుధ, గురువారాల్లో రూ.300 దర్శన టికెట్లు జారీ చేయనున్నట్లు వెల్లడించింది.

తిరుమలలోని అనధికార గృహాల్లో సోదాలు

- మరో రెండు రోజుల్లో తొలగించనున్న అధికారులు

తిరుమల, మార్చి 23(ఆంధ్రజ్యోతి): తిరుమలలో అనధికారికంగా ఉంటున్న వ్యక్తుల నివాసగృహాల్లో ఆదివారం పోలీసులు, విజిలెన్స్, రెవెన్యూ అధికారులు సోదాలు చేశారు. కొందరి వివరాలను, వారి నేర చరిత్రను సేకరించారు. తిరుమలలో కొందరు ఉచిత భోజనం, వసతి సదుపాయాలను వినియోగించుకుంటూ అనధికారికంగా తిష్ట వేశారు. హాకర్లుగా, భవన కార్మికులుగా పనులు చేసుకునే కొందరు మాంసాహారం తింటూ, మద్యం, గంజాయి తీసుకుంటూ హల్‌చల్ చేస్తున్నారు. ఇలాంటి వారికి షెడ్లు, యాత్రికుల వసతి సముదాయాలు, షాపింగ్ కాంప్లెక్స్, పాచికాల్వ గంగమ్మ ఆలయ ప్రాంతంలోని తాత్కాలిక షెడ్లు నివాస ప్రాంతాలుగా మారిపోయాయి. ఇటీవల షాపింగ్ కాంప్లెక్స్ ముందు షెడ్‌లో ఇద్దరు మద్యం తాగి మాంసం తింటూ పట్టుబడ్డారు. మాడవీధుల్లో ఒకరు మద్యం మత్తులో మహిళతో అసభ్యంగా మాట్లాడుతూ హల్‌చల్ చేశారు. మూడురోజుల క్రితం ఇద్దరు యువకులు మద్యం మత్తులో భక్తుల వాహనాలను అడ్డుకోవడంతోపాటు ముగ్గురిపై దాడికి దిగారు. ఇలా దాదాపు 200 మందికిపై అనధికార వ్యక్తులు తిరుమలలోనే ఉంటూ క్షేత్ర పవిత్రతను దెబ్బతీస్తున్నారు. ఈ క్రమంలో అధికారులు వీరిపై దృష్టి పెట్టారు. పాచికాల్వ గంగమ్మ ఆలయానికి వెళ్లే మార్గంలో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన గృహాల్లో భద్రతాధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. 20 మంది అనధికార వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. ఇళ్లను ఖాళీ చేయించి తిరుపతికి తరలించారు. రెండుమూడురోజుల్లో టీటీడీ అధికారుల అనుమతితో ఈ అనధికార నివాసగృహాలను తొలగించనున్నారు. తిరుమలలోని ఇతర ప్రాంతాల్లో ఉన్న 72 మందిని శనివారం గుర్తించారు. వీరిలో పాత నేరస్థుడూ ఉండటం గమనార్హం.



అనధికార వ్యక్తుల నేరచరిత్రను పరిశీలిస్తున్న పోలీసులు, విజిలెన్స్ సిబ్బంది

నేడు టీటీడీ ధర్మకర్తల మండలి సమావేశం


- దాదాపు రూ.5,400 కోట్లతో 2025-26 బడ్జెట్

తిరుమల, మార్చి 23(ఆంధ్రజ్యోతి): టీటీడీ ధర్మకర్తల మండలి సమావేశం సోమవారం తిరుమలలో జరుగనుంది. తిరుమలలోని అన్నమయ్య భవనంలో బోర్డు చైర్మన్ బీఆర్ నాయుడు ఆధ్వర్యంలో సభ్యులు ఈ సమావేశంలో పాల్గొననున్నారు. ఈ సందర్భంగా 2025-26 వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. గతేడాది రూ.5,141.74 కోట్లతో బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన టీటీడీ ఈ ఏడాదికి దాదాపు రూ.5,400 కోట్లతో ప్రవేశపెట్టనుంది. ఇప్పటికే సిద్ధం చేసిన 30కి పైగా అజెండా అంశాలపై చర్చించి తీర్మానాలు చేయనున్నారు. గత సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాలపై సమీక్షించడంతో పాటు ముడిసరుకుల కొనుగోళ్లు, ఇంజనీరింగ్ పనులకు నిధుల కేటాయింపులపైనా సమావేశంలో తీర్మానాలు చేయనున్నారు. సీఎం సూచన మేరకు గ్రామీణ ప్రాంతాల్లో శ్రీవారి ఆలయాల నిర్మాణం కోసం నూతన ట్రస్టు ఏర్పాటుపై నిర్ణయం తీసుకోనున్నారు. ప్రైవేటు బ్యాంకుల్లోని టీటీడీ డిపాజిట్లను జాతీయ బ్యాంకుల్లో డిపాజిట్ చేసేందుకు నిపుణుల కమిటీ సిఫారసులపైనా చర్చించనున్నారు. ఇక వేసవి సెలవుల నేపథ్యంలో భక్తుల రద్దీకి అనుగుణంగా చేపట్టాల్సిన చర్యలపైనా చర్చించనున్నారు. అలిపిరిలో కొండలను అనుకుని ప్రైవేటు నిర్మాణాలు లేకుండా టెంపుల్ కారిడార్‌గా చేసే అంశంపైనా నిర్ణయం తీసుకోనున్నారు.

27న రాష్ట్ర స్థాయి ప్రభుత్వ ఇఫ్తార్

- రాష్ట్రవ్యాప్తంగా జిల్లా కేంద్రాల్లోనూ కార్యక్రమాలు
- ఇఫ్తార్ ఏర్పాట్లకు రూ.1.50 కోట్లు విడుదల

అమరావతి, మార్చి 23(ఆంధ్రజ్యోతి): ముస్లింలు అత్యంత పవిత్రంగా భావించే రంజాన్ మాసంలో రాష్ట్ర వ్యాప్తంగా జిల్లాల స్థాయిలో ఇఫ్తార్ ఏర్పాట్లు చేయడానికి ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకుగాను రూ.1.50 కోట్లు నిధులను విడుదల చేసింది. రంజాన్ నెలలో సాయం కాలం ఉపవాస దీక్ష విరమణ కార్యక్రమంలో భాగంగా ఈ నెల 27న రాష్ట్ర స్థాయి ప్రభుత్వ ఇఫ్తార్ కార్యక్రమాన్ని విజయవాడలోని ఏ ప్లస్ కన్వెన్షన్ సెంటర్‌లో సీఎం చంద్రబాబు అధ్యక్షతన నిర్వహించేందుకు నిర్ణయించారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వం రూ.75 లక్షలు కేటాయించింది. అలాగే రాష్ట్రవ్యాప్తంగా జిల్లాల్లో కూడా 4, 5 రోజుల్లో జిల్లా స్థాయి ఇఫ్తార్ కార్యక్రమాన్ని వారికి అనువైన రోజున కలెక్టర్ల ఆధ్వర్యంలో పకడ్బందీగా నిర్వహించాలని మైనార్టీ సంక్షేమ శాఖ కార్యదర్శి హర్షవర్ధన్ ఆదేశాలు జారీ చేశారు. ఇందుకు మరో రూ.75 లక్షల మొత్తాన్ని కేటాయించారు.



నిద్రించేవాళ్లు

నిద్రించేవాళ్ళను చూసినప్పుడు
వారి కన్నులు ప్రసరించే వెలుతురులో
నేను మరింత మేల్కొంటాను
నిద్రించేవాళ్లు,
నేల మీద పరిచిన శిలువల మీద
పడుకున్న నీడల్లాంటి వాళ్ళు
వారిని చూసినప్పుడు
నిద్రకీ మెలకువకీ మధ్య
రెప్పవేయని కనురెప్పలా కదులుతూ ఉంటాను

నిద్రించేవారి చుట్టూ నిలువెత్తు పక్షిలా తిరుగుతూ
ప్రార్థనలాంటి గీతాలు పాడుతాను
వారి కన్నుల మీద కదిలే
కాంతి చీకట్లతో ఆడుకుంటాను
వారి కలలతో కలిసి
వారి ఆత్మల పలకల మీద
కవిత్వాలు రాస్తాను
నిద్రించేవారు
తమ చుట్టూ పేర్చుకున్న
నిశ్శబ్ద సరస్సులలో
నా నీడకు స్నానం చేయిస్తాను

సత్యాన్ని వెలికి తీసే పనిలో
నిద్రించేవాళ్లు,
తమ మీద సముద్రాలను కప్పుకుంటారు
వారి పెదాల మీద దోబూచులాడే
పసిపిల్లల్లాంటి పక్షుల్లా విచ్చుకునే పువ్వుల్ని చూసి
మనసారా నవ్వుకుంటాను
నిద్రించే వాళ్ళు
తమ ఆనవాళ్లను మరిచిపోయి
కొత్తగా ఉదయించబోతున్న కొత్త మనిషి
స్వాగతం కోసం
తమను పువ్వుల్లా పరుచుకుంటారు
గడిచిపోయిన కాలాల నెరవేరని
స్వప్నాలను దీపాలుగా వెలిగించి
తమకు కాపలా పెట్టుకుంటారు

వారిని చూస్తుంటే
అంతరిక్షంలో అప్పుడే కళ్ళు తెరిచిన నక్షత్రాలేవో
నా ఊహల్లో ఊగుతుంటాయి
నిద్రించేవాళ్ళను చూడడమంటే
ఉదయించే గోళాలకు తలను ఆన్చి
మెలకువలో నిద్రపోవడమే

నిద్రించేవాళ్లు,
నీటినీ మనిషినీ జో కొడుతూ
తీరంలో జోగుతున్న పడవలు
ఆరిన కాంతిలో తడిసిన ఆత్మల
మైమరపు మత్తులో తూగుతున్న ప్రమిదలు
నిద్రించేవాళ్లు,
ముక్కు మూసుకుని తపస్సు చేసుకునే
మునీశ్వరులు కాదు
దేహంలోని తూటాలకు తమ ప్రాణాలను
పాటలుగా దానం చేస్తున్న
అజ్ఞాత వీరులు
నిద్రించేవారు,
నిద్రలో మానవ స్పృహ కోల్పోయి
ఏవో శూన్య జలాల మీద
అపూర్వ అనుభవానందంలో
తేలుతూ ఉంటారు

చెట్లతో పక్షుల సంభాషణ లాగా
నిద్రించేవాళ్లు,
సుఖదుఃఖాలకు అతీతమైన
మంత్రం ఏదో పఠిస్తూ ఉంటారు
నిద్రపోయే వాళ్లంతా పసిపాపలే
నిద్రించేవాళ్లని చేతకాని వాళ్ళని నిందించకండి
మన మెలకువను వేకువగా వెలిగించడానికి
వాళ్లు కలల్లో కాలిపోతుంటారు
వారిని నేను చూసినప్పుడల్లా
అప్పుడే మళ్ళీ జన్మిస్తాను
నీషే చెప్పిన బాలుడిలా.

■ ప్రసాదమూర్తి
✆ 84998 66699

వివిధ
vividha@andhrajyothy.com
సాహిత్య వేదిక
బొమ్మలు: అక్బర్

కొన్ని సాహిత్యంతో బతికిన క్షణాలు



కాసిని రూకల సంపాదనకు, ఆకలి శత్రువును మచ్చిక చేసుకొనేందుకు బ్రతుకు కట్టుకొయ్యకు బందీలమే అందరం. అరుదుగా అది వదులయే అవకాశం వస్తుంది. అప్పుడప్పుడు ప్రయాణాల రూపంలో. నిత్యజీవన సంగ్రామంలో ఒక ఆటవిడుపు ప్రయాణం. బంధిత తూనీగను 'ఎగిరిపో' అని అగ్గిపెట్టె తెరిచిన అద్భుతం. ఇటీవల అలా వచ్చిన అవకాశం సాహిత్య అకాడమీ వారి ఆహ్వానం.



వరుసగా: సిద్ధార్థ శంకర్ కలిత (అస్సామీ), రంగకిబాక్ (ఖాసీ), టి. కె. సంతోష్ కుమార్ (మళయాళం), తిరు ప్రసాద్ (నేపాలీ), ఎన్. కిరణ్‌కుమార్ సింగ్ (సభాధ్యక్షుడు), మందరపు హైమవతి (తెలుగు), అక్షత రాజ్ (తుళు)

మార్చిలో 7 నుంచి 12 వరకు జరిగే 'సాహిత్యోత్సవ్'లో పాల్గొనమని వచ్చిన పిలుపుతో మబ్బుల రాదారిపై పయనించి ఢిల్లీలోని సాహిత్య అకాడమీ కార్యాలయం ఆవరణలో అడుగుపెట్టాను. అడుగుపెట్టానో లేదో పుస్తకాల చిత్రాలతో ఏర్పాటు చేసిన అపురూపమైన స్వాగతద్వారాలు. అన్ని భాషల అక్షరాలను ఒకేచోట కొలువు తీర్చిన డిజైన్లు. కళ్ళెత్తి చూస్తే కనకాభిషేకాలు అన్నట్లు గోడల మీద కనిపించే వివిధ భాషల రచయితలు, కవుల ఫోటోలు. ఓ పక్కన కార్యక్రమంలో పాల్గొనడానికి వస్తున్న రచయితలు.

సాహిత్యంలో కథ, నవల, వ్యాసం, విమర్శ ఎన్ని ప్రక్రియలున్నా కవిత్వం ఎక్కువగా భావోద్వేగాల ప్రవాహం. అందుకే దానికి ఆకర్షణ అధికం. ఈ ఆరు రోజుల సమావేశంలో మొత్తం 24 కవి సమ్మేళనాలు నిర్వహించారు. బహుభాషా కవి సమ్మేళనాలు, దళిత కవి సమ్మేళనం, అస్మిత, నారీ చేతన మొదలైన మహిళల కవి సమ్మేళనాలు ఈశాన్య, దక్షిణ భాషా కవి సమ్మేళనం శ్రోతల కవిత్వ దాహాన్ని తీర్చాయి.

11న కావేరీ సంభాగరలో ఎన్. కిరణ్ కుమార్ సింగ్ అధ్యక్షతన 'టేస్టీ సౌండ్' కవి సమ్మేళనంలో సిద్ధార్థ శంకర్ కలిత (అస్సామీ), రగకి బాక్ (కాశీ), టి.కె. సంతోష్ కుమార్ (మలయాళం), తిరు ప్రసాద్ (నేపాలీ), అక్షత రాజ్ (తుళు)లతో పాటు నేను 'ఈ దేహం ఎవరిది', 'కూరగాయలమ్మాయి', 'వంటింటి సూర్యోదయాలు' ఈ మూడు కవితలూ చదివాను. వీటిని కల్లూరి శ్యామల అనువదించారు.

ఈ ఆరు రోజుల కార్యక్రమంలో రెండు తెలుగు రాష్ట్రాల నుండి శ్రీయుతులు ఖాదర్ మొహియుద్దీన్, ముకుంద రామారావు, రెంటాల జయదేవ్, ఎ. కృష్ణారావు, వేంపల్లి షరీఫ్, పి. జ్యోతి, తోట సుభాషిణి, ఓల్గా, రాగిళ్ళ రమేష్, స్వర్ణ కిలారి, పెండ్యాల గాయత్రి, కోడూరి విజయకుమార్, కొలకలూరి ఇనాక్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమాలన్నీ ఒకేసారి వేరు వేరు చోట్ల జరగడం వలన అన్నీ వినటం కుదరలేదు.

ఈ సాహిత్య కార్యక్రమంలో 'కథా సంధి', 'రచయితతో ముఖాముఖి', 'సంవత్సర లెక్చర్ ఈవెంట్స్' జరిగాయి. ముఖ్యంగా ఎనిమిదో తారీకున సాహిత్య అకాడమీ బహుమతి గ్రహీతలకు సన్మాన కార్యక్రమం కూడా జరిగింది. ఈ సంవత్సరం విమర్శకు పెనుగొండ లక్ష్మీనారాయణ గారు బహుమతి గ్రహీత.

ఢిల్లీ 'సాహిత్యోత్సవ్' నుంచి వచ్చి పది రోజులు దాటినా ఇంకా అక్కడే తారట్లాడుతున్న ఆత్మ. ఇంకా చెవుల్లో వినిపిస్తున్న కవి సమ్మేళనం కవితలు, ప్రసంగాల పరంపరలు. బుద్ధుడికి రావిచెట్టు కింద జ్ఞానోదయమైనట్టు ఈ విశాల విశ్వ కవితా సాగరంలో నేనొక అతి చిన్న బొట్టునే అన్నది ఈ ఉత్సవాల్లో నేను గ్రహించిన నిజం.

చివరిరోజు ప్రఖ్యాత బెంగాలీ కవి సుబోధ్ సర్కార్‌తో ముఖాముఖి చాలా అద్భుతమైన కార్యక్రమం. లెక్కకు మించి పుస్తకాలు రాసిన సుబోధ్ సర్కార్ తన ప్రసంగంలో ఎన్నో ఆసక్తికర విషయాలు చెప్పారు. బాల్యంలో ఒకసారి టికెట్ లేకుండానే రైలు ఎక్కారట. టీసీ వచ్చి పట్టుకొని ఫైన్ కట్టమంటే డబ్బులు లేవని చెప్తే పోలీస్ స్టేషన్‌కి తీసుకు వెళ్లారట. "నా దగ్గర టికెట్ లేదు. నా బుర్రలో కవిత్వం ఉన్నది" అని కవితలు చదివారట. అప్పుడు పంపించేశారట. ఆయన రాసిన కవితా సంపుటి గురించి- ఇది చదివితే 30ఏళ్ళ భారత దేశ చరిత్ర తెలుస్తుందన్నారు. ఇటీవల జరిగిన మణిపూర్ సంఘటన గురించి "hacked my mothers of Manipur, she is burning" అని కవిత చదువుతున్నప్పుడు కన్నీటి నది ఐపోయింది మనసు. నేనూ కూడా మణిపూర్ సంఘటన మీద రాసిన 'ఖబడ్దార్' కవిత గుర్తుకు వచ్చింది. ఎంతో ప్రభావితం చేసిన ఆయన ముఖాముఖి విన్నాక- "మంచి కవిత్వమే ఉంది, రాజ్యమెందుకు" (సుకవితాయద్యస్తి రాజ్యేనకిమ్) అనే మాట గుర్తుకు వచ్చింది.

టీ విరామ సమయాలలో అనేక భాషా కవులతో సంభాషణలు. తమిళ కవి రమేష్ మాటల సందర్భంలో తనకి కుప్పం యూనివర్సిటీ, బి. తిరుపతిరావు గారు తెలుసని చెప్పారు. తన కవితలను ఆ యూనివర్సిటీలో వారు అనువదించారని చెప్పారు. కన్నడ కవయిత్రి పూర్ణిమ, తమిళ కవయిత్రి అక్షతల స్నేహ సంభాషణలతో కవిత్వానికి ఎల్లలు లేవనిపించింది. ఈ సభలు చూడడానికి వచ్చిన మలయాళ కవి గణేష్ పుత్తూర్ తాను సాహిత్య అకాడమీ యువ పురస్కార గ్రహీతనని, తెలుగు కవి రమేష్ కార్తీక్ తెలుసని చెప్పారు.

ఈ రెండు రోజులు అందరూ కలిసి మాట్లాడుకోవడం, కలిసి సమయం గడపడం, ఒక సాహిత్య వాతావరణంలో జీవించడం... నిజంగా ఇవే కదా బ్రతికిన క్షణాలంటే అనిపించింది. నాకు ఈ అవకాశమిచ్చిన సాహిత్య అకాడమీ కార్యదర్శి శ్రీనివాస్ రావుగారికీ, ప్రసేన్ గారికీ హృదయపూర్వక ధన్యవాదాలు.

ఊగి ఊగి దిగినా ఇంకా కాసేపటి వరకు ఊగుతూనే ఉంటుంది ఉయ్యాల. అలాగే ఢిల్లీ 'సాహిత్యోత్సవ్' నుంచి వచ్చి పది రోజులు దాటినా ఇంకా అక్కడే తారట్లాడుతున్న ఆత్మ. ఇంకా చెవుల్లో వినిపిస్తున్న కవి సమ్మేళనం కవితలు, ప్రసంగాల పరంపరలు. విశాలమైన ఢిల్లీ వీధులు, ఇరుపక్కలా చెట్లు, అతిథులను సేద తీర్చే ఆత్మీయమైన దీవెనలు. అద్భుతమైన వాతావరణం. బుద్ధుడికి రావి చెట్టు కింద జ్ఞానోదయమైనట్టు ఈ విశాల విశ్వ కవితా సాగరంలో నేనొక అతి చిన్న బొట్టునే అన్నది ఈ ఉత్సవాల్లో నేను గ్రహించిన నిజం.

■ మందరపు హైమవతి
✆ 94410 62732



వాక్యాల్లేని ప్రపంచంలో...

నీతో కలిసి నీ నీడల్లోకి నడిచే పాదాలుండవు. నీ ఒంటరితనం మరింత చిక్కబడుతుంది. నీ ఉదయాలకు సాయంత్రాలకు రంగులద్దే చిత్రకారుడు లేక దృశ్యాల చుట్టూ చీకటి. వాక్యం తోడులేని వెన్నెల రాత్రులు పండవు. పిట్టల పాటల్ని శిశిరాలు ఎత్తుకుపోతాయి. ఒక్క ఎలిజీ కూడా తోడులేక నీ శోభాయాత్ర వెలవెలబోతుంది.

నిన్ను ప్రకృతితో కలిపే దారం తెగిపోయి నీ ప్రేమ ప్రకటనలో ప్రాణం లోపిస్తుంది. నీ మాటల్లోకి నదులు ప్రవహించవు. పువ్వుల భాషలో నీతో సంభాషించే వాళ్లుండరు. చలికి వణికే ఎడారుల లిపి నీకు అర్థం కాదు. కమ్ముకున్న పొగమంచులో గొంతును ఎలా పెగుల్చుకోవాలో తెలియదు. ఒక ఉద్వేగాన్ని పండించడంలో కవికి ఉన్నంత నేర్పు నీకుండదు. నీ కలలకు అనువాదాలు దొరకవు.

నీ జెండా కర్ర మీద పిట్టలు వాలవు. లోయల గొంతు నీకు వినిపించదు. అడవి తుడుం మోత నీ గదిలో మోగదు. ఒక్కో అవయవమూ రాలి నువ్వు శిథిలమవుతూ రాజు భుజం మీదే మిగిలిపోతావు. చెట్టుకొమ్మకు ప్రశ్నలా వేలాడ్డం నీవల్ల కాదు.

నీతో కలిసి నీకోసం ఏడ్చే వాళ్లుండరు. పొదల్లో నక్కిన తోడేలుగుట్టు ఆఖరు వరకూ పిల్లాడికి తెలీదు. నీ ఊపిరి మీద కాలేసి తొక్కుతుంటే నీ తరుపున అడిగే గొంతుండదు. అండాసెల్‌లలోకి జీవనదులు ప్రవహించకపోతే, రెక్కలపై వేలాడుతున్న సంకెళ్ళలోంచి అక్షరాలై కురవకపోతే కాలం తప్పొప్పులు చరిత్ర రక్తం లోకి ఇంకవు. రాజ్యం జన్యువుల్లో వచ్చే ఉత్పరివర్తనాల గురించి ఎప్పటికప్పుడు నిన్ను హెచ్చరించే వారుండరు. బుల్డోజర్ కింద నలిగే కన్నీళ్ళు పిడికిళ్ల కాలేవు. చివరికి నువ్వు మరణించిన సంగతి నీకే తెలీదు.

■ సాంబమూర్తి లండ
✆ 96427 32008

దళిత కవితకు తార్కిక పదును

దిశానిర్దేశం లేని అర్థరహిత జీవితాన్ని, కల యొక్క ప్రాధాన్యతను వివరిస్తూ ప్రసిద్ధ అమెరికన్ బ్లాక్ పొయెట్ లాంగ్‌స్టన్ హ్యూస్ "కలలు లేని జీవితం, ఎగరలేని రెక్కలు విరిగిన పక్షి" వంటిదంటాడు. కలలు భవిష్యత్తు కోసం ప్రేరణనిచ్చి, పోరాడే శక్తినిస్తాయి. ఇక్కడ కల అంటే గమ్యాన్ని నిర్దేశించుకోవడంలో హేతువాద ఆలోచన కలిగిన తాత్వికత. భారతీయ సమాజంలో సామాజిక అసమానతలు ఇంకా ఒక ప్రధాన సమస్య. రాజ్యాంగం చట్టపరంగా సమానత్వాన్ని నెలకొల్పినప్పటికీ, సామాజిక స్థాయిలో మార్పును తీసుకురావడానికి కవిత్వమే శక్తివంతమైన సాధనం కాగలదు.

బ్లాక్ పోయెట్రీలా భారతీయ కులవివక్షకు వ్యతిరేకంగా వచ్చిన నిరసన కవిత్వమే దళితకవిత్వం.



ఇది బౌద్ధం, అంబేద్కర్ రాజ్యాంగం, మార్క్సిజం తాత్వికతను ఆపాదించుకున్నాక కవిత్వోద్యమస్థాయిని దాటి పరిణత దళిత సాహిత్యంగా మార్పు చెందింది. వేముల ఎల్లయ్య 'క్రీనీడ – తార్కిక కవిత్వం' కవితా సంపుటి దళిత తాత్వికతతో, విశ్వజనీన విశాల దృక్పథంతో తర్కించుకుంటూ పరిణామం చెందినట్టుగా కనిపిస్తుంది. దీనిలో కేవలం అనుభవాలను వ్యక్తీకరించడమే కాకుండా, పరిష్కారం కనబడుతుంది.

వెలుతురులో జీవించలేని జీవితాల పట్ల వివక్షకు నీడ ప్రతీక. 'క్రీనీడ' అంటే కింది నీడని అర్థం. ఈ పదబంధం తీవ్ర అణిచివేత, పరాధీనతను సూచించినా, ఈ 'క్రీనీడ' కవిత్వం హేతువాదంతో పరిష్కారం దిశగా ఆధిపత్యాన్ని సవాలు చేస్తుంది. ఈ కవిత్వంలో సొంత భాష, స్వీయ అనుభవాలు, భావోద్వేగాలు కవికి మాత్రమే పరిమితం కాలేదు. సార్వజనీనమైనవి. ఆ విధంగా 'క్రీనీడ' అంతర్జాతీయస్థాయి కవిత్వం.

వేముల ఎల్లయ్య కవిత్వంలో శైలి, అభివ్యక్తి, వస్తుపరంగా పరిణామం చెందుతున్నా, భాష స్థిరంగా ఉంది. వచనంలో, కవిత్వంలో భాషాపరంగా బలమైన దళిత జీవిత ఇమేజరీ ఉంటుంది. మొనదేలిన వడపోతలేని భాష ఉంటుంది. నిండైన నిరసనతో కూడిన ఆవేదన ధ్వనిస్తుంది. కవిత్వానికి తీసుకున్న వస్తువును దేశీయ పదాలలో కుదించి, సరళంగా చెప్పడం కన్పిస్తుంది.

రెక్కలు లేని పక్షి ఎగరలేదు. తాత్వికత లేని కవి స్వతంత్రంగా ఆలోచించలేడు. తర్కించలేడు. అలాంటి లిల్లీపుట్ కవుల గురించి వేముల ఎల్లయ్య 'గతి' కవితలో రాశాడు. "మొగవేశ్య కవీ మొఖం కప్పిన పట్టుచీర/... ఏ దేశం దేవ్లాడినా మీలాంటి సంస్కృతి తస్కరీ కవులు దొరుకున?/ఏం! లగాయించిన లత్కోర్సాప్ కూలిపోయే పాలకుని నిల్పే కైతా!" అని రాజకీయనాయకుల అధికారాన్ని నిలబెట్టడానికి కవిత్వాన్ని రాసే వెన్నులేని కవులను కవిత్వబోనులో దోషిగా నిలదీస్తాడు.

ఇందులోని కవితలు ఎక్కువగా సామాన్యుల విజయాలు. వారి సామాజిక బలిదానాలను, త్యాగాలను కీర్తించడం; మహిళ, దళిత, బహుజన కవులు, కళాకారుల స్మృతి కవితలు; సమకాలీన ప్రాంతీయ, జాతీయ, అంతర్జాతీయ రాజకీయ అంశాలు; యుద్ధోన్మాదం; దళిత రాజకీయాలపై ఆక్రోశం, దళితజాతి సంస్కృతి గొప్పదనం, దళితకవుల తాత్వికభూమికను చర్చిస్తాయి.

ఉద్యమాలను నిర్మించే సాహిత్య ప్రక్రియ కవిత్వం. అయినా పిడికిలి ఎత్తినదే కవిత్వమనే పిడివాదాన్ని కవిగా ఎల్లయ్య వ్యతిరేకిస్తాడు. దళిత కవుల జీవితంలో ఒత్తిడి, అవమానం ఉంటాయి కాబట్టి, వారి కవిత్వంలో ఎక్కువగా నిరసన ఉంటుందని కొందరు అపోహ పడుతుంటారు. కానీ వారు ప్రబంధ వర్ణనను మించి రాయగలరని 'ఉదయ పుంత' తెలియజేస్తుంది. ఈ కవితలో ప్రకృతి తాత్వికత, దళితజీవన సౌందర్యం కనిపిస్తుంది. "వెన్నెల వెదజల్లిన మొగులు కొప్పెర కప్పి/ తారలు పొదిగిన కంటిపొరల కింది కను పాపల్లే/ నెమలి పురులిప్పిన భూమి బొంగురం జాల విప్పే/ ఆకాశపు కొప్పు దులిపిన గర్భం మొగులొల్లే/ బాలింత వాసన మబ్బు దిగిన వర్షం కురిసిన తలం/ పంటకు దూప పొద్దు మల్లి ఇగురుపొర పొద్దునద్దే/ పండు ఉదయపుంత కిరణం పానిపై లోకమల్లెచ్చే.../ అడవికొసరు పరుసు కున్న మనిషి యంత్రం పిప్పి" అంటాడు.

పై కవితలో మబ్బులు వర్షానికి తడవకుండా వెన్నెలకు కొప్పెరను కప్పి, తారలను కంటిపాపలా కాచి, కొప్పెర పట్టిన వర్షపు బిందువులను భూమిపై దులిపితే, అది బాలింత వాసనతో నిండుగర్భిణిలా మారుతుంది. పంటకు పొద్దుగా నీటినిచ్చి, తిరిగి మాయమై కొత్తచిగురు కాసేలా పొద్దును ఆహ్వానిస్తాయి. కవి దళిత ప్రకృతి ప్రేమకు ప్రతీకగా నల్లని మబ్బును తీసుకున్నాడు. భూమిపై తన చెమటను చిందించడం, తోటి మనిషి యంత్రం చేతిలో పిప్పిలా మారి ప్రకృతిని దెబ్బతీసే తత్వాన్ని ఈ కవితలో వ్యక్తం చేశాడు.

వేముల ఎల్లయ్య ఈ సంపుటిలో ఒకచోట "లేనితనమే మనిషి మేనిఫెస్టో" అంటాడు. ఎక్కువగా సఫాయికార్మికులు సామాజికంగా వెనుకబడినవారే ఉంటారు. 'సఫాయి' కవితలో వారి చెమట రుచిని, వారి మురికి జీవితాలలో గట్టుతెగిన కష్టాలను పట్టించుకోని నిర్లక్ష్యాన్ని తెలియజేస్తూ "చెమట అద్దిన నాలికే మైలపగరు రుచి.../ పారతిప్పిన మోరి తట్టుతెగిన ము రుగు.../కులం దూర్చిన పనిగడియ ఏ కార్మిక మేనిఫెస్టో లిఖితం?/ ...గీ దేశం మురికి కులవీలునామే! ఏర్కుందా?" అని సమాజానికి ప్రశ్నను, మేలుకొలుపును ఒకేసారి సంధిస్తాడు. కవిత్వంలో కనిపించే ఆవేశం, ఆవేదన కవి జీవితంలోనూ చాలా సహజంగా కనిపిస్తుంది. ఇది కవి నిబద్ధతను అర్థం చేసుకోవడానికి ఉపయోగపడేదే కానీ, బలహీనత కాదు.

వ్యవసాయచట్టాలకు వ్యతిరేకంగా రైతుల నిరసనతో దేశం అట్టుడికిపోయింది. కానీ తెలంగాణ రైతు కదలకపోవడానికి కారణాన్ని 'యుద్ధరైతు' కవితలో కారణాన్ని కళ్ళముందుపెట్టాడు. "రైతుబంధు నోట్లకట్టలు నోరు మూయించే/ సరిహద్దు దేశాన యుద్ధరైతు గెలుపుదారై/ మట్టి విత్తుపాదై మొలక గొడుగెత్తిన ఆకాశం/ ప్రపంచ చిత్రపటంలో వీరులు రైతులైంద్రూ" అంటాడు.

పుస్తకంలోని కవితలన్నీ ఒకచోట తాత్వీకరించటం కవితాసంపుటి శీర్షిక కవిత 'క్రీనీడ'లో కనిపిస్తుంది. "నిజంనీడ... ఛాయా దొరకని వినికిడి/... మూఢవిశ్వాసి శ్వాస దేవగత్తే ఊదుపొగ యంత్ర దెయ్యం/ శాస్త్రీయ జ్ఞానదోపిడీ రాజకీయ లూటి పద విపగ్గం/ బంధువులు బంధుపథకం ఓట్ల ఖరీదు ముద్దెర రొక్కం/ గింత రక్తం ఎరుపు గడ్డగట్టిన నోట్ల ముడుపులు యాగబలి/ మత కౌగిలి రాజ్యాంగ ఎచ్చిడీ/ మణిపూర్ మంటలు.../మనువాది మతశిక్ష/ భూమి తిరిగిన క్రీనీడ బుగులైతుంద్ర". నిజం కనుగొనలేని సంస్కృతినీడలో దళితులు, మతం ముసుగులో మతపెద్దలు, జ్ఞానం పేరుతో, రాజకీయం పేరుతో దోపిడీలు, బలహీనులపై అన్యాయాలు... ఇవన్నీ కవిని గుబులు కలిగించేవే. తాత్వికతతో బాటు కుల, మత, సంస్కృతీ భావనల వలన అట్టడుగుప్రజలు పడే బాధల పట్ల కవికి తార్కికత అవసరమని ఈ కవిత్వం ద్వారా నిరూపించాడు. కిందనీడ దళిత అణిచివేతకు ప్రతీకయితే, దానిపైన నీడ బహుజన జీవితాల అణచివేతకు ప్రతీక కావొచ్చు. దళిత, బహుజన స్పృహను మేల్కొలిపే గొప్ప తాత్విక తార్కిక కవిత్వం 'క్రీనీడ' కవిత్వం.

'క్రీనీడ' సంపుటి లోని కవిత్వం హేతువాదంతో పరిష్కారం దిశగా ఆధిపత్యాన్ని సవాలు చేస్తుంది. కేవలం అనుభవాలను వ్యక్తీకరించడమే కాకుండా, పరిష్కారం కనబడుతుంది. దళిత, బహుజన స్పృహను మేల్కొలిపే గొప్ప తాత్విక తార్కిక కవిత్వం 'క్రీనీడ' కవిత్వం.

పతంజలి పురస్కార ప్రదానం

స్వర్గీయ కె.ఎన్.వై. పతంజలి 73వ జయంతి సందర్భంగా పతంజలి సాంస్కృతిక వేదిక అందించే పురస్కారాన్ని 2025 సంవత్సరానికి గాను పాత్రికేయుడు, రచయిత తాడి ప్రకాష్ స్వీకరిస్తారు. మార్చి 29 సాయంత్రం విజయనగరం లోని గురజాడ గ్రంథాలయంలో ఈ పురస్కార ప్రదానం జరుగుతుంది.

భీశెట్టి బాబ్జి

కథల పోటీ

వాసా ప్రభావతి స్మారక కథల పోటీకి ఏదైనా సామాజిక అంశానికి సంబంధించిన కథలు పంపాలి. రాతప్రతిలో ఎ4 సైజులో నాలుగు పేజీలకు, డిటిపి రెండు పేజీలకు మించరాదు. ప్రథమ, ద్వితీయ బహుమతులు వరుసగా: రూ.5000, రూ.2500. ఐదు ప్రత్యేక బహుమతులు రూ.1000. కథలు పోస్ట్/ కొరియర్ ద్వారా మాత్రమే ఏప్రిల్ 30 లోగా పంపాలి. చిరునామా: సాహితీ కిరణం, ఇం.నెం.11-13-154, అలకాపురి, రోడ్‌నెం.3, హైదరాబాద్-500102. మరిన్ని వివరాలకు: 94907 51681.

పొత్తూరి సుబ్బారావు

ఆమెకో జీవితముంది

రొటీన్ నుంచి కొంచెం కొత్తగా కనిపించిన కవిత ఇది. వ్యక్తిగత జీవితంలో, వృత్తి జీవితాల్లో ఆమెల చుట్టూ సమాజం అల్లే అలుసు మాటలు చులకన భావజాలం సుపరిచితం. ఆధునిక జీవితాల్లో అలాంటి భావజాలం గురించి ఈ కవితలో మాట్లాడారు కవి రాజేశ్వరి రామాయణం.



వినోద రంగం లోని స్త్రీ అప్రాధాన్య వ్యాఖ్యలకు లోనవటం ఇతివృత్తంగా తీసుకున్నారు. సినిమాల్లో హీరోకి ఎక్కువ ప్రాధాన్యత ఉంటుంది. కానీ హీరోయిన్ లేకుండా వెండితెరను ఊహించలేరు. ఎన్నో రకాల పాత్రల్లో ఆమె ఒదిగిపోతుంది. కథ చివరిలోనైనా తనను తాను ప్రూవ్ చేసుకునే అవకాశం ఉండకపోదా అని ఎదురుచూస్తుంది. ఏదో అరుదుగా మినహాయింపు ఉంటుందేమో కానీ, అలనాటి నుండి నేటి వరకూ చాలాసార్లు తెరపై ఆమె ఒక ఆటబొమ్మ. నలుగురు తీరిగ్గా కూర్చుని చెప్పుకునే కబుర్లలో ఆమె కాలక్షేపపు బఠాణీ. సినిమా బయట ఎక్కడ ఏ వ్యక్తిగత సందర్భం లోనైనా "ఫలానా వాడి నాయిక"గా వదంతులు సృష్టిస్తుంటారు. వెండితెర మీద కనిపించే ఆమెకు అది వృత్తి అని, వ్యక్తిగతంగా ఆమెకూ ఒక జీవితం ఉంటుంది అని ప్రపంచం గుర్తించదు. పుట్ట గొడుగుల్లా పుట్టుకొస్తున్న యూట్యూబ్ ఛానెల్స్ ఒక డుగు ముందుకేసి సంబంధం లేని థంబ్ నెయిల్స్‌తో కృత్రిమ ఆసక్తిని కలిగిస్తుంటాయి. వేలి గోటి వెర్రి రాతల్లారా అని రాజేశ్వరి ఈ థంబ్ నెయిల్స్‌ను ఉద్దేశించి మాట్లాడింది. వృత్తి ఉద్యోగ విధులు నిర్వర్తించే వారంతా దాని తాలూకా వాసనల్ని తమ ఇంట్లోకో బెడ్రూమ్ లోకో ఎలా తీసుకురారో అలాగే ఆమె పాత్ర కూడా ఆమె పనిలో భాగంగా మాత్రమే చూడాలని చెప్తోంది. పని చోట సంబంధాలను వ్యక్తిగతంతో ముడిపెట్టటాన్ని ప్రతిఘటిస్తోంది. కవిత టైటిల్‌లో 'ఫలానా' ముందు ఎట్ ది రేట్ ఆఫ్ సింబల్ (@) పెట్టటం ద్వారా ఆమె ఒకరి కేరాఫ్ కాదు అని చెప్పేసింది కవి. ఎవరెవరి పేర్లతోనో జత చేసి ఆమెకో పేరుపెట్టటాన్ని నిరసిస్తోంది. ఆమె అపరిచిత కాదు. అనామకురాలు అంతకన్నా కాదు. వెండితెర కోసం పెట్టుకున్నదో తల్లితండ్రులు పెట్టినదో ఆమెకో సొంత పేరుంది. ఆమెదైన సొంత బతుకుంది అని చెప్పటం రాజేశ్వరి ఉద్దేశం.

■ ఫణి మాధవి కన్నోజు



@ ఫలానా... కాదు

ప్రియ పద్యం

నాలుగైదు తీరిక దేహాల
పోసుకోలు కబుర్లలో
పచ్చని పైరు పొలంలో
మెరిసే పరికిణీ సయ్యాటలో
పొద్దెక్కినా లేవని మొద్దు నిద్రలో
మెరుపు రేఖంటి నృత్యంలో
మెలిక ముగ్గులో
మోగే కుక్కర్ విజిల్‌లో
మురిపెంపు ప్రేమలో
మూర్తీభవించిన విజయరేఖలో
కథ చివర్లోనైనా తానుగా నిలిచే నమ్మకంలో
నిన్న నేడు రేపులలో అరుదుగా తప్ప
బోలెడన్ని సార్లు ఆటబొమ్మ ఐనా
కంటికింపుగానో
కంటగింపుగానో
తనది కాని తాత్కాలిక ఔట్‌ఫిట్‌లో
ఒదిగిపోయే ఆమె లేనిదే అతనుండడాన్ని
ఊహించలేని వెండితెర మాయాలోకం

అదేం చిత్రమో కానీ
వృత్తి జీవితానికావల
ప్రతి వ్యక్తిగత సందర్భంలో
లోకానికి ఆమె
ఫలానా వాడి నాయికనే

అరె
వేలి గోటి వెర్రి రాతల్లారా
ఇంట్లోకి బెడ్రూంలోకి
నువ్వు తీసుకురానివ్వని
నీ ఆఫీస్ ఔట్‌ఫిట్ లాంటిదే
ఆమె రోల్ అండ్ వర్క్ రిలేషన్

వీటన్నిటికావల
ఇల్లలుకుతూ పేరు మరచిపోయిన
ఈగ కాదు
ఆమె గుమ్నామీ కాదు
అంజానీ కూడా కాదు
పేరు లేని పిల్ల అంతకన్నా కాదు
తనదైనదో తెర కోసం పెట్టుకున్నదో
ఆమె కూడా నామవాచకమే!

■ రాజేశ్వరి రామాయణం




BEFORE THE AUTHORITY FOR ADVANCE RULING - ANDHRA PRADESH
Goods and Service Tax
D.No.12-168-4, Adjacent to NH-16 Service Road, Kunchanapalli, Guntur-522501
Present
1. Sri. K. Ravi Sankar, Commissioner of State Tax (Member)
2. Sri. B. Lakshmi Narayana, IRS, Joint Commissioner of Central Tax (Member)
AAR No.09/AP/GST/2024 dated: 07.06.2024

1	Name and address of the applicant	M/s MCM Pacific PTE Ltd
2	GSTIN	[illegible]
3	Date of filing of Form GST ARA-01	13.03.2024
4	Personal Hearing	12.04.2024
5	Represented by	[illegible]
6	Jurisdictional Authority – State	
7	Clause(s) of section 97(2) of CGST/SGST Act, 2017 under which the question(s) raised	a)determination of the liability to pay tax on any goods or services or both;

లైన్‌ను తొలగించి స్క్రాప్‌కు తీసుకుపోతామని జీఎస్టీ తగ్గించమని కోరుతూ మయన్మార్ కంపెనీ రాసిన లేఖపై మినహాయింపులు ఇవ్వలేమని జీఎస్టీ అథారిటీ రాసిన ప్రత్యుత్తరం

లైన్ క్లియర్!

విజయవాడ వెస్ట్ బైపాస్‌కు మార్గం సుగమం

స్క్రాప్ కోసమే ల్యాంకో ట్రాన్స్‌మిషన్ హైటెన్షన్ లైన్ కొన్నాం

- లైన్‌ను తొలగించి మా దేశం తీసుకు వెళతాం
- జీఎస్టీ నుంచి మినహాయింపు కోరుతూ జీఎస్టీ అథారిటీకి మయన్మార్ కంపెనీ లేఖ
- మీరు ఏదైనా చేసుకోండి.. జీఎస్టీ కట్టాల్సిందేనని అథారిటీ స్పష్టం



(ఆంధ్రజ్యోతి, విజయవాడ): విజయవాడ వెస్ట్ బైపాస్ వివాదంలో మరో సరికొత్త ట్విస్ట్ చోటు చేసుకుంది. కొండపల్లి ల్యాంకో పవర్ ప్రాజెక్టు మూత పడిన తర్వాత లిక్విడేటర్ నుంచి ల్యాంకో ట్రాన్స్‌మిషన్ హైటెన్షన్ లైన్‌ను కొనుగోలు చేసిన మయన్మార్‌కు చెందిన ఎంసీఎం కంపెనీ జీఎస్టీ అథారిటీకి ఒక లేఖ రాసింది. ఈ లేఖ సారాంశం ఏమిటంటే ల్యాంకో లిక్విడేటర్ నుంచి లైన్‌ను స్క్రాప్ కింద తాము కొనుగోలు చేశామని.. ఈ లైన్‌ను, మెటీరియల్‌ను ఊడదీసుకుని తమ దేశం తీసుకుని వెళతామని జీఎస్టీ కింద మినహాయింపులు ఇవ్వాల్సిందిగా అభ్యర్థిస్తూ లేఖ రాయటం జరిగింది. మేము ఇక్కడ వ్యాపారం చేయటం లేదని, కేవలం స్క్రాప్‌ను తమ దేశానికి తరలించుకునేందుకు మాత్రమే కొనుగోలు చేశామని పదేపదే తమ అభ్యర్థనలో పేర్కొనటం జరిగింది. దీనిపై జీఎస్టీ అథారిటీ మినహాయింపులు ఇవ్వటానికి అంగీకరించలేదు. జీఎస్టీ చెల్లించాల్సిందేనని చాలా స్పష్టంగా పేర్కొంది. దీంతో ల్యాంకో ట్రాన్స్‌మిషన్ హైటెన్షన్ లైన్‌ను కొనుగోలు చేసిన మయన్మార్ కంపెనీ పూర్తిగా ఆ లైన్‌ను ఊడపీకేయనుందని స్పష్టమైంది. విద్యుత్ హైటెన్షన్ తీగలతో పాటు, విద్యుత్ టవర్లను కూడా ఊడతీసుకుని వారి దేశం తరలించుకుపోవటానికి సిద్ధమవుతున్నట్లు పైపరిణామాలు తెలియజేస్తున్నాయి. ల్యాంకో లైన్‌ను కొన్న మయన్మార్ కంపెనీ స్పష్టంగా తొలగించుకుపోతామని చెబుతున్న నేపథ్యంలో ప్రభుత్వం తక్షణం జోక్యం చేసుకుని మయన్మార్ కంపెనీకి సహకారం అందిస్తే లైన్‌ను ఊడతీసుకుని తమ దేశం తరలించుకుపోతుంది. ఇదే కనుక జరిగితే రైతుల కేసులు, ఇతర గొడవలన్నీ ఆటోమేటిక్‌గా పరిష్కారమైపోతాయి. దీంతో విజయవాడ వెస్ట్ బైపాస్ విఎగిలిన పనులను ప్రారంభించటానికి దోహదపడుతుంది. రెండు, మూడు నెలల్లో ఈ పనులు పూర్తి చేయటం ద్వారా చిన్న అవుటపల్లి నుంచి గొల్లపూడి వరకు విజయవాడ వెస్ట్ బైపాస్‌ను మిగతా 6లో..

బీసెంట్ రోడ్డులోని మహంతి ఫిష్ మార్కెట్‌పై రాజకీయ గద్దల కన్ను పడింది. హోల్‌సేల్ వ్యాపారుల ప్రయోజనాల కోసం మార్కెట్‌ను తరలించేందుకు రూ.2 కోట్ల డీల్ కుదిరినట్టు సమాచారం. ఇప్పటికే సింగ్‌నగర్ ఎక్సెల్‌ప్లాంట్ దగ్గర స్థల పరిశీలన జరిపినట్టు తెలిసింది. హోల్‌సేల్ వ్యాపారులతో చేతులు కలిపిన అధికార పార్టీ నాయకుడు ఒకరు రిటైల్ వ్యాపారులను బలవంతంగా తరలించే వ్యూహం అమలు చేస్తున్నట్టు సమాచారం. దీనిలో భాగంగానే ఖాళీ చేయాలని కార్పొరేషన్ నుంచి ఒత్తిడి తెస్తున్నట్టు సమాచారం. ఈ భారీ డీల్‌పై హోల్‌సేల్ వ్యాపారుల్లో కొంత అసంతృప్తికి దారి తీయటంతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది.

రూ. 2 కోట్లకు డీల్!

మహంతి ఫిష్ మార్కెట్ తరలింపునకు కుదిరిన ఒప్పందం!

సింగ్‌నగర్ ఎక్సెల్‌ప్లాంట్ దగ్గర ఏర్పాటుకు స్థల పరిశీలన

- హోల్‌సేల్ వ్యాపారులతో చేతులు కలిపిన అధికార పార్టీ నాయకుడు!
- రిటైల్ వ్యాపారులను బలవంతంగా తరలించే వ్యూహం!
- ఖాళీ చేయాలని ఒత్తిడి చేస్తున్న కార్పొరేషన్
- విలువైన స్థలంపై రాజకీయ గద్దల కన్ను!

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): నగరంలోని మహంతి ఫిష్ మార్కెట్‌ను తరలించేందుకు అధికార పార్టీ నాయకుడొకరు రంగంలోకి దిగారు. హోల్‌సేల్ వ్యాపారులతో బేరం పెట్టారు. మొత్తం 40 మంది హోల్‌సేల్ వ్యాపారులను ఇక్కడి నుంచి తరలిపోయేలా ఒప్పించారు. బీసెంట్ రోడ్డును ఖాళీ చేసి సింగ్‌నగర్ ఎక్సెల్‌ప్లాంట్ సమీపంలో వారికి ప్రత్యామ్నాయంగా మార్కెట్ ఏర్పాటు చేసేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు. ఈ అడ్డగోలు వ్యవహారానికి కార్పొరేషన్ టౌన్ ప్లానింగ్, ఎస్టేటు విభాగాలు కూడా సహకరిస్తున్నాయి. ఇక్కడ ఉన్న హోల్‌సేల్ వ్యాపారులతో పాటుగా రిటైల్ వ్యాపారులను కూడా ఖాళీ చేయాల్సిందిగా తమ సిబ్బందిని పంపి బెదిరిస్తున్నారు.

మత్స్యకారుల కోసం నాడు నిర్మాణం

బీసెంట్ రోడ్డులో పూర్వం రోజుల్లో పేద మత్స్యకారులు చేపలు అమ్ముకునేందుకు మహంతి మార్కెట్‌ను నిర్మించటం జరిగింది. బీసెంట్ రోడ్డు వస్త్ర వ్యాపారాలకు, సమీప ప్రాంతాలన్నీ కూడా అనేక వ్యాపారాలకు ఆలవాలంగా మారటంతో మహంతి ఫిష్ మార్కెట్ కాస్తా వ్యాపార కేంద్రంగా మారిపోయింది. దీంతో హోల్‌సేల్ వ్యాపారులు మహంతి మార్కెట్‌లోకి ప్రవేశించారు. హోల్ సేల్ వ్యాపారుల ప్రవేశం మొదట్లో గొడవలను సృష్టించినా.. క్రమేణా హోల్‌సేల్ వ్యాపారులతో రిటైల్ వ్యాపారులు కూడా సర్దుకుపోయారు. పరస్పర ఆధార వ్యాపారం వల్ల ప్రయోజనాలు ఉంటాయన్న కారణంగానూ సర్దుబాటు కొనసాగింది. మహంతి ఫిష్ మార్కెట్‌లో క్రమంగా 40 మంది వరకు హోల్‌సేల్ వ్యాపారులు కొనసాగుతుండగా..100 మంది వరకు రిటైల్ వ్యాపారులు ఉన్నారు. ప్రస్తుతం మహంతి మార్కెట్ హోల్‌సేల్ వ్యాపారులకు సరిపోవటం లేదు. హోల్‌సేల్ వ్యాపారమే కాబట్టి వీరంతా ఎక్కడికి వెళ్లినా వ్యాపారం సాగుతుంది. రిటైల్ వ్యాపారులకు అలా ఉండదు. హోల్‌సేల్ వ్యాపారులంతా బయటకు వెళ్లే ఆలోచనలో ఉన్నారు.

డబుల్ ధమాకా!

మహంతి ఫిష్ మార్కెట్‌ను కనుక తొలగిస్తే సదరు రాజకీయ నాయకుడికి రెండు ప్రయోజనాలు ఉన్నాయి. ముందుగా రూ. 2 కోట్ల డీల్ సాకారమవుతుంది. ఆ తర్వాత కొత్తగా ఏర్పాటు చేసే హోల్‌సేల్ ఫిష్ మార్కెట్‌లో రిటైల్ వ్యాపారులుగా తమ వాళ్లను పెట్టుకోవచ్చు. ఇలా చేయటం ద్వారా మరింత లబ్ధిని పొందవచ్చు. ఈ రెండూ కాకుండా బీసెంట్ రోడ్డులోని మహంతి మార్కెట్ స్థలాన్ని బడా బాబులకు కట్టబెట్టవచ్చు. ఈ వ్యవహారంలో కూడా భారీగా లబ్ధి పొందే అవకాశం ఉంది.



ఎక్సెల్‌ప్లాంట్ దగ్గర స్థలాన్ని పరిశీలిస్తున్న మహంతి ఫిష్ మార్కెట్ హోల్‌సేల్ వ్యాపారులు

ఫిష్ మార్కెట్ తరలింపునకు స్కెచ్

బీసెంట్ రోడ్డులో హాకర్లు, చిరు వ్యాపారులను ఆదాయ మార్గాలుగా చేసుకున్న అధికార పార్టీ నాయకుడికి మహంతి ఫిష్ మార్కెట్ నుంచి హోల్‌సేల్ వ్యాపారులు బయటకు వెళ్లాలన్న అంశం కలిసి వచ్చింది. ఇంకేముంది ? హోల్‌సేల్ వ్యాపారులతో సంప్రదింపులు జరిపారు. ఫిష్ మార్కెట్ తరలింపునకు స్కెచ్ వేశారు. ప్రత్యామ్నాయంగా సింగ్‌నగర్ ఎక్సెల్‌ప్లాంట్ దగ్గర స్థలాన్ని చూపారు. ఈ స్థలాన్ని పలువురు హోల్‌సేల్ వ్యాపారులు చూశారు. స్థలం అనువుగా ఉందని గుర్తించారు. ప్రతిపాదిత స్థలంలోకి మహంతి ఫిష్ మార్కెట్‌ను తరలించేందుకు వీలుగా హోల్‌సేల్ వ్యాపారుల దగ్గర బేరసారాలకు దిగారు. ఒక్కో వ్యాపారికి రూ.5 లక్షల టార్గెట్ పెట్టారు. ఈ విధంగా మొత్తం 40 మంది వ్యాపారుల నుంచి రూ. 2 కోట్ల మేర డీల్ ప్రతిపాదన తీసుకు వచ్చారు. ఈ డీల్‌కు సంబంధించి కొందరు వ్యాపారులు ఓకే చెప్పినా మరికొందరు మాత్రం పెద్ద డీల్ అని మిగతా 6లో..

భూ కబ్జాలు.. సెటిల్‌మెంట్లు

వైసీపీ నాయకుడు వేల్పుల రమేశ్ నిర్వాకం

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో లెక్కలేనన్ని దందాలు

భూకబ్జాలు, సెటిల్‌మెంట్లు, బెదిరింపులు, బ్లాక్ మెయిలింగ్‌లతో వైసీపీ నాయకుడు వేల్పుల రమేశ్ చెలరేగిపోతున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఐదేళ్ల పాటు లెక్కలేనన్ని దందాలు నడిపి కోట్లకు పడగలెత్తారు. ఎంతో మంది ఈయన వేధింపులు తాళలేక పోలీసులను ఆశ్రయించారు. ఆరు కేసులు నమోదైనా చర్యలు తీసుకోవడానికి పోలీసులు వెనుకడుగు వేస్తున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత కూడా బెదిరింపులు, అక్రమార్జనకు దిగడం విస్మయానికి గురిచేస్తోంది. ఈ నేపథ్యంలో ఎట్టకేలకు రమేశ్‌ను పోలీసులు ఆదివారం అరెస్టు చేసి కోర్టుకు తరలించారు.

- కూటమి ప్రభుత్వంలోనూ వెనక్కి తగ్గని వైనం
- మొత్తం రమేశ్‌పై ఆరు కేసులు నమోదు
- ఎట్టకేలకు అరెస్టు చేసిన పోలీసులు
- పోలీసులపైకి కుక్కలను ఉసిగొల్పిన రమేశ్
- కంచికచర్ల పోలీస్ స్టేషన్‌కు తరలింపు


అరెస్టు సమయంలో పోలీసులతో వాగ్వాదానికి దిగిన రమేశ్

(ఆంధ్రజ్యోతి, కంచికచర్ల రూరల్): కంచికచర్ల మండలం కీసర గ్రామానికి చెందిన వ్యక్తి వేల్పుల రమేష్‌బాబు. ఈయన సతీమణి వేల్పుల ప్రశాంతి 2014లో టీడీపీ తరఫున ఎంపీటీసీగా పోటీ చేసి గెలిచారు. పార్టీ నిర్ణయం మేరకు ఆమెను ఎంపీపీగా ఎన్నుకున్నారు. అప్పటి వరకూ కేవలం కీసర, పెండ్యాల గ్రామాలకే పరిమితమైన రమేష్ పార్టీకి చెందిన ముఖ్య నాయకులతో స్నేహం ఏర్పరచుకొని అక్రమాలకు శ్రీకారం చుట్టారు. మండలానికే చెందిన ఒక ముఖ్య నాయకుడి అండదండలతో ఐదేళ్ల పాటు రెచ్చిపోయి ప్రవర్తించారు. రియల్ ఎస్టేట్ వ్యవహారాలలో సెటిల్‌మెంట్‌ల నుంచి భూ కబ్జాలు, బ్లాక్ మెయిలింగ్‌లతో కంచికచర్ల ప్రాంతాన్ని కంటతడి పెట్టించినట్లు తెలిసింది. అధికారుల బలహీనతలను తెలుసుకొని వారిని మానసికంగా వేధింపులకు గురి చేసినట్లు ఆరోపణలు కూడా వచ్చాయి. ఆ సమయంలోనే కోట్లాది రూపాయల ఆస్తులు సంపాదించినట్లు సమాచారం. రాజకీయంగా ప్రోత్సహించిన ఆ టీడీపీ ముఖ్య నాయకుడికి ఎదురు తిరిగే స్థాయికి చేరుకున్నారని, ఆర్థిక, రాజకీయ లబ్ధి కోసం రమేష్‌ను ప్రోత్సహించిన ఆ నాయకుడిని బహిరంగంగా ధిక్కరించి రాజకీయాలు చేసినట్లు సమాచారం. ఈ క్రమంలో ఎలాగైనా రమేష్‌ను రాజకీయంగా బలహీన పరచాలన్న ఆలోచనతో సదరు నాయకుడు రమేష్ సతీమణిపై అవిశ్వాసం పెట్టేందుకు సిద్ధమయ్యారని, మండల పరిషత్ సభ్యులంతా ఏకమైనా రమేష్‌ను ఏమీ చేయలేక పోయారని మిగతా 6లో..

అరెస్టు సమయంలో హైడ్రామా

ఎట్టకేలకు వేల్పుల రమేశ్‌ను పోలీసులు ఆదివారం అరెస్టు చేసి కంచికచర్ల పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం నందిగామ కోర్టులో హాజరుపరిచారు. వైసీపీ అధికారంలో ఉండగా, ఆయన అడ్డగోలుగా పంచాయితీలు చేయడంతో పాటు ఒప్పుకోని వారిపై దౌర్జన్యానికి పాల్పడ్డారు. ఆయనపై ఆరు కేసులు నమోదయ్యాయి. ఈ కేసులపై శనివారం సాయంత్రం అరెస్టు చేస్తారని తెలుసుకున్న రమేష్ తన అనుచరులను ఇంటికి రప్పించుకున్నారు. పోలీసులు ఇంట్లోకి రాకుండా అడ్డగించడమే కాకుండా తన ఇంట్లో కుక్కను వారిపైకి ఉసిగొల్పారు. చివరకు ఆదివారం ఉదయం ఏడు గంటలకు రమేష్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు స్టేషన్‌కు తరలించారు. పోలీస్ వాహనం ఎక్కనని పట్టుబట్టడంతో సొంత వాహనంలోనే స్టేషన్‌కు తరలించారు. మొత్తం ఐదు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.

బుడమేరులో మట్టి దందా!

అనుమతి లేకుండా మూడు రోజులుగా మట్టి తవ్వకాలు

- ఉంగుటూరు, ఉయ్యూరు, గన్నవరం ప్రాంతాలకు తరలింపు
- గత వైసీపీ ప్రభుత్వంలో పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ నిర్వాకం
- చోద్యం చూస్తున్న డ్రైనేజీశాఖ అధికారులు
- నిలుపుదల చేయించిన పాములపాడు డీసీ చైర్మన్ యార్లగడ్డ రవి


బుడమేరులో మట్టి తవ్వకాలు

గత వైసీపీ ప్రభుత్వంలో మాజీ మంత్రి కొడాలి నాని ముఖ్య అనుచరులు పాలడుగు రాంప్రసాద్, వల్లమూడి చిన్ని సిఫారసుతో పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ తాజాగా బుడమేరులో మట్టి దందాకు తెరలేపారు. ఎటువంటి అనుమతులు లేకుండా మూడు రోజులుగా వందలాది లారీల మట్టిని తవ్వి ఉంగుటూరు, ఉయ్యూరు, గన్నవరం ప్రాంతాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. అడ్డుకోవాల్సిన డ్రైనేజీశాఖ అధికారులు చోద్యం చూస్తున్నారు. గ్రామస్తుల ఫిర్యాదుపై స్పందించిన పాములపాడు డీసీ చైర్మన్ యార్లగడ్డ రవి ఉన్నతాధికారులతో మాట్లాడి మట్టి తవ్వకాలను అడ్డుకున్నారు.

ఆంధ్రజ్యోతి-గుడివాడ: నందివాడ మండలం చేదుర్తిపాడు వద్ద బుడమేరు వెడల్పు, ఎత్తును పెంచే విధంగా గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పనులు ప్రారంభించారు. మాజీ మంత్రి కొడాలి నాని అండతో బుడమేరు కట్టలను పటిష్ఠపరచకుండా, ఎత్తు పెంచకుండా వందలాది టిప్పర్లతో కాంట్రాక్టర్ మట్టిని అమ్మేసుకున్నారు. గుడివాడలోని జగనన్న కాలనీ మెరకకు మట్టిని తరలించి కోట్ల రూపాయల ప్రభుత్వ సొమ్ము దోచుకున్నారు. గడ్డం గ్యాంగ్‌లో సదరు కాంట్రాక్టర్ కూడా సభ్యుడని వైసీపీ వర్గాలు బాహాటంగానే పేర్కొంటున్నాయి.

ఎక్స్‌టెన్షన్ ఆఫ్ టైం అనుమతులు లేకుండానే..

కాంట్రాక్టు నిర్ణీత గడువు పూర్తైన గడువు సమయాన్ని డ్రైనేజీ అధికారులు పెంచలేదు. గత వైసీపీ మిగతా 6లో..

రాత్రి 12 గంటల వరకు అమ్మకాలు

- హోటళ్లకు అనుమతి ఇచ్చిన అధికారులు
- మూడు నెలలపాటు ప్రయోగాత్మకంగా పరిశీలన

విజయవాడ, మార్చి 23(ఆంధ్రజ్యోతి): విజయవాడ నగరంలో అర్ధరాత్రి 12 గంటల వరకు ప్రజలకు ఆహారం అందుబాటులో ఉంటుంది. నగరంలో ఉన్న హోటళ్లు, రెస్టారెంట్లను రాత్రి 12 గంటల వరకు నిర్వహించుకునేందుకు పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు అనుమతి ఇచ్చారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయడంలో భాగంగా రాత్రి 12 గంటల వరకు హోటళ్లు, రెస్టారెంట్లను నిర్వహించుకునేందుకు వీలుగా ఉత్తర్వులు విడుదల చేసింది. దీన్ని తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం అటకెక్కించింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత హోటల్స్ అసోసియేషన్ ప్రతినిధులు పలుమార్లు సీఎం చంద్రబాబును కలిసి 12 గంటల వరకు వ్యాపారాలు నిర్వహించుకునేందుకు అనుమతి ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. మూడు రోజుల క్రితం రాష్ట్ర హోటల్స్ అసోసియేషన్ ప్రతినిధులతో కలెక్టర్ లక్ష్మీశ, పోలీస్ కమిషనర్ రాజశేఖరబాబు, వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ సమావేశమయ్యారు. నగరంలో పరిశుభ్రత, పర్యాటక అభివృద్ధి అంశాలపై చర్చించారు. రాష్ట్రంలో ఇప్పటికే విశాఖపట్నంలో రాత్రి 12 గంటల వరకు వ్యాపారాలు నిర్వహించుకునేందుకు హోటళ్లు, రెస్టారెంట్లకు అనుమతి ఇచ్చారని ప్రతినిధులు వివరించారు. విజయవాడలో పరిస్థితి విశాఖపట్నం కంటే భిన్నంగా ఉన్నందున మూడు నెలలపాటు ప్రయోగాత్మకంగా హోటళ్లు, రెస్టారెంట్లు రాత్రి 12 గంటల వరకు పనిచేసేలా పోలీసు కమిషనర్ అనుమతిచ్చారు. నగరంలో 144 రెస్టారెంట్లు, 65 హోటళ్లు ఉన్నాయి. మూడు నెలలపాటు పరిస్థితులను పరిశీలించిన తర్వాత ఏం చేయాలన్న దానిపై నిర్ణయం తీసుకుంటామని పోలీసు కమిషనర్ స్పష్టం చేశారు.

రోడ్డు ప్రమాదంలో తల్లీకొడుకు దుర్మరణం

తెలంగాణలోని దమ్మపేట వద్ద బైక్‌ను ఢీకొన్న గుర్తుతెలియని వాహనం



అరిసేపల్లి సరస్వతి, కృష్ణ(ఫైల్)

- చెల్లెల్ని చూసేందుకు వెళ్తుండగా ఘటన
- ముష్టికుంట్లలో విషాద చాయలు

తిరువూరు, మార్చి 23(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రం ఖమ్మంజిల్లా దమ్మపేట వద్ద ఆదివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో తిరువూరు మండలం ముష్టికుంట్ల గ్రామానికి చెందిన తల్లీకొడుకు దుర్మరణం చెందారు. వివరాల్లోకి వెళితే.. ముష్టికుంట్లకు చెందిన అరిసేపల్లి సరస్వతి(65) ఖమ్మం జిల్లా అశ్వారావుపేట సమీపంలోని మరావరిగూడెంలో ఉంటున్న తన చెల్లిని చూసేందుకు తన కుమారుడు అరిసేపల్లి కృష్ణ(45)తో కలిసి ద్విచక్రవాహనంపై బయలుదేరారు. తెలంగాణ రాష్ట్రం ఖమ్మం జిల్లా దమ్మపేట వద్ద గుర్తుతెలియని వాహనం వీరి ద్విచక్రవాహనాన్ని ఢీకొనడంతో తల్లీకొడుకులు అక్కడికక్కడే మృతి చెందారు. ఈ ఘటనపై దమ్మపేట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. రోడ్డు ప్రమాదంలో భర్త, అత్త మృతి చెందారన్న వార్త తెలుసుకుని కృష్ణ భార్య లలితకుమారి స్పృహతప్పి పడిపోయింది. ముష్టికుంట్ల సర్పంచ్ గొల్లమందల కోటేశ్వరరావు, ఉపసర్పంచ్ గద్దె అనిల్ చౌదరి, గ్రామస్తులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాలకు అశ్వారావుపేట ప్రభుత్వ వైద్యశాలలో పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం స్వగ్రామం తరలించారు. మృతుడు కృష్ణకు ఇద్దరు సంతానం. తల్లీకొడుకుల మృతితో గ్రామంలో విషాద చాయలు అలముకున్నాయి.

క్షయ వ్యాధితో.. ప్రమాదమే 6లో

- నేడు ప్రపంచ క్షయ దినోత్సవం



రంజాన్ వేళలు

ఇఫ్తార్ : 06-19 (సోమవారం సాయంత్రం)
సహర్ : 04-56 (మంగళవారం ఉదయం)



దుర్గమ్మను దర్శించుకుంటున్న భక్తులు

ఇంద్రకీలాద్రిపై భక్తుల రద్దీ

వన్‌టౌన్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మ దర్శనానికి ఆదివారం పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకునేందుకు కుటుంబాలతో తరలివచ్చారు. అమ్మవారికి తలనీలాలు సమర్పించుకుని, కృష్ణానదిలో పవిత్ర స్నానాలు చేశారు. కొండపైన క్యూలలో కనకదుర్గమ్మ కరుణ కోరుతూ ఆర్తితో అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులు పొంగళ్లు సమర్పించారు. వివిధ ఆర్జిత సేవల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. క్యూలైన్లలో రద్దీని అధికారులు క్రమబద్ధీకరించారు. భక్తుల రద్దీని పురస్కరించుకుని తాగునీరు, అన్నప్రసాదం సత్వరం అందేలా చర్యలు తీసుకున్నారు.

జిల్లా గ్రంథాలయ అధ్యక్ష, కార్యదర్శులుగా

సాంబశివరావు, శ్రీనివాసరాజు



గుమ్మా సాంబశివరావు



వై.శ్రీనివాసరాజు

బెంజిసర్కిల్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ సంఘం కృష్ణాజిల్లా శాఖ అధ్యక్షుడిగా ఆంధ్ర లయోలా కళాశాల రిటైర్డ్ వైస్ ప్రిన్సిపాల్ గుమ్మా సాంబశివరావు, కార్యదర్శిగా కేబీఎన్ కళాశాల గ్రంథపాలకుడు వై.శ్రీనివాసరాజు ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా మైలవరం లక్కిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాల లైబ్రేరియన్ టి. సాంబశివరావు, సహాయ కార్యదర్శిగా కృష్ణాజిల్లా అభ్యుదయ రచయితల సంఘం కార్యదర్శి పి.అజయ్ కుమార్‌తోపాటు మరో ఐదుగురు కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారు. జిల్లాశాఖ సర్వసభ్య సమావేశం ఆదివారం బెంజిసర్కిల్‌లోని సర్వోత్తమ భవనంలో అధ్యక్షుడు వేములపల్లి కేశవరావు అధ్యక్షతన జరిగింది. సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన గ్రంథాలయ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రావి శారద పాల్గొని జిల్లాలో గ్రంథాలయం రంగ పరిస్థితులపై చర్చించారు. జిల్లాలో పౌరులతో గ్రంథపఠన అలవాటు పెంపొందించే కార్యక్రమాలు నిర్వహించాలని, ప్రైవేట్ గ్రంథాలయాల స్థితిగతులను పరిశీలించి వాటి అభివృద్ధికి స్థానిక దాతలను ప్రోత్సహించాలని, సంఘ సభ్యులు పాఠశాలల్లో విద్యార్థులకు గ్రంథాలయాల పట్ల అవగాహన కల్పించాలని సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది.

రిటర్నింగ్ ప్లాట్లకు నేడు ఈ-లాటరీ

విజయవాడ (కలెక్టరేట్), మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : గన్నవరం విమానాశ్రయ అభివృద్ధికి భూములిచ్చిన రైతులకు అమరావతిలో కేటాయించే రిటర్నబుల్ ప్లాట్లకు సోమవారం ఉదయం 10 గంటలకు ఈ-లాటరీ నిర్వహించనున్నారు. లెనిన్ సెంటర్‌లో ఉన్న ఏపీ సీఆర్‌డీఏ ప్రధాన కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఈ-లాటరీ జరుగుతుందని ఏపీ సీఆర్‌డీఏ కమిషనర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ లాటరీలో 59 మంది రైతులకు 236 రెసిడెన్షియల్, కమర్షియల్ ప్లాట్లను ఆన్‌లైన్ ర్యాండమ్ సిస్టమ్ ద్వారా కేటాయిస్తామని పేర్కొన్నారు.

పథకం ప్రకారమే తిరునాళ్లలో

వైసీపీ కార్యకర్తల కవ్వింపులు : జిల్లేపల్లి

జగ్గయ్యపేట (పెనుగంచిప్రోలు), మార్చి 23 (ఆంధ్రజ్యోతి): పథకం ప్రకారమే పెనుగంచిప్రోలు తిరునాళ్లలో వైసీపీ కార్యకర్తలు అలజడి సృష్టించారని విజయవాడ పార్లమెంట్ టీడీపీ కార్యదర్శి, గ్రామ మాజీసర్పంచ్ జిల్లేపల్లి సుధీర్‌బాబు ఆరోపించారు. ఆయన ఆదివారం విలేకర్లతో మాట్లాడుతూ, గ్రామంలో ఐదేళ్లుగా ప్రభలు కట్టని వైసీపీ కార్యకర్తలు ఈ ఏడాది ప్రభ కట్టటమే కాకుండా ఇష్టారాజ్యంగా డీజేలు పెట్టి ప్రజలను ఇబ్బందులకు గురిచేశారని, పోలీసు స్టేషన్ వద్ద టీడీపీ కార్యకర్తలపైకి వాటర్ బాటిల్స్ విసిరారని ఆరోపించారు. వీడియోలలో వాళ్లు విసిరిన రాళ్లు కానిస్టేబుళ్లకు తగిలినట్టు కనబడుతోందని చెప్పారు.

బైండోవర్ కేసులు పెట్టండి : ఇంటూరి రాజగోపాల్

పెనుగంచిప్రోలు తిరునాళ్ల ఘటనల్లో విద్యార్థులపై కేసులు నమోదు చేయటం సబబు కాదని, వైసీపీ నేత మాజీ మున్సిపల్ చైర్మన్ ఇంటూరి రాజగోపాల్ అన్నారు. విద్యార్థులపై కేసులు పెట్టి వారి జీవితాలు నాశనం చేయవద్దని వేడుకున్నారు. రెండు పక్షాలపై బైండోవర్ కేసులు పెట్టి కలెక్టర్‌కు సరెండర్ చేయాలని కోరారు.

మానసిక స్థితి సరి లేక..

కృష్ణానదిలో దూకిన యువకుడు

» ఆచూకీ కోసం ఎస్డీఆర్ఎఫ్ బృందాల గాలింపు



షేక్ సుభాని

విద్యాధరపురం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): తల్లితో కలిసి బైక్‌పై కృష్ణలంకలో ఉన్న బంధువుల వద్దకు వెళుతున్న యువకుడు ప్రకాశం బ్యారేజి వద్దకు వచ్చే సరికి బైక్‌ను రోడ్డు పక్కన నిలిపి పరుగెత్తుకుంటూ వెళ్లి కృష్ణానదిలో దూకిన సంఘటన ఆదివారం జరిగింది. యువకుడి తల్లి ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుంటూరు జిల్లా, ప్రత్తిపాడు మండలం, చినకొండూరుపాడు గ్రామానికి చెందిన షేక్ మస్తాన్‌బి భర్త, ఇద్దరు కుమారులతో ఉంటున్నారు. భార్య, భర్తల మధ్య విభేదాలు రావటంతో ఆరు నెలల నుంచి ఆమె ఇద్దరు కుమారులతో కలిసి ఇబ్రహీంపట్నం, వీటీపీఎస్ రోడ్డు, ఖాజీ మాన్యం ఏరియాలోని ఓ ఇంటిలో అద్దెకు ఉంటున్నారు. ఈమె పెద్ద కుమారుడు షేక్ సుభాని (20) స్నేహితుడు హుస్సేన్ బుడే ఏడాది క్రితం అనారోగ్య కారణంగా చనిపోయాడు. అప్పటి నుంచి సుభాని మతిస్థిమితం లేక పిచ్చిపిచ్చిగా వ్యవహరిస్తూ ఇంటి నుంచి బయటకు వెళ్లి ఒకటి రెండు రోజుల తరువాత వచ్చేవాడు. ఈ క్రమంలో షేక్ మస్తాన్‌బి ఆదివారం సుభానితో కలిసి ద్విచక్రవాహనంపై కృష్ణలంకలో ఉన్న సోదరి వద్దకు బయలుదేరింది. ప్రకాశం బ్యారేజీ వద్దకు వచ్చేసరికి సుభాని బైక్‌ను రోడ్డు పక్కన నిలిపి పరుగెత్తుకుంటూ వెళ్లి 63, 64 ఖానాల వద్ద పై నుంచి నదిలోకి దూకేశాడు. దీంతో ఆమె పెద్దగా కేకలు వేయగా అక్కడే ఉన్న ఎస్‌డిఆర్ఎఫ్ సిబ్బంది ఘటనా ప్రాంతానికి వెళ్లి సుభాని కోసం వెతికినా అతడి ఆచూకీ లభించలేదు. సుభాని తల్లి మస్తాన్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. నదిలో దూకిన సుభాని కోసం గాలిస్తున్నారు.


26న వైసీపీ ఇఫ్తార్ విందు

» హాజరుకానున్న వైఎస్ జగన్

గుణదల, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 26న ఎన్టీఆర్ జిల్లా వైసీపీ ఆధ్వర్యంలో ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ఇవ్వనున్నట్టు పార్టీ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాశ్ తెలిపారు. గుణదలలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గురునానక్‌నగర్ నాక్ కళ్యాణ మండపంలో ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ఇవ్వనున్నట్టు చెప్పారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి హాజరుకానున్నారని తెలిపారు. నియోజకవర్గంలోని ముస్లిం సోదరులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

నేడు ప్రపంచ క్షయ దినోత్సవం సందర్భంగా..

క్షయ వ్యాధితో.. ప్రమాదమే



జాగ్రత్తలు తీసుకుంటే నివారణ సులభం

క్షయ(టీబీ) ప్రాణాంతకమైనా కానీ నివారణ సాధ్యమే! వ్యాధి పట్ల ప్రజలకు అవగాహన లేక, దానిని తెలుసుకోలేక కోరి ప్రాణం మీదకు తెచ్చుకుంటున్నారు. నివారణ మందులు అందుబాటులో ఉన్నా.. నిర్లక్ష్యం ప్రాణాలను కబళిస్తోంది. క్షయ పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండటం ద్వారా మృత్యువు నుంచి బయటపడవచ్చు.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ)

క్షయ ప్రధానంగా ఊపిరితిత్తులను దెబ్బతీస్తుంది. అక్కడి నుంచి చర్మం, మెదడు వరకు ప్రతి భాగానికి సోకే అవకాశం ఉంటుంది. ఊపిరితిత్తులకు సోకే టీబీని పల్మినరీ టీబీ అంటారు. మెదడు, వెన్నుపూస, జీర్ణాశయం, కిడ్నీలకు సోకితే ఎక్స్‌ట్రా పల్మినరీ టీబీ అంటారు. ఊపిరితిత్తుల టీబీ గాలితో సోకుతుంది. టీబీ సోకిన వ్యక్తి దగ్గినా, తుమ్మినా, ఉమ్మినా టీబీ బ్యాసిలే అనే వైరస్ గాలిలో చేరుతుంది. ఆ గాలిని పీల్చుకోవడం ద్వారా ఇతరులు వ్యాధి బారిన పడే ప్రమాదం ఉంది. హైరిస్క్ టీబీ బలహీన రోగనిరోధక శక్తి (వీక్ ఇమ్యూనిటీ) ఉన్న వారిలో ఉంటుంది. హెచ్‌ఐవీ, డయాబెటిక్, డయాలసిస్ రోగులు, అవయవ మార్పిడి చేసుకున్న, కేన్సర్ రోగులు, హెల్త్ కేర్ వర్కర్స్, టీబీ ఉన్న వ్యక్తులకు అతి దగ్గరగా ఉండే వాళ్లలో హైరిస్క్ టీబీ వచ్చే అవకాశం ఉంటుంది.

● ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవాన్ని ప్రతి ఏడాది మార్చి 24న జరుపుకుంటారు. ఈరోజు 1882లో డాక్టర్ రాబర్ట్ కోచ్ ట్యూబర్క్యులోసిస్ (క్షయ) కారక బాక్టీరియాను కొనుగొన్నారు. క్షయ నివారణ దినోత్సవాన్ని జరుపుకోవడం ద్వారా వ్యాధి గురించి అవగాహన పెంచడం, నియంత్రణ, చికిత్స విధానం ప్రజలకు తెలియ చేసే ముఖ్య ఉద్దేశంతో ప్రతి ఏటా టీబీ దినోత్సవాన్ని జరుపుకోవటం జరుగుతోంది.

● దీర్ఘకాలికంగా విపరీత దగ్గు, రాత్రి వేళల్లో జ్వరం, చెమట పోయడం, బరువుతో పాటు ఆకలి తగ్గడం, అరుదుగా రక్త వాంతులు, మందులకు స్పందించకపోవడం వంటివి కనిపిస్తే వెంటనే వైద్య సహాయం తీసుకోవాలి. వైద్యులు ఛాతీ ఎక్స్‌రే, కళ్లె పరీక్షలు చేస్తారు.

● క్షయ వ్యాధి నివారణ, చికిత్సకు పరిశోధనలు ప్రపంచ వ్యాప్తంగా జరుగుతున్నాయి. కొత్త మందులు, టీకాలు, చికిత్స పద్ధతుల అభివృద్ధికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. టీబీ సోకిన వారికి ఆరు నెలల చికిత్స ఉంటుంది. చికిత్స విధానం దీర్ఘకాలికంగా ఉండొచ్చు. మందులు పూర్తిగా వాడకపోయినా డ్రగ్ రెసిస్టెంట్ టీబీగా దారి తీసే అవకాశం ఉంటుంది. ప్రభుత్వమే డాట్ ద్వారా పూర్తి వైద్య సాయం చేస్తుంది.

● 2012 కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు టీబీ అనేది నోటిఫైబుల్ వ్యాధి. ఎవరైనా టీబీ వ్యాధిగ్రస్తుడ్ని గుర్తిస్తే వారికి దగ్గర్లో ఉన్న ప్రభుత్వాసుపత్రికి రోగి యొక్క వివరాలు తెలియజేయాలి. అలా చేయకుంటే 2 నుంచి 3 ఏళ్ల పాటు రోగి రహస్యాలను దాచినందుకు గాను శిక్ష పడే అవకాశం ఉంది.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి. గాలి వెలుతురు ఉన్న గదిలో ఉండాలి. దగ్గినప్పుడు రుమాలు కాని, టిష్యుపేపర్ కాని, చెయ్యి కాని అడ్డు పెట్టి దగ్గాలి. జీవన శైలీ ఆరోగ్యకరంగా ఉండాలి. పోషకాహారం తీసుకోవడంతో పాటు శారీరక వ్యాయామం ఉండాలి. ఇంట్లో పిల్లలు, వృద్ధులు, గర్భవతులతో జాగ్రత్తగా ఉండాలి.

ప్రభుత్వ వైద్యశాలలు ఉత్తమం

- డాక్టర్ ప్రసన్నరాణి



ఎన్టీఆర్ జిల్లాలో సుమారు 5వేలు మంది టీబీ రోగులున్నారు. అన్ని ప్రభుత్వ వైద్యశాలల్లో క్షయ వ్యాధికి డాట్ సెంటర్స్ ద్వారా ఉచిత వైద్య సేవలందిస్తున్నారు. అంతేకాక ఇక్కడ వైద్యం సాయం పొందే రోగులకు కేంద్ర ప్రభుత్వం నెలకు రూ.1,000 చొప్పున నేరుగా వారి బ్యాంకుఖాతాల్లోనే సాయం జమ చేస్తున్నది.

క్రిమి ద్వారా వ్యాప్తి చెందే వ్యాధి ఇది

- డాక్టర్ సుధిన, పలమనాలజీ హెచ్‌వోడీ



ఇది అంటువ్యాధి. ఒకరి నుంచి మరొకరికి వస్తుంది. గర్భిణులకు వ్యాధిని గుర్తించి మందులు వాడితే బిడ్డకు సోకే అవకాశం ఉండదు. జీజీహెచ్‌లో ఎక్స్‌రే, సిటీ స్కాన్, అల్ట్రాసౌండ్ స్కానింగ్ ద్వారా వ్యాధి నిర్ధారణ చేస్తున్నాం.

ఆకట్టుకున్న ఉగాది కవి సమ్మేళనం

» ఆత్మీయ పురస్కారాలు ప్రదానం



ప్రతిభా పురస్కారాలు అందజేస్తున్న బుద్ధప్రసాద్, గజల్ శ్రీనివాస్ తదితరులు

విజయవాడ కల్చరల్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : ఉగాది సందర్భంగా నిర్వహించిన జాతీయ కవిసమ్మేళనం సాహిత్యాభిమానులను విశేషంగా ఆకట్టుకుంది. కవులు కోసూరి రవికుమార్, శిఖా ఆకాష్, అమూల్య చంద్, చిట్టూరి ఆనంద రామ సుధాకర్, సరికొండ నరసింహ రాజు, మేరీ కృపారాయి, బత్తిన అగస్తీశ్వర రావు, గోలి మధు, గడల శివప్రసాద్ తదితరులు ఉగాది ప్రత్యేకతను ప్రతిబింబించే కవితలను వినిపించారు. గజల్ చారిటబుల్ ట్రస్ట్, సేవ్ టెంపుల్ భారత్ సంయుక్త అధ్వర్యంలో విశ్వావసు నామ సంవత్సర ప్రతిభా పురస్కారాలు ఘనంగా నిర్వహించారు. నగరంలోని ఘంటసాల వెంకటేశ్వరరావు సంగీత కళాశాలలో ఆదివారం జరిగిన వేడుకలకు గిన్నిస్ బుక్ వరల్డ్ రికార్డుల గ్రహీత డాక్టర్ గజల్ శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. కార్యక్రమానికి శాసనసభ పూర్వ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్, కృష్ణామిల్క్ చైర్మన్ చలసాని ఆంజనేయులు, సాంస్కృతిక బంధు వేముల హజరత్తయ్య గుప్తా, హలో టీవీ మేనేజింగ్ డైరక్టర్ ఉండ్రాజవరపు కిషోర్, రోటరీ పూర్వ గవర్నర్ ఎంసీ దాస్, ఈ-జోన్ సెక్యూరిటీ సొల్యూషన్స్ డైరక్టర్ చలపాటి వెంకటేశ్వరరావు, హెల్ప్ హస్పటల్స్ సీఈవో చలపాటి జయంత్, నవ మల్లెతీగ ఎడిటర్ కలిమిశ్రీ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. విభిన్న రంగాల్లో విశేష సేవలందించిన ప్రతిభావంతులను ఉగాది ఆత్మీయ పురస్కారాలతో సన్మానించారు. సామాజిక సేవ - గుళ్లపల్లి నాగసాయి, శాస్త్రీయ సంగీతం - మార్పూరు హరిబాబు, చిత్రలేఖనం - పోలాకి వెంకటరమణమూర్తి, విద్యా సేవా రంగం - రేపాక రఘునందన్, సాహిత్యం - తపస్వి శ్రీ పంతుల వెంకటేశ్వరరావు, ఆధ్యాత్మిక సేవారంగం - మందలపర్తి నరసింహాచార్యులు, ప్రకృతి వైద్యసేవలు-కంబాల సుబ్రహ్మణ్య శాస్త్రి, పౌరాణిక నాటకం-షణ్ముఖి జయవిజయకుమార్ రాజు, న్యాయ సేవా రంగం - గుండపు రాజేష్ కుమార్, శాస్త్రీయ నృత్యం - డాక్టర్ భాగవంతుల సామ్య, యోగా - కొప్పుల శ్రీనివాస్‌లకు అందించారు. ముందుగా శ్రీ విష్ణు సహస్రనామ సామూహిక పారాయణం నిర్వహించారు. శాస్త్రీయ బృంద నాట్య ప్రదర్శన జరిగింది.

భర్తపై కోపంతోనే

గొంతు కోసుకుంది!

» దుండగులు ఎవరూ రాలేదని గుర్తించిన పోలీసులు

» కొండపల్లి ఘటనలో వెలుగులోకి వాస్తవాలు

విజయవాడ, మార్చి 23(ఆంధ్రజ్యోతి) : ఇబ్రహీంపట్నం మండలం కొండపల్లిలో మహిళపై దుండగులు ఎవరూ దాడి చేయలేదని పోలీసులు గుర్తించారు. బాధితురాలే గొంతు కోసుకుని ఆత్మహత్యకు యత్నించినట్టు తేల్చారు. శనివారం రాత్రి అమెరికన్ ఆసుపత్రి వెనుక ఉన్న భవనం మొదటి అంతస్తులో ఉన్న మహిళ భర్త బాబ్జీ ఇంటికి వచ్చే సరికి రక్తపు మడుగులో ఉన్న విషయం తెలిసిందే. దీనిపై పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేశారు. రమ కొంతకాలంగా పక్షవాతంతో బాధపడుతోంది. వారి కుమార్తె లండన్‌లో భర్తతో స్థిరపడగా.. బాబ్జీ కుమార్తె వద్దకు వెళ్లేందుకు ప్రయత్నాలు చేస్తున్నాడు. శనివారం అతడు వీసా ఇంటర్వ్యూకు వెళ్లాడు. భార్యకు పక్షవాతం ఉండటంతో ఆమెను ఇంట్లో పెట్టి బయట తాళాలు వేసుకుని టీస్టాల్‌కు వెళ్లాడు. పడమర, దక్షిణం వైపున తలుపులకు లోపల గడియ పెట్టి ఉన్నాయి. బాబ్జీ వచ్చి తలుపు గడియ పగలగొట్టి లోపలకు వెళ్లి చూసేసరికి ఆమెకు మెడ వద్ద రక్త స్రావం అవుతోంది. భార్యాభర్తల మధ్య ఎలాంటి మనస్పర్థలు లేకపోయినప్పటికీ అతడు లండన్ వెళ్లడం రమకు ఇష్టం లేదు. తనను ఒంటరిగా వదిలేసి లండన్ వెళ్తున్నాడన్న మానసిక బాధతో ఆమె గొంతు కోసుకుందని తేల్చారు. ఈ ఘటన జరిగే సమయంలో విద్యుత్ అంతరాయం ఏర్పడింది. ఆ వీధిలో ఉన్న వాళ్లంతా బయట కూర్చున్నారు. చుట్టుపక్కల వారిని విచారించగా రమ ఇంట్లోకి ఎవరూ వెళ్లినట్టు గానీ, వచ్చినట్టు గానీ కనిపించలేదని వివరించారు. దుండగులు చొరబడితే పారిపోయేటప్పుడు బయట గడియ పెడతారు. లోపలి వైపు గడియి పెట్టి ఉండటంతో పోలీసులు మరో కోణంలో దర్యాప్తు చేయగా అసలు విషయం వెలుగులోకి వచ్చింది.

బెజవాడ డెవలపర్‌కు అరుదైన గౌరవం

» క్రెడాయ్ ఏపీ ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నిక



దాసరి రాంబాబు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : బెజవాడకు చెందిన దాసరి రాంబాబు కాన్ఫడరేషన్ ఆఫ్ రియల్ ఎస్టేట్ డెవలపర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (క్రెడాయ్) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎంపికయ్యారు. రాజమండ్రిలో జరిగిన క్రెడాయ్ మేనేజింగ్ కమిటీ ఎన్నికలలో ఈ మేరకు దాసరి రాంబాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. దాసరి రాంబాబు పీవీఆర్ గ్రూప్‌కు మేనేజింగ్ పార్టనర్‌గా ఉన్నారు. విజయవాడ క్రెడాయ్ చాప్టర్ ఈసీ మెంబర్‌గా కూడా గతంలో ఆరు సంవత్సరాలు పనిచేశారు. ఆ తర్వాత జాయింట్ సెక్రటరీగా 2 సంవత్సరాలు, కోశాధికారిగా 4 సంవత్సరాలు, ప్రధాన కార్యదర్శిగా 2 సంవత్సరాలు, క్రెడాయ్ ఏపీ కోశాధికారిగా 2 సంవత్సరాలు, క్రెడాయ్ విజయవాడ అధ్యక్షులుగా 2 సంవత్సరాల పాటు ఆయన పనిచేశారు.

రూ.2కోట్లకు డీల్!

(5వ పేజీ తరువాయి)

అభిప్రాయపడుతున్నట్టు తెలుస్తోంది. ఈ డీల్‌పై హోల్‌సేల్ వ్యాపారుల్లో అంతర్గతంగా రచ్చ జరుగుతోంది. దీంతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ఇదిలా ఉంటే మహంతి ఫిష్ మార్కెట్ తొలగింపునకు సంబంధించి కార్పొరేషన్ టౌన్ ప్లానింగ్ విభాగం, ఎస్టేటు విభాగాలు రంగంలోకి దిగాయి. తమ సిబ్బందిని పంపించి మహంతి ఫిష్ మార్కెట్‌లోని రిటైల్ వ్యాపారులను ఖాళీ చేయాల్సిందిగా వారిపై ఒత్తిడి తీసుకువస్తున్నారు. తాము ఇక్కడి నుంచి కదిలేది లేదని వారు గట్టిగా చెప్పినట్లు సమాచారం. దీంతో కార్పొరేషన్ అధికార యంత్రాంగం, మహంతి ఫిష్ మార్కెట్ రిటైల్ వ్యాపారుల నడుమ వివాదం నడుస్తోంది.

బుడమేరులో మట్టి దందా!

(5వ పేజీ తరువాయి)

హయాంలో మొదలైన పనులకు ఎటువంటి ఎక్స్‌టెన్షన్ ఆఫ్ టైమ్(ఇ.వో.టి) లేకుండానే గత మూడు రోజులుగా సదరు కాంట్రాక్టర్ మట్టి దోపిడీ సాగిస్తున్నాడు. గడువు సమయం పెంచాలని కోరుతూ కాంట్రాక్టర్ అర్జీ పెట్టుకున్నట్లు డ్రైనేజీ అధికారులు పేర్కొంటున్నారు. డ్రైనేజీ చీఫ్ ఇంజనీర్ నుంచి ఎటువంటి అనుమతులు రాకుండానే మూడు రోజులుగా యథేచ్ఛగా మట్టి తవ్వి తరలించేస్తున్నాడు.

పెగ్ మార్కింగ్‌తో మొదలు

డ్రైనేజీకి సంబంధించిన భూమి ఎంత మేర ఉందో ఇటీవల డ్రైనేజీ అధికారులు రెవెన్యూ అధికారులతో పెగ్ మార్కింగ్ చేయించారు. దీంతో ఎటువంటి అనుమతులు లేకుండానే సదరు కాంట్రాక్టర్ మట్టితవ్వకాలు ప్రారంభించి వేరే ప్రాంతాలకు తరలించసాగారు. ఉంగుటూరు, ఉయ్యూరు, గన్నవరం పరిధిలోని రియల్ ఎస్టేట్ వెంచర్‌లకు మట్టిని అమ్ముకున్నట్లు సమాచారం.

నిద్రావస్థలో డ్రైనేజీ శాఖ

గత మూడు రోజులుగా పగులు, రాత్రి తేడా లేకుండా బుడమేరు నుంచి మట్టిని టిప్పర్లలో తరలిస్తుంటే డ్రైనేజీ అధికారులు పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. మట్టి తరలిస్తున్నట్లు కిందస్థాయి సిబ్బంది నుంచి తమకు ఎటువంటి సమాచారం లేదని అధికారులు పేర్కొనడం గమనార్హం.

వైసీపీ వాళ్లకు వత్తాసు

వైసీపీ సానుభూతి కాంట్రాక్టర్‌కు డ్రైనేజీ అధికారులు వత్తాసు పలుకుతున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. మట్టి దోపిడీ జరుగుతున్నా ఎటువంటి చర్యలు తీసుకోకుండా డ్రైనేజీ అధికారులు నిర్లక్ష్యంగా ఉండటంపై నందివాడ మండల టీడీపీ నాయకులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తుంటే ఏం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

చేదుర్తిపాడు వద్ద కట్టల పటిష్టత ఎక్కడ?

గత వైసీపీ హయాంలో బుడమేరులో చేదుర్తిపాడు వద్ద నుంచి మట్టిని తరలించుకు పోయారు. కట్టలను పటిష్ట పరచకపోవడం, ఎత్తును సరైన పరిమాణంలో పెంచకపోవడంతో గత ఏడాది వచ్చిన బుడమేరు వరదల్లో గ్రామం 20 రోజుల పాటు నీటిలో మునకేసింది. తాజాగా చేపట్టే పనుల్లో అయినా కట్టలను పటిష్ట పరిచి, ఎత్తు పెంచాలని చేదుర్తిపాడు గ్రామస్తులు కోరుతున్నారు.

అనుమతులకు అర్జీ పెట్టుకున్నారు

ఎక్స్‌టెన్షన్ ఆఫ్ టైం(ఇ.వో.టి) కోసం కాంట్రాక్టర్ అర్జీ పెట్టుకున్నారు. డ్రైనేజీ చీఫ్ ఇంజనీర్ వద్ద పెండింగ్‌లో ఉంది. ప్రస్తుతం ఎటువంటి గడువును పెంచలేదు. మట్టి బయట ప్రాంతాలకు తరలిస్తున్నట్లు తెలియడంతో పనులను నిలుపుదల చేశాం.

- గణపతి, డీఈ, డ్రైనేజీ శాఖ

లైన్ క్లియర్!

(5వ పేజీ తరువాయి)

అందుబాటులోకి తీసుకురావచ్చు.

తొలగించే ల్యాంకో లైన్ అలైన్‌మెంట్ మార్చాల్సిన అవసరం ఎందుకు?

ల్యాంకో పవర్ ప్రాజెక్టు మూత పడిన తర్వాత దాని ట్రాన్స్‌మిషన్ లైన్‌ను కొనుగోలు చేసిన మయన్మార్ కంపెనీ ఆ లైన్‌ను పూర్తిగా తొలగించి స్క్రాప్ నంతటినీ తమ దేశం తీసుకువెళతామని స్పష్టంగా చెబుతుంటే .. ఇక ల్యాంకో అలైన్‌మెంట్ మార్చాల్సిన అవసరం ఎంతమాత్రం లేదన్నది అర్థమవుతోంది. కానీ, ఎన్‌హెచ్ అధికారులు కొండపల్లి పవర్ ప్లాంట్‌లో మరో యూనిట్‌ను కొన్న రాధా సంస్థతో ట్రాన్స్‌మిషన్ లైన్ అలైన్‌మెంట్ మార్పుతో రైతులను ఇబ్బందులు పెట్టడం ఎందుకో అర్థం కాకుండా ఉంది. ఇదే సందర్భంలో తొలగించే లైన్‌కు విద్యుత్ సరఫరా అంతరాయం కోసం 25 రోజుల సమయం కోరటం ఏమిటో కూడా అంతు చిక్కకుండా ఉంది.

- యజమాని కాకపోయినా.. అక్టోబరు వరకు సమయం కోరటం ఏమిటి?

ఈ మొత్తం వ్యవహారంలో ట్రాన్స్‌మిషన్ లైన్‌కు తనకు ఎలాంటి సంబంధం లేకపోయినా రాధా సంస్థ అక్టోబరు వరకు విద్యుత్ అంతరాయానికి అవకాశం లేదని ఎన్‌హెచ్ అధికారులకు లేఖ రాయటం మరీ విడ్డూరంగా ఉంది. ల్యాంకో లిక్విడేటర్ కోర్టుకు సమర్పించిన వివరాల ప్రకారం పవర్ ప్లాంట్‌లో ఒక యూనిట్‌ను మాత్రం రాధా సంస్థకు స్క్రాప్‌కు విక్రయించామని పేర్కొనటం జరిగింది. ట్రాన్స్‌మిషన్ లైన్‌ను మయన్మార్ కంపెనీకి విక్రయించామని కూడా చెప్పింది. మరి ఇలాంటపుడు ట్రాన్స్‌మిషన్ హైటెన్షన్ విద్యుత్ లైన్‌తో రాధాకు ఎలాంటి సంబంధం లేదన్నది అర్థమవుతోంది. ఎన్‌హెచ్ అధికారులు రాసిన లేఖకు జవాబుగా తమకు ఈవిద్యుత్ లైన్‌తో సంబంధం లేదని చెప్పాల్సిన రాధా సంస్థ ఏ విధంగా అక్టోబరు సమయం కోరిందన్నది అంతుచిక్కని మిస్టరీగా ఉంది.

ఎన్‌హెచ్ అధికారులు ఎందుకు సమస్యను వివాదాస్పదం చేస్తున్నారు ?

కొండపల్లి ల్యాంకో పవర్ ప్లాంట్ మూతపడక ముందు ఆ సంస్థతో మాత్రమే ఎన్‌హెచ్ అధికారులు ఒప్పందం చేసుకున్నారు. వెస్ట్ బైపాస్ రోడ్డు పనుల ప్రారంభ దశలో కొండపల్లి పవర్ ప్లాంట్ మూత పడింది. మరోవైపు వెస్ట్ బైపాస్ రోడ్డు పనులు పురోగతికి చేరుకున్నాయి. ఇలాంటి దశలో ల్యాంకో సంస్థ మూతపడింది కాబట్టి ఎన్‌హెచ్ అధికారులు .. ఏం చేయాలన్నది ఆలోచించాలి. ల్యాంకో పవర్ ప్లాంట్ మూతపడటంతో.. అప్పుల వాళ్లకు డబ్బులు చెల్లించటానికి దీనిని విక్రయించి తీర్చమని ఎన్‌సీఎల్‌టీ ఒక లిక్విడేటర్‌ను నియమించింది. ఇలాంటపుడు లిక్విడేటర్ చెప్పినట్టుగా నడుచుకోవాల్సిన ఎన్‌హెచ్ అధికారులు.. ఒక యూనిట్‌ను స్క్రాప్ కింద కొనుగోలు చేసిన రాధా సంస్థను ట్రాన్స్‌మిషన్ లైన్‌కు యజమానిగా గుర్తించటం అనేక అనుమానాలకు తావిస్తోంది. కేంద్ర ప్రభుత్వంపై వందల కోట్ల రూపాయల భారం మోపేలా అలైన్‌మెంట్ పేరుతో ఈ డ్రామా ఆడటం ఎందుకో అంతుచిక్కకుండా ఉంది.

భూ కబ్జాలు..

(5వ పేజీ తరువాయి)

తెలిసింది. పార్టీ పెద్దలు కూడా అతనితో గొడవ పెట్టుకొనేందుకు వెనుకాడినట్లు సమాచారం.

పోలీసులకు బాధితుల ఫిర్యాదు

ఈ క్రమంలో రమేష్ అకృత్యాలు తట్టుకోలేక బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆయనపై ఆరు కేసులు నమోదయ్యాయి. దౌర్జన్యాలు, బెదిరింపులపై నాలుగు కేసులు, రెండు బైండవర్ కేసులు నమోదయ్యాయి. ఈ క్రమంలో 2019 ఎన్నికల సమయంలో టీడీపీని వీడిన రమేష్ వైసీపీలో చేరాడు. వైసీపీ విజయం కోసం గట్టిగా పని చేసిన రమేష్‌కు వైసీపీలోనూ అగ్రస్థానం లభించింది. ఆయన సతీమణి ప్రశాంతిని జడ్పీటీసీగా నిలబెట్టి గెలిపించారు. 2014 నుంచి 2019 వరకూ సాగించిన హవాకు కొనసాగింపుగా బెదిరింపులు, సెటిల్‌మెంట్‌లకు తెగబడినట్లు సమాచారం. వైసీపీ ఐదేళ్ల పాలనలో సైతం తన అకృత్యాలతో కోట్లాది రూపాయలు సంపాదించినట్లు ఆరోపణలు ఉన్నాయి. వీటికి తోడు కోడిపందేలు, పేకాట, గ్యాంబ్లింగ్ వంటి చట్టవ్యతిరేక కార్యక్రమాలు నిర్వహిస్తూ తన అవినీతి సామ్రాజ్యాన్ని విస్తరించినట్లు సమాచారం. నాటి ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల అండదండలు ఉండటంతో బెదిరింపులకు గురైన బాధితులు కేసులు కూడా పెట్టలేని స్థితికి చేరుకున్నారు. ఒకరిద్దరు ధైర్యం చేసినా పోలీసులు కేసులు నమోదు చేయలేదు.

స్థలం కొనిస్తానని రూ.22 లక్షలు స్వాహా

2024 ఎన్నికలకు ముందు తన గ్రామానికి చెందిన అంగిరేకుల రాంబాబు అనే వ్యక్తికి స్థలం కొనిపెడతానని చెప్పి రూ.22 లక్షల నగదు తీసుకున్న వేల్పుల స్థలం కొని పెట్టకపోగా, ఆ సొమ్ము తిరిగి ఇవ్వలేదని సమాచారం. బాధితుడు పలు మార్లు తన డబ్బులు ఇవ్వాలని కోరగా, వేల్పుల తన అనుచరులతో బెదిరింపులకు దిగినట్లు తెలిసింది. ఇటీవల ఆయన నేరుగా బాధితుడి ఇంటికే వెళ్లి బెదిరించినట్లు సమాచారం.

కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత కూడా..

2024 ఎన్నికల సమయంలోనూ అనేక అక్రమాలకు పాల్పడినట్టు తెలిసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో వైసీపీ గూండాలు, కబ్జాకోరులు సైలెంట్ అయ్యారు. కొందరైతే ఊళ్లు సైతం వదలి వెళ్లిపోయారు. వేల్పుల మాత్రం అదే ఊపును కొనసాగిస్తున్నారు. టీడీపీ ముఖ్యనేతలతో ఉన్న పాత పరిచయాల వల్లనో తన అకృత్యాలకు విరామం కూడా ఇవ్వడంలేదని తెలిసింది.

అధికార పార్టీ నాయకులపై దాడికి యత్నం

ఇటీవల మునేటి వరదల కారణంగా నిరాశ్రయులైన వారిని కంచికచర్ల క్లబ్‌లో ఉంచారు. వారికి ప్రభుత్వం ద్వారా ఆహారం అందించారు. బాధితులను కలిసేందుకు వచ్చిన మాజీ ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా టీడీపీ కార్యకర్తలు నినాదాలు చేశారు. అందుకు ప్రతిగా అధికారపార్టీ నాయకులపై దాడులు చేసేందుకు వేల్పుల కర్రలు, రాళ్లతో క్లబ్ వద్దకు చేరుకోవడంతో పోలీసులు అప్రమత్తమై వారిని వెనక్కు పంపారు. అధికారం ఉన్న కూటమి నాయకులు అతనికి ఎదురు వెళ్లలేకపోయారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత ఇసుక పంపిణీ సమయంలో కూడా వేల్పుల దౌర్జన్యంగా ట్రాక్టర్లకు ఇసుకను లోడ్ చేయించుకొన్నట్లుసమాచారం. ప్రతి లారీకి తమకు సొమ్ము చెల్లించాలని డిమాండ్ చేసి మరీ నగదు దండుకున్నట్లు తెలిసింది. మొత్తం మీద వేల్పుల అకృత్యాలు ఇంకెంత కాలం ప్రజలు భరించాల్సి ఉందో వేచి చూడాలి.



బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	110,119, 130
చికెన్ విత్ స్కిన్	210
చికెన్ స్కిన్‌లెస్	220

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 435

నేడు ప్రజా వేదిక వినతుల స్వీకరణ

కలెక్టరేట్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : కలెక్టరేట్‌లోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా వినతులు స్వీకరించనున్నట్టు ఎన్టీఆర్ కలెక్టర్ లక్ష్మీశ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్, డివిజన్, మున్సిపల్, మండల కేంద్రాల్లో సంబంధిత అధికారులు ప్రజలకు అందుబాటులో వుండి అర్జీలు స్వీకరిస్తారన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ప్రకటనలో కోరారు.

నిరుపయోగంగా బస్‌షెల్టర్లు

● సెంటర్లకు దూరంగా ఉండటంతో ఖాళీగా షెల్టర్లు ● రద్దీ ప్రదేశాల్లో షెల్టర్లు లేక ప్రయాణికుల ఇక్కట్లు

భారతీనగర్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): ఏలూరు జాతీయ రహదారిపై ప్రధాన సెంటర్లో బస్‌షెల్టర్ లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రమేష్ ఆసుపత్రి జంక్షన్ నుంచి రామవరప్పాడు సెంటర్ వరకు జాతీయరహదారిపై ఏర్పాటు చేసిన బస్‌షెల్టర్లు ప్రధాన సెంటర్లకు దూరంగా ఉండడంతో నిరూపయోగంగా మారాయి. పైగా ఇక్కడ బస్సులు ఆపకపోవడంతో యాచకులకు అడ్డాగా మారాయి. రాత్రి సమయంలో కొందరు మందుబాబులు అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మార్చుకున్నారు. ముఖ్యంగా రమేష్ ఆసుపత్రి సెంటర్, మహానాడు రోడ్డు జంక్షన్ సమీపంలోని ప్రభుత్వాసుపత్రి, కరెన్సీనగర్ కాలనీ వంటి ప్రాంతాలకు ఈ బస్ షెల్టర్లు దూరంగా ఉండడంతో ప్రయాణికులు ఆయా సెంటర్లలో రోడ్డు పక్కన నిలబడాల్సి వస్తుంది. రమేష్ ఆసుపత్రి సెంటర్, ప్రభుత్వాసుపత్రి సెంటర్, కరెన్సీనగర్ సెంటర్ల వద్ద ప్రయాణికులు జాతీయరహదారిపై చెట్ల కింద నిలబడుతున్నారు. మహానాడు రోడ్డు సెంటర్‌లో భారీ వాహనాలు, ప్రభుత్వాసుపత్రి సమీపంలో రోడ్డు వెంబడి బస్సుల కోసం ఎదురుచూస్తుండగా ప్రయాణికులపైకి వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలు ప్రమాదాలు జరిగిన సంఘటనలు ఉన్నాయని వాపోతున్నారు. వచ్చే వేసవిని దృష్టిలో పెట్టుకుని ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి రమేష్ ఆసుపత్రి సెంటర్, ప్రభుత్వాసుపత్రి, రామవరప్పాడు రింగ్ సెంటర్లలో ఉన్న గ్రీనరీల్లో తాత్కాలిక బస్ షెల్టర్లు ఏర్పాటు చేస్తే కొంత ఉపశమనంగా ఉంటుందని ప్రయాణికులు కోరుతున్నారు.



రామవరప్పాడు రింగ్ సమీపంలో చెట్ల కింద నిలబడిన నాగార్జునగర్ కాలనీ సమీపంలో బస్‌షెల్టర్‌లో నిద్రపోతున్న యాచకులు, ఎన్టీఆర్ కాలనీ ది వెన్యూ హాల్ సమీపంలో నిరూపయోగంగా మారిన బస్‌షెల్టర్



రమేష్ ఆసుపత్రి సెంటర్‌లో ఫ్లై ఓవర్ కింద నిలబడిన ప్రయాణికులు

ఉద్యోగ కల్పన స్పెసిఫిక్ డ్రైవ్ 26న

బెంజిసర్కిల్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): ఏపీఎస్ఎస్‌డీసీ, జిల్లా ఉపాధి కల్పన శాఖ, డీఆర్‌డీఏ, సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 26న నగరంలోని గురునానక్ కాలనీలోని ఇన్నోసోర్స్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ కార్యాలయంలో నిరుద్యోగ యువతకు ఉద్యోగ కల్పన స్పెసిఫిక్ డ్రైవ్ జరగనుంది. టెన్త్ నుంచి పీజీ వరకు, ఐటీఐ, డిప్లొమో పూర్తిచేసిన నిరుద్యోగ యువత ఉద్యోగాలకు అర్హులని జిల్లా ఉపాధి కల్పన అధికారి వై.సత్యబ్రహ్మం, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎస్.శ్రీనివాసరావు ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. 18 నుంచి 35 ఏళ్ల వయసులోపు అర్హులైన అభ్యర్థులు ఆ రోజు ఉదయం 9.30 గంటలకు బయోడేటా, ఆధార్‌తోపాటు సర్టిఫికెట్ల జిరాక్స్‌తో హాజరుకావాలని కోరారు. మరిన్ని వివరాలకు 6281256508, 8328024931 నెంబర్లను సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

ఎంఎస్ఎంఈ ఉద్యమ్ రిజిస్ట్రేషన్‌పై నేడు అవగాహన సదస్సు

కలెక్టరేట్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): పరిశ్రమల ఉద్యమ్ రిజిస్ట్రేషన్ వర్క్‌షాపునకు హాజరుకావాలని జిల్లా పరిశ్రమల కేంద్రం జీఎం బి.సాంబయ్య ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. ఈ వర్క్‌షాపును ఆటోనగర్‌లోని ఎంఎస్ఎంఈ అసోసియేషన్ హాల్, ఫైర్‌స్టేషన్ పక్కన సోమవారం ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్టు ఆయన తెలిపారు. ఈవర్క్‌షాపులో ఉద్యమ్ రిజిస్ట్రేషన్‌ను ఎలా నమోదు చేయాలి, వాటి ప్రయోజనాలు ఏమిటి, రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల నుంచి ఏ ప్రయోజనాలు లభిస్తాయి, కొత్త యూనిట్‌ను ఎలా స్థాపించాలనే విషయాలపై పూర్తి అవగాహన కలిగించడం జరుగుతుందన్నారు.

ఏఎన్‌యూలో కోపూరి రజనీకి డాక్టరేట్

బెంజిసర్కిల్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున వర్సిటీ ఆర్థికశాస్త్ర విభాగంలో కే మధుబాబు పర్యవేక్షణలో కోపూరి రజనికి డాక్టరేట్ లభించింది. గర్ల్‌చైల్డ్ డొమెస్టిక్ వర్కర్స్ ఇన్ గుంటూరు డిస్ట్రిక్ట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ - యాన్ ఎకనమిక్స్ పర్‌స్పెక్టివ్ అనే అంశంపై ఈమె పరిశోధన గ్రంథాన్ని సమర్పించారు. ఇందుకు గాను ఆమెకు పీహెచ్‌డీ డాక్టరేట్ లభించింది. ఈసందర్భంగా వర్సిటీలోని ఆర్థికశాస్త్ర విభాగం అధ్యాపకులు, రీసెర్చి స్కాలర్స్ రజనిని అభినందించారు.

స్కూటీని ఢీకొన్న ఆటో

● మహిళకు గాయాలు

విద్యాధరపురం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): భవానీపురం హెచ్‌బీ కాలనీ ఐఎంజీ2 బ్లాక్‌లో చెవికంటి ఆనంద్ భార్య మమతారాణి, ఇద్దరు కుమార్తెలతో ఉంటున్నాడు. ఈ నెల 15న మమతా రాణి అటికెన్‌సన్ స్కూల్‌లో చదువుతున్న చిన్న కుమార్తెను స్కూటీపై ఎక్కించుకుని ఇంటికి వస్తుండగా పున్నమీ ఘాట్ సమీపంలో ఓ ఆటో డ్రైవర్ అతివేగంగా స్కూటీని ఢీకొన్నాడు. ఈ సంఘటనలో మమతారాణికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు బాధితురాలిని ఆసుపత్రికి తరలించారు. భర్త ఆనంద్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కారు ఢీకొని ఆటో బోల్తా ఇద్దరికి గాయాలు

వన్‌టౌన్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): పోలీస్ కంట్రోల్ రూమ్ నుంచి బెంజిసర్కిల్ వైపు ఓ ఆటోలో ముగ్గురు ప్రయాణికులు బయలుదేరారు. రాఘవయ్య పార్క్ సమీపంలోకి వచ్చేసరికి ఓ కారు అతివేగంగా వచ్చి ముందు వెళుతున్న ఆటోను ఢీకొనడంతో బోల్తా పడింది. ఆటోలో ప్రయాణిస్తున్న ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. ట్రాఫిక్ పోలీసులు ఘటనా ప్రాంతానికి వెళ్లి వివరాలు తెలుసుకుని గాయాలకు గురైన వారిని ఆసుపత్రికి తరలించారు. ఆటోను, మిగిలిన వారిని సూర్యారావుపేట పోలీసు స్టేషన్‌కు తరలించారు.

ఆశావర్కర్లకు ఎన్‌హెచ్‌ఎం నిధులు పెంచాలి

● ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధనలక్ష్మి

రాణిగారితోట, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): కోవిడ్ సమయంలో ఫ్రంట్ లైన్ వారియర్స్‌గా పనిచేసి ప్రపంచ ఆరోగ్య సంస్థ చేత ప్రశంసలందుకున్న ఆశ వర్కర్లకు నేటికీ కేంద్ర ప్రభుత్వం వేతనాలు పెంచకపోగా ఎన్‌హెచ్‌ఎం నిధులు కూడా కేటాయించకపోవడం సరైంది కాదని ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధనలక్ష్మి అన్నారు. ఎన్టీఆర్ జిల్లా ఆశా వర్కర్ల విస్తృతస్థాయి సమావేశం రాణిగారితోటలోని సీఐటీయూ జిల్లా కార్యాలయంలో ఆదివారం జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో పేద ప్రజలకు సేవలందిస్తున్న ఆశా వర్కర్లను కేంద్ర ప్రభుత్వం కార్మికులుగా గుర్తించాలని, వెంటనే ఎన్‌హెచ్‌ఎంకు నిధులు పెంచాలని డిమాండ్ చేశారు. అనంతరం క్యూబాకు సంఘీభావం తెలుపుదాం.. అమెరికా సామ్రాజ్యవాదాన్ని వ్యతిరేకిద్దాం అని కరపత్రం విడుదలతో పాటు సీఐటీయూ చేపట్టిన సంఘీభావ నిధి సేకరణకు విరాళాలందించి తోడ్పాటు ఇవ్వాలని పిలుపునిచ్చారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ కమల, శ్రీనివాస్. పి.లక్ష్మి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ధనలక్ష్మి



శ్రీవారి కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్న పండితులు

ఘనంగా వేంకటేశ్వరస్వామికి ఉదయాస్తమయ సేవలు

లబ్బీపేట, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి వారి ఉదయాస్తమాన సేవలను దర్శించుకుని భక్తులు తరించారు. రోటరీ క్లబ్ ఆఫ్ విజయవాడ మిడ్‌టౌన్ నగరశాఖ ఆధ్వర్యంలో ఏ కన్వెన్షన్‌లో రెండు రోజుల పాటు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆదివారం ఉదయం సుప్రభాత సేవతో ప్రారంభించిన సేవలు సాక్షాత్తు తిరుమలలో జరిగేలా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏ కన్వెన్షన్ ప్రాంగణాన్ని తిరుమల శ్రీవారి ఆలయాన్ని తలపించేలా తీర్చిదిద్దారు, సుప్రభాతసేవ, తోమాల సేవ, సహస్రనామార్చన, తిరుప్పావడసేవ, శ్రీవారి కల్యాణోత్సవం, పుష్పయాగం వంటి సేవలు నిర్వహించారు. అనంతరం వివిధ రకాల పుష్పాలతో శోభాయాత్ర నిర్వహించారు. ఏకాంత సేవతో ఉదయాస్తమాన సేవలు వైభవంగా ముగిశాయి. అనంతరం క్లబ్ అధ్యక్షుడు గుడిపాటి కిషోర్ మాట్లాడుతూ తిరుమలలో నిర్వహించేలా శ్రీవారి సేవలను నిర్వహించడం జరిగిందని, భక్తులు ఈ సేవలను దర్శించుకుని తరించారన్నారు. వేలాది మంది భక్తులు పాల్గొని స్వామికి జరిగిన సేవలు చూసి తరించారని, అనంతరం భక్తులకు ప్రసాదాలు అందజేశామన్నారు. క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.



తోపుడు బండి, ఇస్త్రీ బండిని పేదలకు అందిస్తున్న గద్దె రామ్మోహన్

ప్రజల ఆనందమే చంద్రబాబు లక్ష్యం

● ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

పటమట, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రతి కుటుంబం ఆనందంగా ఉండాలనేదే సీఎం చంద్రబాబు లక్ష్యమని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. ఆదివారం అశోక్‌నగర్‌లోని తన కార్యాలయంలో మూడో డివిజన్‌కు చెందిన మూడు నిరుపేద కుటుంబాల వారి జీవనోపాధి నిమిత్తం రూ.30వేలు విలువైన తోపుడు బండిని దాసరి కృష్ణ, సువ్వల సత్యనారాయణకు ఇస్త్రీ పెట్టెలను, గంగాభవానికి కుట్టు మిషన్‌ను అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రతి ఇంటి నుంచి ఒక పారిశ్రామికవేత్తను తయారు కావాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు పోతుందన్నారు. చెన్నుపాటి గాంధీ, ముమ్మనేని ప్రసాద్, గద్దె రమేష్, గొరిపర్తి నామేశ్వరరావు, చలసాని రమణ, కోడూరు ఆంజనేయవాసు, పెనుగొండ శ్రీనివాస్ పాల్గొన్నారు.

దాతృత్వం, ధార్మిక చింతన కలయికే రంజాన్: గద్దె

క్రమశిక్షణ, దాతృత్వం, ధార్మిక చింతన కలయికే రంజాన్ అని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. 12వ డివిజన్‌లోని ఫారూఖ్‌నగర్‌లో జామెమస్జిద్ అహ్లెహదీస్ ఫారూఖియాలో ఆదివారం జరిగిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనుషుల మధ్య ఉన్న వర్గ వైషమ్యాలను తొలగించి అందరిలో ఆధ్యాత్మిక చింతనలు కలిగిస్తూ మంచి మంచి జీవితాన్ని ఆనందంతో నింపి పుణ్య కార్యాల వైపునకు దృష్టిని మరల్చేదే రంజాన్ అని అన్నారు. నజీర్ అహ్మద్, ఎండీ ఖాలిక్, అబ్దుల్ కరీం, హతవుల్లా, అబ్దుల్ వాహిద్, తాజుద్దీన్ ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

కరాటేతో శారీరక, మానసిక ఆరోగ్యం

విజయవాడ స్పోర్ట్స్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): కరాటే నేర్చుకోవడం వల్ల శారీరక, మానసిక ఆరోగ్యంతో పా టు ఆత్మరక్షణకు ఎంతగానో ఉపయోగపడుతుందని ఎన్‌డీఆర్‌ఎఫ్ డిప్యూటీ కమాండర్ దిల్‌బాగ్ సింగ్ అన్నారు. జేకేఏ ఆధ్వర్యంలో ఆదివారం కరాటే క్యూ బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్ కొండపావులూరు ఎన్‌డీఆర్‌ఎఫ్ క్యాంపు నందు జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన ఈ టెస్ట్‌లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు సర్టిఫికేట్లు అందజేశారు. జపాన్ కరాటే అసోసియేషన్ ఏపీ చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ కొడాలి రవిబాబు, కొడాలి సాగరిక, చెన్నారెడ్డి ప్రదీప్ కుమార్ పాల్గొన్నారు.



తోపుడు బండి, ఇస్త్రీ బండిని పేదలకు అందిస్తున్న గద్దె రామ్మోహన్

అత్యాధునిక వైద్యసేవలను అందరికీ అందుబాటులోకి తేవాలి

● మంత్రి సత్యకుమార్ యాదవ్

లబ్బీపేట, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): అత్యాధునిక వైద్యసేవలను ప్రజలందరికీ అందుబాటులోకి తేవాలని ఆరోగ్య శాఖమంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. ప్రోస్టేట్ సమస్యలకు అందుబాటులోకి వచ్చిన రెజ్యూమ్ చికిత్స విధానాన్ని ప్రశాంత్ హాస్పిటల్‌లో ఎమ్మెల్యేలు యార్లగడ్డ వెంకట్రావు, గద్దె రామ్మోహన్, సుజనా చౌదరి, కామినేని శ్రీనివాస్, బోడే ప్రసాద్‌తో కలిసి మంత్రి సత్యకుమార్ ఆదివారం ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రప్రథమంగా అందుబాటులోకి వచ్చిన ఈ ఆధునిక చికిత్సతో ప్రజలకు మరింత మెరుగైన సేవలందించడం సాధ్యమవుతుందన్నారు. ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ లక్ష్య సాధనకు కార్పొరేట్ ఆసుపత్రుల వారు సహకరించాలన్నారు. అనంతరం ప్రశాంత్ హాస్పిటల్ ఛైర్మన్ డాక్టర్ కె.ప్రశాంత్ మాట్లాడుతూ ప్రోస్టేట్ సంబంధిత అన్ని వ్యాధులకు దేశంలోనే మొట్టమొదటి సమగ్ర చికిత్సా విభాగంగా ప్రశాంత్ హాస్పిటల్ కొత్త చరిత్రకు శ్రీకారం చుట్టిందన్నారు. హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కె.ధీరజ్, హాస్పిటల్ మెడికల్ డైరెక్టర్ కె.ప్రీతమ్, డాక్టర్ పి.హరిత, డాక్టర్ శ్వేత పాల్గొన్నారు.



రెజ్యూమ్ చికిత్స విధానాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి



భగత్‌సింగ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న న్యాయవాదులు

భగత్‌సింగ్ ఆశయాలను యువత ఆదర్శంగా తీసుకోవాలి

● బెజవాడ బార్ న్యాయవాదులు

విజయవాడ లీగల్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): భారత స్వాతంత్ర్య సంగ్రామంలో తన ప్రాణాలను తృణప్రాయంగా అర్పించిన భరతమాత ముద్దుబిడ్డ భగత్‌సింగ్ 94 వర్ధంతిని బెజవాడ బార్ న్యాయవాదులు ఆదివారం బెజవాడ బార్ అసోసియేషన్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. ముందుగా భగత్‌సింగ్ చిత్రపటానికి బార్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె. చంద్రమౌళి, అరిగెల శివరాంప్రసాద్ (రాజా) పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ భగత్‌సింగ్ ఆశయాలను నేటి యువత సాధించాల్సిన అవసరం ఉందన్నారు. న్యాయవాదులు సప్పా రమేష్, వెంకట్రావు, లంక రామ్మోహనరావు, నామాల ఎన్ కోట బాబు, వై పుల్లారెడ్డి పాల్గొన్నారు.

సబ్కా అధ్యక్షుడిగా మండవ సాయి

లబ్బీపేట, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): స్టేట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ బిల్డింగ్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ ఉమ్మడి కృష్ణాజిల్లా శాఖ 2025-26వ సంవత్సరానికి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. లబ్బీపేటలోని అసోసియేషన్ కార్యాలయంలో ఆదివారం జరిగిన ఈ కార్యక్రమంలో సబ్కా అధ్యక్షుడిగా మండవ సాయి, గౌరవాధ్యక్షుడిగా కలిదిండి కృష్ణంరాజు, కార్యదర్శిగా లింగం రవికిరణ్, ఉపాధ్యక్షులుగా కోటిరెడ్డి, మురళీధర్, ట్రెజరర్‌గా వెంకటేశ్వర రాజు, జాయింట్ సెక్రటరీలుగా ర వి కుమార్, సురేష్ కుమార్, భూపతి రెడ్డి, కార్యవర్గ సభ్యులుగా పూర్ణ, శ్రీధర్, వీరబ్రహ్మం, శ్రీనివాసరెడ్డి, శేషగిరిరావు, శ్రీనివాసరావు, హరికృష్ణ, అడ్వైజర్స్‌గా సకలారెడ్డి, రత్నారావు, అమర్‌బాబు, సుధీర్‌ను ఎన్నుకున్నారు.



సబ్కా నూతన కార్యవర్గంలో ఎన్నికైన సభ్యులు

దిక్సూచి DIKSUCHI



ఉమ్మడి ప్రిపరేషన్ బెస్ట్

ఇంటర్ పరీక్షలు పూర్తయ్యాయి. పోటీ పరీక్షలు మళ్లీ మొదలయ్యాయి. ఎంపీసీ విద్యార్థులు ఏప్రిల్ మొదటి వారంలో జేఈఈ మెయిన్ రెండో సెషన్‌కి హాజరు కావాల్సి ఉంది. తరవాత మేలో ఎంసెట్ పరీక్ష రాయాలి. జేఈఈకి దాదాపుగా 13.5 లక్షల మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా జనవరి సెషన్‌కి దాదాపుగా 11 లక్షల మంది హాజరయ్యారు. వీటి ఫలితాలు కూడా వెల్లడయ్యాయి. అదే సమయంలో రెండో సెషన్ రిజిస్ట్రేషన్ కూడా పూర్తయింది.

ఇంటర్ పరీక్షల తరవాత జేఈఈ రాసే విద్యార్థులకు సరిగ్గా రెండువారాల సమయం కూడా లేదు. అలాగే ఎంసెట్ పరీక్ష తెలంగాణలో మే 2 నుంచి 5 తేదీ వరకు జరగనుంది. ఆంధ్రప్రదేశ్‌లో అయితే మే 21 నుంచి 27 వరకు నిర్వహిస్తున్నారు. జేఈఈ, ఎంసెట్ రెండు ఎంట్రెన్స్‌లను దృష్టిలో పెట్టుకుని ఎలా సన్నద్ధం కావాలో చూద్దాం. సమయం తక్కువగా ఉంది కాబట్టి జేఈఈ విద్యార్థులు వెయిటేజీకి అనుగుణంగా చాప్టర్ల వారీగా రివిజన్‌ను ప్లాన్ చేయాలి.

- ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాల నుంచి ముఖ్యమైన డెఫినేషన్స్, ఫార్ములాలు అండర్‌లైన్ చేసుకోవాలి. పైన పేర్కొన్న చాప్టర్ల ఆధారంగా ఈ కాన్సెప్ట్‌లను రోజూ పునశ్చరణ చేయాలి.
- రోజుకు రెండు చాప్టర్ల చొప్పున మాక్‌టెస్టులు రాయాలి. ఇవి గత జేఈఈ టెస్టుల నుంచి అయితే ఇంకా మంచిది. ప్రతీ పరీక్షలో మెరుగుదల ఉండాలంటే నెగెటివ్ మార్కులు తగ్గుతూ ఉండాలి. గెస్ వర్క్‌ను పూర్తిగా మానేయాలి.
- పరీక్షలో ప్రతీ సబ్జెక్టుకు గంట మాత్రమే సమయం కేటాయించాలి. మేథ్స్‌లో ప్రశ్నలు చాలా లెంథీగా ఉంటున్నాయి. అక్కడే సమయ పాలన చాలా అవసరం.

» మేథ్స్ :	
కాలిక్యులస్	35 శాతం,
ఆల్జీబ్రా	25 శాతం,
కోఆర్డినేట్ జామెట్రీ	20 శాతం,
వెక్టార్స్ 3డి	15 శాతం
ప్రాబబిలిటీ	5శాతం
» ఫిజిక్స్ :	
మెకానిక్స్	30 శాతం
ఎలక్ట్రోడైనమిక్స్	25 శాతం
ఆప్టిక్స్ అండ్ మోడ్రన్ ఫిజిక్స్	20 శాతం
థర్మోడైనమిక్స్	15 శాతం
వేవ్స్ అండ్ ఆస్లేషన్స్	10 శాతం
» కెమిస్ట్రీ :	
ఫిజికల్ కెమిస్ట్రీ	35 శాతం
ఇన్‌ఆర్గానిక్ కెమిస్ట్రీ	30 శాతం
ఆర్గానిక్ కెమిస్ట్రీ(బయోమాలిక్యుల్స్)	35 శాతం

- టైమ్ మేనేజ్‌మెంట్ కోసం ప్రతీ ప్రశ్నకు నిర్దుష్టంగా రెండు నుంచి మూడు నిమిషాలు మాత్రమే కేటాయించుకోవాలి. కాలిక్యులేషన్స్‌లో ఎక్కువ సమయం వృథా చేయకూడదు.
- మీకు కాన్ఫిడెన్స్ ఉన్న చాప్టర్లపై ఎక్కువ శ్రద్ధ పెట్టండి. ప్రస్తుతం ఉన్న సమయం దృష్ట్యా మీరు వీక్‌గా ఉన్న చాప్టర్లను వాటి వెయిటేజీ ఆధారంగా వదిలిపెట్టడమే మంచిది.

చాప్టర్ల వారీగా ఎంసెట్ ప్రణాళిక

తెలంగాణలో ఎంసెట్‌కు ఇప్పుడు సరిగ్గా 40 రోజుల సమయం ఉంది. ఆంధ్రప్రదేశ్‌లో దాదాపుగా రెండు నెలల సమయం ఉంది. కేవలం ఎంసెట్ మాత్రమే రాయాలనుకునే విద్యార్థులు అందుకు అనుగుణంగా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలి. మొదటి రోజు నుంచి వెయిటేజీ ఆధారంగా చదవడం చేయాలి. జేఈఈ తరవాత ఎంసెట్ రాయాలనుకునే విద్యార్థులకు టీఎస్‌లో కేవలం 30 రోజులు, ఏపీలో 50 రోజుల సమయం మాత్రమే ఉంటుంది. వీరు రాపిడ్ షెడ్యూల్ సిద్ధం చేసుకోవాలి.

- జేఈఈ మెయిన్‌తో పోలిస్తే ఎంసెట్‌లో 25 నుంచి 30 శాతం ఎక్కువ సిలబస్ ఉంటుంది. ఈ చాప్టర్లను పూర్తిగా పునఃశ్చరణ చేయాల్సిందే.
- జేఈఈ మెయిన్, ఎంసెట్ పరీక్ష ఏదైనా కాన్సెప్టులను ఎన్‌సీఈఆర్‌టీ చాప్టర్ల నుంచే రివైజ్ చేయాలి.
- వెయిటేజీ ఆధారంగా ముఖ్యమైన చాప్టర్లను చదవండి.
- జేఈఈతో పోలిస్తే ఎంసెట్‌లో ఒక్కో ప్రశ్నకు కేటాయించిన సమయం తక్కువ. ఒక నిమిషంలో ఒక ప్రశ్నను పూరించాల్సి ఉంటుంది. కాబట్టి కాలిక్యులేషన్స్‌తో సమయం వృథా చేయవద్దు.
- ఎంసెట్‌లో నెగెటివ్ మార్కులు లేనందున, ఆప్షన్‌కు అనుగుణంగా గెస్ వర్క్ చేయవచ్చు.
- గత ముప్పై సంవత్సరాల నుంచి వచ్చిన ప్రశ్నపత్రాలను తప్పనిసరిగా రివైజ్ చేయండి. ఎంసెట్‌లో రిపీటెడ్‌గా ప్రశ్నలు వచ్చే అవకాశం ఎక్కువ.
- ప్రతీ రోజు మాక్‌టెస్ట్ రాయండి. జేఈఈతో పోలిస్తే ప్రశ్నలు ఎంసెట్‌లో సులువుగా ఉంటాయి. ఎక్కువ ప్రాక్టీసు చేస్తే నిర్ణీత సమయంలోనే నిర్దుష్ట సమయంలో పేపర్‌ను పూర్తి చేయవచ్చు.
- ఒక వేళ నిమిషంలో ఆ ప్రశ్న పూర్తి కావడం లేదు అనుకుంటే ఈ ప్రశ్నను వదిలేయండి. చివర్లో సమయం మిగిలితే వీటికి ఉపయోగించవచ్చు.
- అన్నింటికన్నా ముఖ్యం ఈ కొద్దికాలం సోషల్ మీడియాతో పాటు చదువు నుంచి దృష్టి మళ్లించే ఇతర విషయాలకు దూరంగా ఉండడం అవసరం.
- చదువుతోపాటు ఆరోగ్యంపై కూడా దృష్టిపెట్టాలి. పోషక ఆహారం, వ్యాయామం, సరైన అవసరం. అప్పుడే మెదడు చురుకుగా పనిచేస్తుంది.



డా.పవన్ కుమార్ కాసు
సంజీవనీ ఐఐటీ అకాడమి

పాలిసెట్ 2025



తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని పాలిటెక్నిక్ కాలేజీల్లో ప్రవేశాలకు ఉద్దేశించి పాలిసెట్ 2025 నోటిఫికేషన్లు వెలువడ్డాయి.

తెలంగాణ సెట్

తెలంగాణలోని పాలిటెక్నిక్ సీట్ల భర్తీకి మే 13న నిర్వహించే ఎంట్రెన్స్‌కు దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం అయింది. ఇంజనీరింగ్, ఇతర వృత్తి విద్యా కోర్సుల తరహాలోనే రాష్ట్రంలోని పాలిటెక్నిక్ సీట్లన్నీ స్థానిక విద్యార్థులకు కేటాయించనున్నారు. మొత్తం సీట్లన్నీ కన్వీనర్ సీట్లు మాత్రమే. 85 శాతం సీట్లు స్థానికులకు, 15 శాతం స్థానికేతరులకు కేటాయించారు. అంటే నాలుగో తరగతి నుంచి పదో తరగతి వరకు ఉన్న ఏడేళ్లలో నాలుగేళ్లు తెలంగాణలో చదివితే స్థానికులుగా పరిగణిస్తారు. స్థానికేతర కోటా అంటే పదేళ్లపాటు తెలంగాణ రాష్ట్రంలో నివసించిన వారి పిల్లలు, తెలంగాణలో పనిచేస్తున్న ప్రభుత్వ, ప్రభుత్వరంగ సంస్థల ఉద్యోగుల పిల్లలకు కేటాయిస్తారు.

ఫీజు : ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు దరఖాస్తు ఫీజు రూ.250/-, ఇతరులకు రూ.500/-
చివరి తేదీ: 2025 ఏప్రిల్ 19
(రూ.100/- ఆలస్య రుసుముతో ఏప్రిల్ 21, రూ.300/- ఆలస్య రుసుముతో ఏప్రిల్ 23 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు.
ప్రవేశ పరీక్ష: 2025 మే 13
ఫలితాలు : 2025 జూన్
వెబ్‌సైట్ : https://polycet.sbtet.telangana.gov.in/

ఏపీ సెట్

ఆంధ్రప్రదేశ్ పాలిటెక్నిక్ కళాశాలల్లో అడ్మిషన్ల కోసం ఏపీ పాలిసెట్ 2025 నోటిఫికేషన్ వెలువడింది. పదో తరగతి అర్హత ఉన్న విద్యార్థినీ, విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. పరీక్ష మాత్రం ఆఫ్‌లైన్ మోడ్‌లో జరుగుతుంది. ఇది పూర్తిగా ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటుంది. ప్రశ్న పత్రం మొత్తం 120 మార్కులకు ఉంటుంది. రెండు గంటల్లో దీనికి సమాధానాలు గుర్తించాలి. లెక్కల్లో 50 ప్రశ్నలు, ఫిజిక్స్‌లో 40 ప్రశ్నలు, కెమిస్ట్రీలో 30 ప్రశ్నలు ఉంటాయి.

ఫీజు: ఓసీ, బీసీ విద్యార్థులకు రూ.400/-
ఎస్సీ,ఎస్టీ విద్యార్థులకు రూ.100/-
చివరి తేదీ: 2025 ఏప్రిల్ 15
ప్రవేశ పరీక్ష : 2025 ఏప్రిల్ 30
ఫలితాలు : 2025 మే 10(ఉజ్జాయింపు తేదీ)
వయస్సు : ఎలాంటి వయోపరిమితి లేదు.
వెబ్‌సైట్ : https://polycetap.nic.in/

SCHOLARSHIP ALERT

Alstom India Scholarship : Phase-III

Description: Alstom India is offering this scholarship with an aim to provide financial support to students across India to help them pursue their higher education and prevent them from dropping out.

Eligibility: Students studying in any year of ITI/Diploma, general graduation, or professional graduation in STEM courses for FY 2024-25 can apply. Applicants must have secured at least 60% marks in their previous academic year/semester. The annual family income of the applicants must be less than or equal to INR 6,00,000 from all sources. The scholarship is open to students studying in locations such as Coimbatore (Tamil Nadu), Madhepura (Bihar), Sri City (Andhra Pradesh), or Vadodara (Gujarat) at specified colleges.

Prizes & Rewards: Up to INR 75,000 (one-time)
Last Date to Apply: 04-05-2025
Application mode: Online applications only
Short Url: www.b4s.in/aj/AISDG8

South Asia Postgraduate Excellence Award



Description: South Asia Postgraduate Excellence Award, 2025 is offered by the University of Nottingham. It aims to assist high-achieving international students from South Asia by covering a portion of their full-time Master's tuition fees at the university.

Eligibility: Open to residents of specific South Asian countries including India. Applicants must be classed as an overseas student for fee purposes. They must hold an offer to pursue full-time Masterâ ™s program for the academic session 2025-26.

Prizes & Rewards: Up to Â£8,000 (approx. â‚¹8,51,016) towards tuition fees.
Last Date to Apply : 14-05-2025
Application mode : Online applications only
Short Url: www.b4s.in/aj/SAPE1

SBIF Asha Scholarship Program

Description: The SBIF Asha Scholarship Program for Overseas Education Students, one of India's largest scholarship programs, is an initiative of the SBI Foundation under its education vertical - Integrated Learning Mission (ILM). This scholarship aims to provide financial assistance to meritorious students from low-income families across India, ensuring the continuity of their education.

Eligibility: Open to Indian students belonging to SC and ST categories pursuing a masterâ ™s or postgraduate course (any year) at a premier university or college outside India. They should have secured at least 75% marks or above in their previous academic year, with a gross annual family income of up to INR 6,00,000.

Prizes & Rewards: Up to INR 20,00,000 or 50% of course-related expenses (whichever is less)
Last Date to Apply: 31-03-2025
Application mode: Online applications only
Short Url: www.b4s.in/aj/SBIFS12

buddy4study.com

చిత్రజ్యోతి
★ SINCE 1965 ★

శ్రీలంకలో పాట చిత్రీకరణ



విజయ్ దేవరకొండ హీరోగా గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో తెరకెక్కుతోన్న పాన్ ఇండియా చిత్రం 'కింగ్‌డమ్'. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మాతలు. ప్రపంచ వ్యాప్తంగా థియేటర్లలో మే 30న విడుదల కానుంది. ఈ సినిమాలోని ఓ పాట చిత్రీకరణ కోసం విజయ్ దేవరకొండ శ్రీలంక వెళ్లారు. ఈ షెడ్యూల్ వారం రోజుల పాటు కొనసాగుతుంది. కాగా, విజయ్ దేవరకొండ ఎయిర్‌పోర్ట్ ఫొటోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి.

జపాన్‌లో దేవర

జూనియర్ ఎన్టీఆర్ హీరోగా కొరటాల శివ దర్శకత్వంలో వచ్చిన పాన్ ఇండియా చిత్రం 'దేవర' ఘన విజయాన్ని అందుకున్న విషయం తెలిసిందే. జపాన్‌లో ఈనెల 28న విడుదల చేస్తున్నారు. ప్రచార కార్యక్రమాల్లో పాల్గొనడంతో పాటు అక్కడి ప్రేక్షకులతో కలసి 'దేవర' చూసేందుకు ఎన్టీఆర్ జపాన్ వెళ్లారు. భార్య ప్రణతితో కలసి



ఎయిర్‌పోర్టులో కనిపించారు. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. కాగా, ఎన్టీఆర్ ప్రస్తుతం ప్రశాంత్ నీల్ చిత్రంలో, బాలీవుడ్ సినిమా 'వార్-2'లో నటిస్తున్నారు. 'వార్-2' ఆగస్టు 14న థియేటర్లలో విడుదలవుతోంది.



ఈ సినిమాలో నటించడం గౌరవంగా భావిస్తున్నా


- ఆస్ట్రేలియా క్రికెటర్ డేవిడ్ వార్నర్

నితిన్, శ్రీలీల జంటగా వెంకీ కుడుముల దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'రాబిన్‌హుడ్'. మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై వై.రవిశంకర్, నవీన్ ఎర్నేని నిర్మించారు. ఈనెల 28న థియేటర్లలో విడుదలవుతోంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ప్రీ రిలీజ్ ఈవెంట్, ట్రైలర్ లాంచ్ ఈవెంట్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రత్యేక అతిథిగా విచ్చేసిన ఆస్ట్రేలియా స్టార్ క్రికెటర్ డేవిడ్ వార్నర్ మాట్లాడుతూ 'ఈ సినిమాలో నటించడం ఒక గౌరవంగా భావిస్తున్నా. నన్ను మీ కుటుంబ సభ్యుడిగా చూస్తున్నందుకు ఆనందంగా ఉంది. సినిమా చాలా అద్భుతంగా వచ్చింది' అని అన్నారు. హీరో నితిన్ మాట్లాడుతూ 'ఈ సినిమాపై చాలా కాన్ఫిడెంట్‌గా ఉన్నాను. శ్రీలీలతో నాకు ఇది రెండో చిత్రం. మా ఇద్దరికీ హిట్ పెయిర్ అనే పేరు వస్తుంది' అని అన్నారు. హీరోయిన్ శ్రీలీల మాట్లాడుతూ 'నేను అనుకోకుండా చేసిన ఈ సినిమా అనుకున్న దానికంటే చాలా అద్భుతంగా వచ్చింది' అని చెప్పారు. చిత్ర దర్శకుడు వెంకీ కుడుముల మాట్లాడుతూ 'డేవిడ్ వార్నర్ క్యారెక్టర్‌లో చాలా సర్‌ప్రైజ్ ఉంటుంది. మార్చి 28న మీ అందరినీ తప్పకుండా ఎంటర్‌టైన్ చేస్తాం' అని అన్నారు. నిర్మాత వై.రవి శంకర్ మాట్లాడుతూ 'ఈ సినిమాలో నవ్వులతోపాటు మంచి కథ కూడా ఉంటుంది. కమర్షియల్ ఎలిమెంట్స్ అన్నీ ఉన్నాయి. సినిమా సూపర్ డూపర్ హిట్ పక్కా' అని చెప్పారు. మరో నిర్మాత నవీన్ ఎర్నేని మాట్లాడుతూ 'ఇది పూర్తిగా కుటుంబ వినోదాత్మక చిత్రం. కుటుంబ సమేతంగా చూసి ఎంజాయ్ చేయవచ్చు' అని అన్నారు. రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ 'మైత్రీ మూవీస్ నా సొంత సంస్థలాంటిది. దర్శకుడు సినిమాను అద్భుతంగా తెరకెక్కించాడు. నితిన్‌కు నెక్స్ట్ లెవెల్ విజయం ఇచ్చే చిత్రమిది. చాలా ప్రేమతో తీసిన ఈ చిత్రాన్ని ఆదరించండి' అని కోరారు. కేతిక శర్మ మాట్లాడుతూ 'అదిదా సర్‌ప్రైజు పాట నిజంగా అదిరిపోతుంది' అని అన్నారు.



ఉత్తర అమెరికా తెలుగు సంఘం (నాట్స్) 8వ తెలుగు సంబరాలు ఈవెంట్‌కు సిద్ధమవుతోంది. జూలై 4వ తేదీ నుంచి 6వ తేదీ వరకు ఈ ఉత్సవాలు అమెరికాలోని టంపాలో జరగనున్నాయి. తాజాగా హైదరాబాద్‌లో నాట్స్ 8వ తెలుగు సంబరాలు కర్టెన్ రైజర్ ఈవెంట్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలుగు సంబరాలు కాన్ఫరెన్స్ కన్వీనర్, మాజీ చైర్మన్ శ్రీనివాస్ గుత్తికొండ, నాట్స్ చైర్మన్ ప్రశాంత్ పిన్నమనేని, నటీమణులు జయసుధ, ఆమని, దర్శకులు హరీశ్ శంకర్, మెహర్ రమేష్, సంగీత దర్శకుడు తమన్, గీత రచయితలు రామజోగయ్య శాస్త్రి, చంద్రబోస్, కళ్యాణ్ చక్రవర్తి తదితరులు ముఖ్య అతిథులుగా విచ్చేశారు.

కీలక పాత్రలో శ్రీకాంత్



సాయి దుర్గా తేజ్, ఐశ్వర్య లక్ష్మీ జంటగా రోహిత్ కేపీ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'సంబరాల యేటిగట్టు'. కె.నిరంజన్ రెడ్డి, చైతన్య రెడ్డి నిర్మిస్తున్నారు. సెప్టెంబరు 25న తెలుగుతోపాటు తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో విడుదల కానుంది. ఈ సినిమాలో శ్రీకాంత్ కీలక పాత్రను పోషిస్తున్నారు. శ్రీకాంత్ పుట్టినరోజు సందర్భంగా మేకర్స్ ఆయన ఫస్ట్‌లుక్ పోస్టర్‌ని విడుదల చేశారు. చిందరవందర జుట్టు, బాగా పెరిగిన గెడ్డంతో నల్లని కోటు ధరించిన శ్రీకాంత్ లుక్ అదిరిపోయింది. ప్రస్తుతం ఈ పోస్టర్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

సాయికుమార్‌కు అవార్డు



నటుడు సాయికుమార్ కుమరం భీం జాతీయ అవార్డును అందుకున్నారు. ఆదివారం ఆసిఫాబాద్‌లో భారత్ కల్చర్ అకాడమీ, ఆదివాసీ సాంస్కృతిక పరిషత్, ఓం సాయితేజ ఆర్ట్స్ ఆయనకు ఈ పురస్కారాన్ని ప్రదానం చేశాయి. జ్ఞాపికతో పాటు 50వేల నగదును అందజేశారు. కార్యక్రమంలో భారత్ కల్చర్ అకాడమీ చైర్మన్, మాజీ ఐఏఎస్ అధికారి పార్థసారధి, మాజీ మంత్రి, నటుడు బాబు మోహన్, ఆదిలాబాద్ ఎంపీ నగేష్, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

ఆసిఫాబాద్ (ఆంధ్రజ్యోతి)

సందేశాత్మక చిత్రం



అజయ్, ఇంద్రజ, సుమన్, జయసుధ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'సీఎమ్ పెళ్లాం'. గడ్డం రమణ దర్శకత్వంలో బొల్లా రామకృష్ణ నిర్మిస్తున్నారు. తాజాగా, ఈ సినిమా నుంచి ప్రమోషనల్ సాంగ్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో బొల్లా రామకృష్ణ మాట్లాడుతూ "రాజకీయ నేపథ్యంతో కూడిన సందేశాత్మక చిత్రమిది" అని అన్నారు. "ప్రతీ ఒక్కరినీ ఆలోచింపజేసే చిత్రమిది" అని దర్శకుడు రమణ గెడ్డం చెప్పారు. "ఈ పాట చూశాక చాలా భావోద్వేగానికి లోనయ్యాను. ఈ సినిమాతో అందరికీ మంచి పేరు వస్తుంది" అని నటుడు అజయ్ అన్నారు.



పాఠకులు నాతో ప్రయాణం చేస్తారు

శాస్త్రీయ అంశాలను అందరికీ అర్థమైయ్యే సులభమైన భాషలో చెప్పటం చాలా కష్టం. ముఖ్యంగా గురుత్వాకర్షణ శక్తి వంటి అంశాలను సులభతరంగా చెప్పటం చాలా కష్టం. ఇలాంటి కష్టమైన విషయాన్ని తనదైన రీతిలో పాఠకుల ముందుకు తీసుకువచ్చిన శాస్త్రవేత్త బ్రిటన్‌కు చెందిన క్లాడా రప్. ఆమె రాసిన 'ది బ్యూటీ ఆఫ్ ఫాలింగ్: ఏ లైఫ్ ఇన్ పర్‌సూట్ ఆఫ్ గ్రావిటీ' పుస్తకం ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది. ఇటీవలే భారత దేశంలో పర్యటించిన క్లాడాతో 'నవ్య' ప్రత్యేక ఇంటర్వ్యూ...

గురుత్వాకర్షణ వంటి కష్టతరమైన అంశంపై సాహిత్యపరమైన పుస్తకం రాయటం ఎంత కష్టం?

ఈ పుస్తకం సామాన్య పాఠకులకు ఒక ప్రయాణం లాంటిది. నేను ఒక సిద్ధాంతం గురించి చెబితే వారు వినటమనేది జరుగుతూనే ఉంటుంది. కానీ దీనిలో పాఠకులు కూడా నాతో పాటే ప్రయాణం చేస్తారు. తమ చుట్టూ ఉన్న ప్రపంచాన్ని తమదైన దృష్టికోణం నుంచి చూస్తారు. అనుభూతి పొందగలుగుతారు.

భౌతిక శాస్త్రంలో మహిళా శాస్త్రవేత్తల సంఖ్య చాలా తక్కువ కదా. దీనికి కారణాలేమిటి?

శాస్త్రవేత్తలు రెండు రకాలుగా ఉంటారు. కొందరు సిద్ధాంతాలను ప్రతిపాదిస్తారు. కొందరు ప్రయోగాలు చేస్తారు. భౌతికశాస్త్ర పరిశోధనా రంగంలో మహిళల సంఖ్య చాలా తక్కువ. దీనికి కొన్ని కారణాలు ఉన్నాయి. డిగ్రీ స్థాయిలో చాలా మంది మహిళలు భౌతికశాస్త్రాన్ని చదువుతారు. యూనివర్సిటీకి వచ్చే సమయానికి వీరి సంఖ్య గణనీయంగా తగ్గిపోతుంది. ఇక పరిశోధన రంగంలోకి వచ్చే మహిళలు ఇంకా తక్కువగా ఉంటారు. ఇక్కడ ఇంకో విషయాన్ని కూడా చెప్పాలి. సైన్స్ అనేది చాలా క్లిష్టమైన విషయం కాదు. సిద్ధాంతాలను రాతిపై రాసి చెక్కరు. ఇదే విధంగా శాస్త్రవేత్తలనగానే- కళ్లజోడు పెట్టుకొని గంభీరంగా ఉండరు. ఇలాంటి రకరకాల అభిప్రాయాలు తొలగిపోతే సైన్స్‌కు చాలా మంచి జరుగుతుంది. అందుకే నేను పుస్తకాన్ని రాశాను. దీనిని చదివిన తర్వాత సైన్స్‌పై వారికి ఉన్న దృష్టి కోణం మారుతుందని భావిస్తున్నాను.

మీరు అనేక పతకాలు గెలిచిన స్విమ్మింగ్ ఛాంపియన్.. వ్యోమగామి కావటానికి శిక్షణ కూడా పొందారు. గురుత్వాకర్షణ శక్తి గురించి చెప్పమంటే మీరు ఏం చెబుతారు?

గురుత్వాకర్షణ శక్తి మనకు స్వేచ్ఛను ఇస్తుంది. ఒక క్షణం గురుత్వాకర్షణ శక్తే లేదనుకుందాం. అప్పుడు మనందరం ఎలా ఉండేవాళ్లం? తేలుతూ ఉండేవాళ్లం. ఎలా అయినా స్వేచ్ఛగా వెళ్లే శక్తి ఉండేది. ఈ స్వేచ్ఛను నేను వ్యక్తిగతంగా కూడా కోరుకుంటాను. ఇక్కడ ఒక ఆసక్తికరమైన విషయం చెబుతాను. చాలా మంది నన్ను... "మీరు ఈ విశ్వంపై ఎందుకు పరిశోధన చేస్తున్నారు? గురుత్వాకర్షణపై మీకున్న ఆసక్తి ఏమిటి?" అని అడుగుతూ ఉంటారు. నాకు విశ్వం.. గురుత్వాకర్షణ శక్తి కాకుండా మిగిలిన విషయాలన్నీ చాలా సంక్లిష్టంగా అనిపిస్తాయి. ఉదాహర ణకు బయాలజీని తీసుకుందాం. దీనిలో ప్రతి విషయం ఒక దానిపై మరొకటి ఆధారపడి ఉంటుంది. ఒక విషయాన్ని అధ్యయనం చేయాలంటే మిగిలిన వాటి గురించి కూడా తెలుసుకోవాలి. గురుత్వాకర్షణ విషయంలో ఇలాంటి సమస్య ఉండదు. ఇది మన విశ్వానికి సంబంధించిన మౌలికమైన అంశం. దీనిపై పరిశోధనవల్ల అనేక లోతుపాతులు తెలుసుకోగలు గుతాను. ఉదాహరణకు మీరు ఒక విమానాన్ని నడుపుతునా న్నరనుకుందాం. విమానం ఇంజిన్‌ను స్టార్ట్ చేసే ముందు ఆలోచనలు ఒకలా ఉంటాయి. ఒక్కసారి ఆకాశంలోకి వెళ్లిన తర్వాత మొత్తం దృష్టంతా ఆకాశంపైనే ఉంటుంది. ఇతర ఆలోచనలు ఏమి రావు.

ఈ మధ్యకాలంలో ప్రాథమిక విజ్ఞాన శాస్త్ర పరిశోధనలకు ప్రాధాన్యం తగ్గింది. ఎక్కువ మంది ఐటీ, ఐటీ ఆధారిత సేవలవైపే మొగ్గు చూపుతున్నారు కదా.. దీనిపై మీ అభిప్రాయమేమిటి?

గతంలో మన సమాజంలో శాస్త్రవేత్తలకు ప్రత్యేకమైన స్థానం ఉండేది. ఇప్పుడు ప్రాధాన్యత తగ్గుతూ వస్తోంది. దీనికి కారణం ఎక్కువమంది ప్రజలకు దీర్ఘకాలిక పరిశోధనలకు ఉన్న అవసరంపై అవగాహన లేకపోవటమే! ఈ రోజు మానవుడు భూమిపై సురక్షితంగా నివసించటానికి అనేక లక్షల సంవత్సరాల పరిశోధనల ఫలితాలే కారణం. ఇప్పుడు అలాంటి పరిశోధనలు జరగకపోతే ఆ ప్రభావం భవిష్యత్ తరాలపై పడుతుంది. అది చాలా ప్రమాదకరం కూడా! మన జీవనశైలిని మెరుగుపరిచే కొత్త కొత్త టెక్నాలజీలు, అప్లికేషన్లు రావాలంటే... ప్రాథమిక స్థాయిలో కొన్ని పరిశోధనలు జరగాలి. అవి జరగకపోతే భవిష్యత్ కుంటుపడుతుంది.

• సివిఎల్ఎన్ ప్రసాద్

సాదా కుర్తాని స్టయిల్‌గా మార్చేద్దాం..!

ఒకే రంగులో ఉన్న సాదా కుర్తాలు ఎలాంటి శరీరాకృతి ఉన్నవారికైనా చక్కగా నప్పుతాయి. వీటిని మళ్లీ మళ్లీ వేసుకోవాలంటే మాత్రం ఇష్టంగా అనిపించదు. అందుకే సాదా కుర్తాని పలు కాంబినేషన్లతో స్టయిల్‌గా ఎలా మార్చాలో తెలుసుకుందాం.

- సాదా కుర్తాకి జతగా భారీగా ఎంబ్రాయిడరీ చేసిన షెరారా ధరిస్తే హుందాగా కనిపిస్తారు.
- ముదురు రంగు సాదా కుర్తా మీద పెద్ద ప్రింట్లు ఉన్న చున్నీ వేసుకుంటే బాగుంటుంది. జరీ వర్క్ ఉన్న దుపట్టా వేసుకున్నా అందంగా కనిపిస్తారు. చున్నీ లేదా దుపట్టాకు మ్యాచ్ అయ్యేలా పైజమా ఎంచుకుంటే డ్రెస్ చక్కగా ఉంటుంది.
- సాదా కుర్తాకి గుండ్రని మెడ కాకుండా మంచి డిజైన్ ఉండేలా చూసుకుంటే మంచి లుక్ వస్తుంది. హాల్టర్ నెక్, డీప్ వి నెక్ డిజైన్లు ప్రయత్నించవచ్చు. నెక్ డిజైన్ మీద కుందన్స్, అద్దాలు, రంగురంగుల పూసలు, మెరిసే రాళ్ల అమరిస్తే డ్రెస్ ఇంకాస్త రిచ్‌గా కనిపిస్తుంది.
- లేత రంగు కుర్తాకి ముదురు రంగు అంచుతో డిజైన్ చేసుకోవచ్చు. అంచుకి మ్యాచ్ అయ్యేలా సల్వార్, చున్నీ తెచ్చుకుని వేసుకుంటే గ్రాండ్ లుక్ వస్తుంది.
- ప్లెయిన్ కుర్తా మీద చక్కగా సూటయ్యే లెగ్గింగ్ వేసుకుని చెవులకు పెద్ద జుంకాలు లేదా ట్రెండింగ్‌లో ఉన్న ఇయర్ రింగ్స్ పెట్టుకుంటే ఫ్యాషన్‌గా కనిపిస్తారు.



అపరాధా? బాధితురాలా?

ఉగ్రవాద సానుభూతిపరురాలిగా ముద్ర, వీసా రద్దు, వెంటపడుతున్న ప్రభుత్వ ఏజెన్సీలు... ఊపిరి సలపనివ్వనంత వేగంగా తరుముతున్న సంఘటనల నేపథ్యంలో... భారతీయ విద్యార్థిని రంజనీ శ్రీనివాసన్ స్వీయ బహిష్కరణ విధించుకొని, అమెరికా నుంచి కెనడాకు పరుగులెత్తారు. ఆమె అపరాధి అని చట్ట సంస్థలు చెబుతూంటే... తను బాధితురాలినంటున్నారు రంజని. వీటిలో నిజం ఏదైనా... ప్రస్తుతం ఆమె భవిష్యత్తు అనిశ్చితిలో ఉంది.



థ్రిల్లర్ సినిమాను తలపిస్తున్న రంజనీ శ్రీనివాసన్ కథలో తాజా పరిణామాల వెనుక... ఓ ఫ్లాష్‌బ్యాక్ ఉంది. పాలస్తీనాకు అనుకూలంగా న్యూయార్క్‌లోని కొలంబియా యూనివర్సిటీ విద్యార్థులు కొందరు నిరుడు ఏప్రిల్‌లో ఆందోళనలు చేపట్టి, క్యాంపస్‌లోని హామిల్టన్ హాల్‌ను తమ ఆధీనంలోకి తీసుకున్నారు. ఆందోళనకారులను పోలీసులు అరెస్ట్ చేశారు. రంజనిని కూడా అదుపులోకి తీసుకున్నారు. "నేను ఆ ఆందోళనలో పాల్గొనలేదు. క్యాంపస్‌లో స్నేహితులను కలిసి వెళ్తూ నిరసనకారుల మధ్య చిక్కుకున్నాను. నన్ను అన్యాయంగా అరెస్ట్ చేశారు. ఆ నిరసనలకు నాకు ఏ సంబంధం లేదు" అని ఆమె స్పష్టం చేశారు. కాగా, ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించారని, సంఘటన స్థలం నుంచి వెళ్లిపోవాలని హెచ్చరించినా పట్టించుకోలేదనీ ఆరోపిస్తూ పోలీసులు ఆమెకు రెండు సమన్లు జారీ చేశారు. ఆ కేసును న్యాయస్థానం డిస్మిస్ చేసింది. క్రిమినల్ రికార్డుల్లో ఆ వివరాలు నమోదు కాలేదని రంజని చెబుతున్నారు. హామిల్టన్ హాల్‌ను విద్యార్థులు ఆక్రమించిన సంఘటనతో రంజనికి సంబంధం లేకపోవచ్చు కానీ... అంతకుముందు కొన్ని ఆందోళనల్లో ఆమె పాల్గొన్నారు. గాజాలో మానవ హక్కుల ఉల్లంఘన జరుగుతోందంటూ సోషల్ మీడియాలో వచ్చిన పోస్టుల్ని షేర్ చెయ్యడం, లైక్ చెయ్యడంతో పాటు... 2023లో పాలస్తీనా విముక్తికి మద్దతుగా 'సొసైటీ ఆఫ్ ఆర్కిటెక్చరల్ హిస్టారియన్స్' విడుదల చేసిన బహిరంగ లేఖ మీద సంతకం కూడా చేశారు. ఈ విషయాలను ఆమె తరఫు న్యాయవాదులు సైతం ధ్రువీకరించారు.

ఆ వివరాలు దాచినందుకు...

తమిళనాడుకు చెందిన రంజని 2016లో హార్వర్డ్ యూనివర్సిటీలో గ్రాడ్యుయేట్ విద్యార్థిగా ఎఫ్-1 వీసాపై అమెరికాకు వచ్చారు. కొలంబియా వర్సిటీలో... అర్బన్ ప్లానింగ్‌లో డాక్టోరల్ డిగ్రీ చేస్తున్నారు. హామిల్టన్ హాల్ కేసు నుంచి విముక్తి లభించిన కొద్దిరోజులకు స్టూడెంట్ వీసాను ఆమె పునరుద్ధరించుకున్నారు. తదనంతరం అధికారంలోకి వచ్చిన ట్రంప్ ప్రభుత్వం... కొలంబియా వర్సిటీలో పాలస్తీనా అనుకూల విద్యార్థుల మీద చర్యలకు శ్రీకారం చుట్టింది. మార్చి 5న రంజని వీసాను రద్దు చేసింది. "చెన్నైలోని యుఎస్ కాన్సులేట్ నుంచి నాకు ఒక ఇ-మెయిల్ వచ్చింది. నా వీసా రద్దు గురించి తెలియజేస్తూ నన్ను 'వీసాకు అనర్హురాలుగా చేసే కొత్త సమాచారం' వెలుగులోకి వచ్చిందని తెలిపింది" అని చెప్పారు రంజని. స్టూడెంట్ వీసాను పునరుద్ధరించుకొనే సమయంలో... అరెస్టు, సమన్ల గురించి ప్రస్తావించకుండా దాచినందుకు, హింసను, ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్నందుకు వీసాను రద్దు చేస్తున్నట్టు 'యుఎస్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ' ప్రకటన జారీ చేసింది. ఆమెపై ఉగ్రవాదులకు అనుకూలవాదిగా ముద్ర వేస్తూ, నిషేధిత ఉగ్రవాద సంస్థ హమాస్‌కు మద్దతుగా కార్యకలాపాల్లో పాల్గొన్నట్టు పేర్కొంది. రెండు రోజుల అనంతరం... కొలంబియా వర్సిటీ నుంచి ఆమెకు ఇ-మెయిల్ వచ్చింది. ఆమె వీసా రద్దుచేసినట్టు సమాచారం అందిందనీ, వర్సిటీ నుంచి ఆమెను తొలగిస్తున్నామనీ, ఆమెకు ఇచ్చిన వసతిని ఖాళీ చేయాలని పేర్కొన్నారు.

> "చెన్నైలోని యుఎస్ కాన్సులేట్ నుంచి నాకు ఒక ఇ-మెయిల్ వచ్చింది. నా వీసా రద్దు గురించి తెలియజేస్తూ నన్ను 'వీసాకు అనర్హురాలుగా చేసే కొత్త సమాచారం' వెలుగులోకి వచ్చిందని తెలిపింది" అని చెప్పారు రంజని.

జీవితం తల్లకిందులు...

ఒకవైపు ఇవి కొనసాగుతూండగా.. మరోవైపు మార్చి 7న రంజని నివసిస్తున్న అపార్ట్‌మెంట్‌కు ముగ్గురు ఫెడరల్ ఇమిగ్రేషన్ ఏజెంట్లు వచ్చారు. రంజనితో కలిసి అక్కడ నివసిస్తున్న మరో విద్యార్థినితో తాము పోలీసులమని చెప్పారు. గుర్తింపు కార్డులు చూపించాలని కోరడంతో కొద్దిసేపు వాదించి వెళ్లిపోయారు. ఆ సమయంలో రంజని ఆ అపార్ట్‌మెంట్‌లోనే ఉన్నారు. పరిస్థితి అర్థం చేసుకున్న ఆమె తక్షణం ఆ నివాసాన్ని ఖాళీ చేసి, వేరే మిత్రుల దగ్గర తలదాచుకున్నారు. మరికొన్ని గంటల్లోనే హమాస్ మద్దతుదారుడిగా పేరుపడిన మరో విద్యార్థి మహమ్మద్ ఖలీల్‌ను ఇమ్మిగ్రేషన్ అధికారులు అరెస్ట్ చేశారు. తదుపరి వంతు తనదేనని గ్రహించిన రంజని... ప్రభుత్వం రూపొందించిన 'సిబిపి యాప్'ను ఆశ్రయించారు. అమెరికాలో అనుమతి లేకుండా ఉంటున్నవారు చట్టపరమైన చర్యలను ఎదుర్కోవడానికి ముందే... స్వీయ బహిష్కరణను ఎంచుకొని, స్వచ్ఛందంగా అమెరికా వదిలి వెళ్ళడానికి ఈ యాప్ వీలు కలిగిస్తుంది. దాన్ని ఉపయోగించుకున్న రంజని... కెనడాకు పయనమయ్యారు. న్యూయార్క్‌లోని లాగార్డియా విమానాశ్రయం నుంచి ఆమె నిష్క్రమిస్తున్న దృశ్యాలను అధికారులు మీడియాకు విడుదల చేశారు. ఇది జరిగిన రెండు రోజుల తరువాత ఒక ఆంగ్ల పత్రికకు రంజని ఇంటర్వ్యూ ఇస్తూ "అక్కడ వాతావరణం ఉద్రిక్తంగా, ప్రమాదకరంగా కనిపించింది. అందుకే వేగంగా నిర్ణయం తీసుకున్నాను. అయిదేళ్లుగా కొలంబియా వర్సిటీలో చదువుతున్నాను. ఈ ఏడాది డిగ్రీ పూర్తిచెయ్యాల్సి ఉంది. ఇదంతా నేను తప్పు చెయ్యడంవల్ల జరిగింది కాదు, నా అభిప్రాయాలను స్వేచ్ఛగా వ్యక్తపరిచే హక్కును ఉపయోగించుకోవడం వల్ల జరిగింది. ఇప్పుడు నేను బాధితురాలిని. వీసా రద్దు చెయ్యడంతో నా జీవితం తల్లకిందులయింది. డిగ్రీ పూర్తి చేస్తాననే ఆశ కనిపించడం లేదు" అని చెప్పారు. 37 ఏళ్ళ రంజని భవిష్యత్తులో ఏం చెయ్యబోతున్నారు? స్వదేశానికి తిరిగి వస్తారా?' అనే ప్రశ్నలకు... ప్రస్తుతానికి ఆమె దగ్గర కూడా స్పష్టమైన సమాధానాలు లేవు.

బిజినెస్

కార్లు మరింత ప్రియం

ఏప్రిల్ 1 నుంచి కొత్త ధరలు


న్యూఢిల్లీ: దేశీయ విపణిలో కార్ల ధరలు ప్రియం కానున్నాయి. ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి సుమారుగా అన్ని కంపెనీల కార్ల ధరలు పెరగనున్నాయి. మారుతి సుజుకీ, మహీంద్రా, హ్యుండయ్, టాటా మోటార్స్, కియా, రెనో, హోండా కంపెనీలే కాకుండా లగ్జరీ కార్ల కంపెనీలైన మెర్సిడెజ్, బీఎండబ్ల్యూ, ఆడి వంటి కంపెనీలు కూడా కార్ల ధరలు పెంచుతున్నట్టు ప్రకటించాయి. కార్ల ధరలు పెరగడం ఈ ఏడాదిలో ఇది రెండోసారి. మోడల్‌ను బట్టి కార్ల ధరలో పెంపు శాతం భిన్నంగా ఉంటుంది. మారుతి సుజుకీ గరిష్ఠంగా 4% పెంపును ప్రకటించగా హ్యుండయ్ 3%, టాటా మోటార్స్ 2%, మహీంద్రా 3% పెంచుతున్నట్టు తెలిపాయి.

- రిలయన్స్ రిటైల్‌కు చెందిన ట్రెండ్స్.. తిరుపతిలో కొత్త స్టోర్‌ను ఏర్పాటు చేసింది. తిరుపతిలో ట్రెండ్స్‌కు ఇది నాలుగో స్టోర్. నాన్ మెట్రో, ద్వితీయ శ్రేణి నగరాల్లో కార్యకలాపాల విస్తరణలో భాగంగా ఈ స్టోర్‌ను ఏర్పాటు చేసినట్లు ప్రకటించింది.
- సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్‌లో కీలకంగా ఉన్న ఏజీ అండ్ పీ ప్రథమ్, థింక్ గ్యాస్ విలీనమయ్యాయి. ఇకపై ఈ రెండు కంపెనీలు ఒకే సంస్థగా కార్యకలాపాలు సాగించనున్నట్లు ప్రకటించాయి. పదికి పైగా రాష్ట్రాల్లోని 50 జిల్లాల్లో 18 కోట్ల మంది వినియోగదారులకు ఈ సంస్థ సేవలందించనుంది.

ఫార్మా కింగ్ దివీస్ మురళి

జీవితంలో ఎదురయ్యే సవాళ్లను చూసి కొందరు నీరుగారి పోతారు. మరికొందరు వాటినే తమ అభివృద్ధికి సోపానాలుగా మార్చుకుంటారు. దివీస్ లేబొరేటరీస్ వ్యవస్థాపకులు, ఎండీ దివి మురళీ కృష్ణ ప్రసాద్ రెండో కోవకు చెందిన వ్యక్తి. దాదాపు రూ.82,000 కోట్ల నికర ఆస్తులతో భారత ఫార్మా రంగంలో దూసుకుపోతున్న ఈ 'ఫార్మా కింగ్' గురించి మరిన్ని వివరాలు.

పట్టుదలతో ఉన్నత శిఖరాలకు..
తెలుగు నేలపై అత్యంత సంపన్నుడు
రూ.82,000 కోట్ల నికర ఆస్తులు



దివీస్ ల్యాబ్స్ ఏర్పాటు

డాక్టర్ దివి మురళీ కృష్ణ ప్రసాద్. భారత ఫార్మా పరిశ్రమలో ముఖ్యంగా హైదరాబాద్ ఫార్మా రంగంలో ఈ పేరు తెలియని వారు ఉండరంటే అతిశయోక్తి కాదు. పట్టుదల, నిజాయితీతో పారిశ్రామిక రంగంలో శిఖరాగ్ర స్థానానికి ఎదిగిన కొద్దిమంది ఔత్సాహిక పారిశ్రామికవేత్తల్లో దివి మురళీ కృష్ణ ప్రసాద్ ఒకరు. కృష్ణా జిల్లాలోని ఒక మారుమూల గ్రామంలో 1951 మార్చి 17న ఒక పెద్ద కుటుంబంలో 13వ సంతానంగా ఆయన జన్మించారు. ఫోర్బ్స్ పత్రిక కథనం ప్రకారం గత ఏడాది దేశంలోని టాప్-100 మంది సంపన్నుల్లో దివి మురళీ 29వ స్థానంలో ఉన్నారు. ప్రస్తుతం దాదాపు రూ.82,000 కోట్ల ఆస్తులతో తెలుగు రాష్ట్రాల్లో అత్యంత సంపన్నుడిగా ఎదిగిన దివి మురళీ కృష్ణ ప్రసాద్ ఎంతో మంది ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు స్ఫూర్తి.

జీవిత ప్రస్థానం: దివి మురళీ చదువుల్లో ముందు నుంచి పెద్ద టాపరేమీ కాదు. టెన్త్ ఎలాగోలా గట్టెక్కినా, మచిలీపట్నంలో ఇంటర్ సెకండియర్ ఫెయిలయ్యారు. తర్వాత కష్టపడి ఇంటర్ పూర్తి చేసి కర్ణాటకలోని మణిపాల్ అకాడమీ ఆఫ్ హైయర్ ఎడ్యుకేషన్‌లో బీ ఫార్మసీలో చేరారు. అక్కడా ఆయన చదువు పెద్దగా పుంజుకోలేదు. ఫస్ట్ ఇయర్ పూర్తి చేసేందుకూ బాగా కష్టపడాల్సి వచ్చింది. చివరికి ఆ కోర్సు పూర్తయ్యే సరికి యూనివర్సిటీలోనే టాపర్‌గా గోల్డ్ మెడల్ సాధించారు. తర్వాత అదే యూనివర్సిటీలో ఎం ఫార్మసీనీ గోల్డ్ మెడల్‌తో పూర్తి చేశారు. ఎం ఫార్మసీ పూర్తి చేశాక 1975లో హైదరాబాద్ వచ్చి వార్నర్ హిందుస్థాన్ అనే కంపెనీలో రూ.250 నెల జీతంతో ట్రైనీగా తన కెరీర్ ప్రారంభించారు. అలాగే కాకతీయ విశ్వవిద్యాలయం నుంచి ఫార్మాస్యూటికల్ సైన్సెస్‌లో పీహెచ్‌డీ పట్టాను అందుకున్నారు.

అమెరికా పయనం: వార్నర్ హిందుస్థాన్ కంపెనీలో కొద్ది కాలం పని చేసేసరికే దివి మురళీ కృష్ణ ప్రసాద్‌కు బోరు కొట్టింది. ఇక్కడ లాభం లేదు. అమెరికా వెళ్లి మన లక్ పరీక్షించుకుందాం అనుకున్నారు. వెంటనే అమెరికా వీసా కోసం దరఖాస్తు చేశారు. గోల్డ్ మెడలిస్టు కావడంతో అమెరికా వీసా తేలిగ్గానే వచ్చింది. 1977లో రూ.600తో అమెరికాలో అడుగు పెట్టారు. అక్కడ దాదాపు ఏడేళ్ల పాటు అనేక ఫైన్ కెమికల్స్, ఫార్మా, కాస్మోటిక్ కంపెనీల్లో పని చేశారు. అప్పటికే అమెరికాలో శాశ్వతంగా ఉండేందుకు గ్రీన్ కార్డు కూడా వచ్చేసింది. అయినా ఏదో వెలితి. ఇంత కష్టపడి చదివి మన తెలివి తేటలన్నీ అమెరికా కోసమేనా. దేశం కాని దేశంలో ఎంతకాలం ఇలా బంధుమిత్రులు అందరికీ దూరంగా బతకాలి? అనే ప్రశ్నలు వేధించేవి. చివరకు ధైర్యం చేసి ఇండియా వచ్చేసారు.

ఇండియా వచ్చాక: ఇండియా అయితే వచ్చారు గానీ.. దివి మురళికి ఏమి చేయాలో వెంటనే తోచలేదు. ఏదైనా కంపెనీ పెట్టాలంటే చేతిలో పెద్దగా డబ్బులూ లేవు. అప్పుడే డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్ అధినేత డాక్టర్ అంజిరెడ్డితో కలిసి 1984లో కెమినార్ డ్రగ్స్ అనే ఫార్మా కంపెనీని కొనుగోలు చేసి దాన్ని బహుముఖంగా విస్తరించారు. ఇక్కడా సవాళ్ల ఎదురైనా పట్టుదలతో వాటిని అధిగమించారు.

అంజిరెడ్డితో కలిసి కెమినార్ డ్రగ్స్ కంపెనీని సక్సెస్ చేశాక.. 1990లో సొంతంగా 100 మంది ఉద్యోగులతో దివీస్ రీసెర్చ్ సెంటర్ ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో ప్రత్యేక కంపెనీ ఏర్పాటు చేశారు. ప్రారంభంలో ఈ సంస్థ ఫార్మా కంపెనీలకు అవసరమైన టెక్నాలజీ, కన్సల్టెన్సీ సర్వీసులు అందించేది. ఈ అనుభవంతో ఔషధ పరిశ్రమకు కీలక ముడి పదార్థాలైన యాక్టివ్ ఫార్మా ఇన్‌గ్రిడియెంట్స్ (ఏపీఐ) తయారీ కోసం 1994లో నల్లగొండ జిల్లాలోని చౌటుప్పల్ సమీపంలో దివీస్ లేబొరేటరీస్ పేరుతో ప్రత్యేక ప్లాంట్ ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ప్రపంచంలోని టాప్-10 ఫార్మా కంపెనీల్లోని 8 కంపెనీలు తమకు అవసరమైన ఏపీఐలను దివీస్ నుంచే దిగుమతి చేసుకుంటున్నాయి. ఇప్పుడు ఈ కంపెనీకి చౌటుప్పల్‌తో పాటు విశాఖపట్నం సమీపంలోని చిప్పాడ వద్ద, కాకినాడ సమీపంలోని ఒంటిమామిడి గ్రామం వద్ద ఏపీఐ ప్లాంట్లు ఉన్నాయి. తుది ఔషధాల ఉత్పత్తికి అవసరమైన కీలక ఏపీఐల ఉత్పత్తిలో దివీస్ ల్యాబ్స్ ఇప్పుడు ప్రపంచంలోనే మేటి కంపెనీ. కంపెనీ షేర్ల మార్కెట్ క్యాప్ కూడా గత వారం రూ.1.53 లక్షల కోట్లకు చేరింది. ఇందులో దాదాపు 40 శాతం గత ఏడాది కాలంలో పెరగడం విశేషం.

23,650 పైన బుల్లిష్

(మార్చి 24-28 తేదీల మధ్య వారానికి)



డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

అమర్ శాస్త్రి


నిఫ్టీ గత వారం 23,350-22,353 పాయింట్ల మధ్యన కదలాడి 953 పాయింట్ల లాభంతో 23,350 వద్ద ముగిసింది. ఈ వారాంతంలో 23,650 ఎగువన ముగిస్తే స్వల్పకాలానికి బుల్లిష్ అవుతుంది.

- 20, 50, 100, 200 రోజుల చలన సగటు స్థాయిలు 23,129, 22,776, 22,562, 22,718 వద్ద ఉన్నాయి. ఇవి నిరోధ, మద్దతు స్థాయిలుగా నిలుస్తాయి.

బ్రేకౌట్ స్థాయి: 23,650 **బ్రేక్‌డౌన్ స్థాయి:** 23,050
నిరోధ స్థాయిలు: 23,550, 23,650, 23,750 (23,450 పైన బుల్లిష్)
మద్దతు స్థాయిలు: 23,150, 23,050, 22,950 (23,250 దిగువన బేరిష్)

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

24వ తేదీ			
హైదరాబాద్	420	విజయవాడ	440
వరంగల్	422	గోదావరి	420
చిత్తూరు	470	విశాఖపట్నం	420
		డజను గుడ్లు రూ. 60	



ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	101	విజయవాడ	105
వరంగల్	101	గుంటూరు	103
కరీంనగర్	101	ఒంగోలు	103
మహబూబ్‌నగర్	101	చిత్తూరు	86
కర్నూలు	101	నెల్లూరు	91
విశాఖపట్నం	99	అనంతపురం	91
గోదావరి	105		



కన్సాలిడేషన్‌కు ఆస్కారం



వి. సుందర్ రాజా
టెక్ వ్యూ

నిఫ్టీ గత వారం బలమైన ర్యాలీతో ఐదు ట్రేడింగ్ దినాలూ లాభాల్లోనే కదలాడి చివరికి ముందు వారంతో పోల్చితే 950 పాయింట్ల లాభంతో ముగిసింది. ఐదు వారాల నిరంతర కరెక్షన్ అనంతరం ఏర్పడిన టెక్నికల్ పునరుజ్జీవం ఇది. మిడ్‌క్యాప్-100 (7.7%), స్మాల్‌క్యాప్-100 (8.6%) సూచీలు కూడా ఇదే విధమైన ర్యాలీలో నడిచాయి. అయితే ఐదు రోజుల ర్యాలీ కారణంగా ఇప్పుడు కన్సాలిడేట్ కావలసి ఉంది. ప్రధాన ట్రెండ్ పాజిటివ్‌గానే ఉన్నా ఈ వారంలో జోరు కొంత తగ్గవచ్చు. తదుపరి నిరోధం 23,500.

బుల్లిష్ స్థాయిలు: సానుకూలత కోసం ప్రస్తుత గరిష్ఠ స్థాయిల్లో కన్సాలిడేషన్ అనంతరం తదుపరి నిరోధం 23,500 కన్నా పైన నిలదొక్కుకోవలసి ఉంటుంది. ప్రధాన నిరోధం 24,000.

బేరిష్ స్థాయిలు: ఏ మాత్రం బలహీనత ప్రదర్శించినా భద్రత కోసం మద్దతు స్థాయి 22,200 వద్ద నిలదొక్కుకోవాలి. విఫలమైతే మరింత బలహీనపడుతుంది. ప్రధాన స్వల్పకాలిక మద్దతు స్థాయి 22,000. అంతకన్నా దిగజారితే స్వల్పకాలిక కరెక్షన్‌లో పడుతుంది.

బ్యాంక్ నిఫ్టీ: ఈ సూచీ కూడా 2,500 పాయింట్ల బలమైన ర్యాలీతో 50,600 వద్ద ముగిసింది. నిరోధ స్థాయి 50,700 వద్ద కన్సాలిడేట్ కావచ్చు. ఆ పైన మాత్రమే స్వల్పకాలిక సానుకూలత ఏర్పడుతుంది. ప్రధాన మద్దతు స్థాయి 50,000. ఇక్కడ విఫలమైతే స్వల్పకాలిక బలహీనత తప్పదు.

పాటర్న్: గత శుక్రవారం నిఫ్టీ 50 డీఎంఏను దాటింది. ఇప్పుడు 23,500 సమీపంలో ఉన్న 100 డీఎంఏకు చేరువవుతోంది. ఇక్కడ కన్సాలిడేషన్ ఉండవచ్చు. ఆర్ఎస్ఐ సూచీల ప్రకారం స్వల్పకాలిక ఓవర్‌బాట్ స్థితిలో ప్రవేశిస్తున్నందు వల్ల ట్రేడర్లు అప్రమత్తంగా ఉండాలి. సానుకూలత కోసం 23,500 వద్ద "అడ్డంగా ఏర్పడిన రెసిస్టెన్స్ ట్రెండ్‌లైన్" కన్నా పైన నిలదొక్కుకోవాలి.

టైమ్: ఈ సూచీ ప్రకారం బుధవారం తదుపరి మైనర్ రివర్సల్ ఉండవచ్చు.

సోమవారం స్థాయిలు	
నిరోధం	23,440, 23,500
మద్దతు	23,280, 23,200

ఈ వారం నిలదొక్కుకుంటేనే!

దేశీయ స్టాక్ మార్కెట్లు ఈ వారం మెరుగ్గా కదలాడే అవకాశాలున్నాయి. ప్రస్తుతానికి అంతర్జాతీయ మార్కెట్ల నుంచి ప్రతికూల సంకేతాలు కనిపించటం లేదు. మరోవైపు భారత ఈక్విటీ మార్కెట్లలోకి విదేశీ సంస్థాగత పెట్టుబడిదారుల నుంచి పెట్టుబడుల రాక మొదలైంది. గత శుక్రవారం 23,350 వద్ద ముగిసిన నిఫ్టీకి 23,800 వద్ద తక్షణ నిరోధం ఉంది. అయితే ప్రస్తుత స్థాయిలోనే మరింత కన్సాలిడేట్ అవ్వటం ముఖ్యం. అప్పుడే సూచీకి మరింత పటిష్ఠత లభిస్తుంది. ఇన్వెస్టర్లలో ఆత్మ విశ్వాసం పెరుగుతుంది.

స్టాక్ రికమండేషన్స్

టీవీఎస్ మోటార్స్: గత ఏడాది సెప్టెంబరు నుంచి ఈ షేరు డౌన్‌ట్రెండ్‌లోనే కొనసాగుతూ వస్తోంది. దాదాపు 25 శాతం వరకు దిద్దుబాటుకు లోనయ్యాయి. కీలకమైన రూ.2,230 స్థాయిలో డబుల్ బాటమ్ ఏర్పడింది. అక్కడి నుంచి మళ్లీ టర్న్ అరౌండ్ మొదలైనట్లు కనిపిస్తోంది. గత వారం ఐదు సెషన్లలోనూ ఈ షేరు వరుసగా లాభపడింది. గత శుక్రవారం రూ.2,413 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో ఇన్వెస్టర్లు రూ.2,400 స్థాయిలో పొజిషన్ తీసుకుని రూ.2,550/2,600 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.2,360 స్థాయిని స్టాప్ లాస్‌గా పెట్టుకోవాలి.

మ్యాన్‌కైండ్ ఫార్మా: జీవితకాల గరిష్ఠ స్థాయి నుంచి 30 శాతం మేర దిద్దుబాటుకు లోనైన ఈ షేరు ప్రస్తుతం దూకుడును ప్రదర్శిస్తోంది. చివరి రెండు సెషన్లలో భారీ వాల్యూమ్‌తో 12 శాతం మేర లాభపడింది. ఫార్మా రంగంలో మంచి మూమెంటమ్ కనిపిస్తుండటం శుభపరిణామం. గత శుక్రవారం రూ.2,415 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.2,350 స్థాయిలో పొజిషన్ తీసుకుని రూ.2,540 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.2,310 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

ఎస్‌బీఐ లైఫ్: సెప్టెంబరు నుంచి డౌన్‌ట్రెండ్‌లో కొనసాగిన ఈ కౌంటర్‌లో ఈ ఏడాది ఆరంభం నుంచి అక్యుములేషన్ మొదలైంది. మార్కెట్లు నష్టాల్లో ఉన్నప్పటికీ ఈ షేరు బలాన్ని ప్రదర్శించింది. గత వారం దాదాపు 12 శాతం మేర పెరిగింది. ప్రస్తుతం ఈ షేరు కీలకమైన రూ.1,550 నిరోధ స్థాయికి చేరుకుంది. ఈ స్థాయిని బ్రేక్ చేస్తే మరింత పెరగటం ఖాయం. గత శుక్రవారం రూ.1,546 వద్ద క్లోజైన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.1,520 స్థాయిలో పొజిషన్ తీసుకుని రూ.1,660/1,690 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.1,480 స్థాయిని కచ్చితమైన స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

ఎంఆర్‌పీఎల్: గత ఏడాది ఫిబ్రవరి నుంచి ఈ షేరు డౌన్‌ట్రెండ్‌లోనే కొనసాగుతూ వస్తోంది. తాజాగా భారీ వాల్యూమ్‌తో రేంజ్ ఎక్స్‌పాన్షన్ కనిపిస్తోంది. ఈ షేరు గత నెల 22 శాతం, గత వారం 13 శాతం మేర పెరిగింది. గత శుక్రవారం 14శాతం లాభంతో రూ.135 వద్ద క్లోజైంది. మదుపరులు ఈ కౌంటర్‌లో రూ.130 శ్రేణిలో ఎంటరై రూ.165 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.120 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

ఎన్‌హెచ్‌పీసీ: రెండు నెలలుగా ఈ కౌంటర్‌లో మంచి బేస్ ఏర్పడుతోంది. డార్వాస్ బాక్స్ ప్యాటర్న్ కనిపిస్తోంది. ప్రస్తుతం స్వల్పకాల నిరోధం రూ.82కి చేరుకుంది. దీన్ని అధిగమిస్తే మూమెంటమ్ పెరగవచ్చు. గత వారం ఈ షేరు 6 శాతం మేర పెరిగింది. గత శుక్రవారం రూ.82 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో ఇన్వెస్టర్లు రూ.80 వద్ద పొజిషన్ తీసుకుని రూ.115 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.76 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.



- మూర్తి నాయుడు పాదం,
మార్కెట్ నిపుణులు, నిఫ్టీ మాస్టర్
+91 98855 59709
niftymasterlive@gmail.com

నోట్ : పెట్టుబడి నిర్ణయాలు తీసుకునే ముందు మదుపరులు తమ ఫైనాన్షియల్ అడ్వైజర్ల సలహాలు తీసుకోవాలి.

ఉప్పల్‌లో ఇషాన్ తుఫాన్

సూపర్ సెంచరీతో కదం తొక్కిన కిషన్

హైదరాబాద్ 286/6 రాజస్థాన్ 242/6

హెడ్ ధనాధన్ ఇన్నింగ్స్

- సన్‌రైజర్స్ పరుగుల సునామీ
- 44 రన్స్‌తో రాయల్స్ ఓటమి



ఇషాన్ కిషన్ (47 బంతుల్లో 11 ఫోర్లు, 6 సిక్స్‌లతో 106 నాటౌట్)

2 సన్‌రైజర్స్ చేసిన 286/6 ఐపీఎల్ చరిత్రలో రెండో అత్యధిక స్కోరు. 287/3తో టాప్ స్కోరు కూడా హైదరాబాద్ పేరిటే ఉండడం విశేషం.

ఐపీఎల్‌లో టాప్-5 స్కోర్లు

జట్టు	స్కోరు	ప్రత్యర్థి	వేదిక	తేదీ
సన్‌రైజర్స్	287/3	బెంగళూరు	బెంగళూరు	2024 ఏప్రిల్ 15
సన్‌రైజర్స్	286/6	రాజస్థాన్	హైదరాబాద్	2025 మార్చి 23
సన్‌రైజర్స్	277/3	ముంబై	హైదరాబాద్	2024 మార్చి 27
కోల్‌కతా	272/7	ఢిల్లీ	విశాఖపట్నం	2024 ఏప్రిల్ 3
సన్‌రైజర్స్	266/7	ఢిల్లీ	ఢిల్లీ	2024 ఏప్రిల్ 20

1 ఐపీఎల్ చరిత్రలో అత్యధిక పరుగులు (0/76) ఇచ్చుకున్న బౌలర్‌గా జోఫ్రా ఆర్చర్. గత రికార్డు మోహిత్ శర్మ (2/73) పేరిట ఉంది.

528 ఈ మ్యాచ్ రెండు ఇన్నింగ్స్‌ల్లో కలిపి నమోదైన పరుగులు ఇవి. లీగ్ చరిత్రలో ఇది రెండో అత్యధికం.



హెడ్ (31 బంతుల్లో 67)

హైదరాబాద్: నిరుటి రన్నరప్ హైదరాబాద్ ఈసారి ఐపీఎల్‌లో అద్భుతమైన బోణీ కొట్టింది. క్రీజులోకి వచ్చిన బ్యాటర్లంతా హడలెత్తించిన వేళ 44 పరుగులతో రాజస్థాన్ రాయల్స్‌పై ఘన విజయం సాధించింది. ఆదివారం ఇక్కడ జరిగిన మ్యాచ్‌లో మొదట హైదరాబాద్ 20 ఓవర్లలో 286/6 స్కోరు చేసింది. ఇషాన్ కిషన్ (47 బంతుల్లో 11 ఫోర్లు, 6 సిక్స్‌లతో 106 నాటౌట్) సూపర్ సెంచరీతో భళా అనిపించాడు. ట్రావిస్ హెడ్ (31 బంతుల్లో 9 ఫోర్లు, 3 సిక్స్‌లతో 67), క్లాసెన్ (14 బంతుల్లో 5 ఫోర్లు, సిక్సర్‌తో 34), నితీశ్ కుమార్ (15 బంతుల్లో 4 ఫోర్లు, సిక్సర్‌తో 30) మెరిశారు. తుషార్ మూడు, మహీశ్ తీక్షణ రెండు వికెట్లు పడగొట్టారు. భారీ ఛేదనలో రాజస్థాన్ రాయల్స్ 20 ఓవర్లలో 242/6 స్కోరుకే పరిమితమై ఓడింది. ధ్రువ్ జురెల్ (35 బంతుల్లో 5 ఫోర్లు, 6 సిక్స్‌లతో 70), సంజూ శాంసన్ (37 బంతుల్లో 7 ఫోర్లు, 4 సిక్స్‌లతో 66) హాఫ్ సెంచరీలతో సత్తా చాటారు. హెట్‌మయెర్ (23 బంతుల్లో ఫోర్, 4 సిక్స్‌లతో 42), శుభమ్ దూబే (11 బంతుల్లో ఫోర్, 4 సిక్స్‌లతో 34 నాటౌట్) మెరుపు ఇన్నింగ్స్ ఆడారు. హర్షల్ పటేల్, సిమర్‌జీత్ చెరో రెండు వికెట్లు పడగొట్టారు. ఇషాన్ కిషన్ 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచాడు.

అంతా చెలరేగారు: సంజూ శాంసన్ గాయంతో 'ఇంపాక్ట్ ఆటగాడి' పాత్రకే పరిమితం కావడంతో రియాన్ పరాగ్ రాజస్థాన్ రాయల్స్ కెప్టెన్సీ చేపట్టాడు. అయితే ఫ్లాట్ ఉప్పల్ పిచ్‌పై..టాస్ గెలిచి తొలుత బౌలింగ్ ఎంచుకుని పరాగ్ తొలి తప్పిదం చేశాడు. ఇక ప్రతి హైదరాబాద్ బ్యాటర్ రాయల్స్ బౌలర్లను చెడుగుడు ఆడుకున్నారు. ముఖ్యంగా సన్‌రైజర్స్ తరఫున మొదటి మ్యాచ్ బరిలో దిగిన ఇషాన్ కిషన్ ఆకాశమే హద్దుగా రెచ్చిపోయాడు. ఓపెనర్లు హెడ్, అభిషేక్ శర్మ (24) సహజ శైలిలో విజృంభించగా, నితీశ్, క్లాసెన్ కూడా బ్యాట్లు ఝుళిపించడంతో పరుగులు వెల్లువెత్తాయి. ఈక్రమంలో తొలుత..అభిషేక్, హెడ్ బాదుడుకు మొదటి మూడు ఓవర్లలోనే రైజర్స్ 45 పరుగులు కొల్లగొట్టింది. నాలుగో ఓవర్‌లో అభిషేక్‌ను తీక్షణ అవుట్ చేసినా రాయల్స్‌కు ఊరట దక్కలేదు. ఉరుముకు, మెరుపు తోడైనట్టు హెడ్‌కు, కిషన్ జత కలవడంతో హైదరాబాద్ స్కోరు రాకెట్ వేగంతో దూసుకు పోయింది. పవర్ ప్లేలో 94/1తో నిలవగా, ఆపై హెడ్ హాఫ్ సెంచరీ పూర్తి చేశాడు. కళ్లు చెదిరే షాట్లతో అలరించిన కిషన్ కూడా అర్ధ శతకాన్ని పూరించాడు. పదో ఓవర్లో హెడ్‌ను తుషార్ దేశ్‌పాండే పెవిలియన్ చేర్చాడు. దాంతో 39 బంతుల్లో 85 పరుగుల రెండో వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది. హెడ్, కిషన్ ఇద్దరూ కలిసి 20 ఫోర్లు, తొమ్మిది సిక్స్‌లు కొట్టడం చూస్తే..రాయల్స్ బౌలర్లను వారు ఎలా ఉతికేశారో తెలుస్తుంది. మెరుపు బ్యాటింగ్‌తో అలరించిన నితీశ్ 15వ ఓవర్లో నిష్క్రమించగా..అతడి స్థానంలో వచ్చిన క్లాసెన్ తగ్గేదేలే అనేలా షాట్లు సంధించాడు. క్లాసెన్ దూకుడుకు 19వ ఓవర్లో సందీప్ శర్మ చెక్ పెట్టగా, ఇదే ఓవర్లో రెండు సిక్స్‌లతోపాటు మరో రెండు పరుగులు చేసి ఇషాన్ ఐపీఎల్‌లో తొలి సెంచరీ సాధించాడు. ఆఖరి ఓవర్లో 2 వికెట్లు కోల్పోయిన హైదరాబాద్ 13 పరుగులు చేసింది.

సంజూ, జురెల్ పోరాడినా..: రికార్డు ఛేదనలో రాజస్థాన్ టపటపా 3 వికెట్లు కోల్పోయినా.. శాంసన్, జురెల్ శతక భాగస్వామ్యంతో పోరాడారు. వీరిద్దరి నిష్క్రమణ అనంతరం హెట్‌మయెర్, శుభమ్ దూబే దూకుడైన బ్యాటింగ్‌తో ఆశలు రేపారు. కానీ రన్‌రేట్ అప్పటికే భారీగా పెరిగిపోవడంతో రాజస్థాన్‌కు ఓటమి తప్పలేదు. జైస్వాల్ (1), కెప్టెన్ రియాన్ పరాగ్ (4), నితీశ్ రాణా (11) విఫలం కావడంతో రాజస్థాన్ 50/3తో ఇబ్బందుల్లో కూరుకుపోయింది. ఈ తరుణంలో శాంసన్, జురెల్ హైదరాబాద్ బౌలర్లపై ఎదురు దాడికి దిగి 9.5 ఓవర్లలో 111 పరుగులు జత చేశారు. కానీ 14వ ఓవర్లో శాంసన్‌ను హర్షల్, 15వ ఓవర్లో జురెల్‌ను జంపా అవుట్ చేయడంతో రాజస్థాన్ పరిస్థితి మారిపోయింది. అయితే హెట్‌మయెర్, శుభమ్ దూబే పట్టువదల్లేదు. సిక్స్‌లు, ఫోర్లతో చెలరేగి ఆరో వికెట్‌కు 34 బంతుల్లో 80 రన్స్ జోడించినా..ఓటమి అంతరాన్ని మాత్రమే తగ్గించగలిగారు.

గత సీజన్‌లో మూడుసార్లు 250కిపైగా స్కోర్లు..టాపార్డర్ బ్యాటర్లంతా సూపర్ ఫామ్‌తో ఫుల్ జోష్..ఇంకేం ఈ సీజన్ తమ తొలి పోరులో, పైగా సొంత మైదానంలో సన్‌రైజర్స్ హైదరాబాద్ '300' కొట్టేస్తుందనే అంచనా..అందుకు తగ్గట్టుగానే రాజస్థాన్ రాయల్స్‌తో మ్యాచ్‌లో హైదరాబాద్ బ్యాటర్లంతా పూనకం వచ్చినట్టు ఆడారు.. ప్రత్యర్థి బౌలర్లకు చుక్కలు చూపారు..అలవోకగా ఫోర్లు, సిక్సర్లు బాది పరుగుల సునామీ సృష్టించారు..దాంతో ఐపీఎల్‌లో తన పేరిటే ఉన్న రికార్డు స్కోరుకు దగ్గరగా రైజర్స్ దూసుకొచ్చింది.. అయితే ఆఖరి ఓవర్లో రెండు వికెట్లు కోల్పోకుండా ఉంటే ఆ రికార్డు అందుకొనేదే! ముంబై ఇండియన్స్ నుంచి సన్‌రైజర్స్‌కు మారాక తొలి మ్యాచ్ బరిలో దిగిన ఇషాన్ కిషన్ తుఫాన్ ఇన్నింగ్స్‌తో ఫ్యాన్స్‌ను సమ్మోహితులను చేశాడు.

ఆ రెండు ఓవర్లే మార్చేశాయి

రాజస్థాన్ ఛేదనలో జంపా వేసిన 11వ ఓవర్, కమిన్స్ సంధించిన 12వ ఓవరే ఇన్నింగ్స్ స్వరూపాన్ని మార్చాయి. ఈ రెండు ఓవర్లలో రాజస్థాన్ ఏడు పరుగులే చేయగలిగింది.

డాట్ బాల్స్‌కూడా..

హైదరాబాద్ విజయంలో డాట్ బాల్స్ కూడా కీలకంగా నిలిచాయి. సన్‌రైజర్స్ ఇన్నింగ్స్‌లో రాజస్థాన్ 25 డాట్ బాల్సే వేయగలిగింది. అయితే కమిన్స్ సేన 40 డాట్ బాల్స్ వేయడం విశేషం.



జురెల్ (70)

స్కోరుబోర్డు

సన్‌రైజర్స్: అభిషేక్ (సి) జైస్వాల్ (బి) తీక్షణ 24, హెడ్ (సి) హెట్‌మయెర్ (బి) తుషార్ 67, ఇషాన్ కిషన్ (నాటౌట్) 106, నితీశ్‌కుమార్ (సి) జైస్వాల్ (బి) తీక్షణ 30, క్లాసెన్ (సి) పరాగ్ (బి) సందీప్ 34, అనికేత్ వర్మ (సి) ఆర్చర్ (బి) తుషార్ 7, అభినవ్ మనోహర్ (సి) పరాగ్ (బి) తుషార్ 0, కమిన్స్ (నాటౌట్) 0, **ఎక్స్‌ట్రాలు: 18; మొత్తం: 20 ఓవర్లలో 286/6; వికెట్ల పతనం:** 1-45, 2-130, 3-202, 4-258, 5-279, 6-279; **బౌలింగ్:** ఫజల్లా ఫరూఖి 3-0-49-0, మహీష్ తీక్షణ 4-0-52-2, ఆర్చర్ 4-0-76-0, సందీప్ శర్మ 4-0-51-1, నితీశ్ రాణా 1-0-9-0, తుషార్ దేశ్‌పాండే 4-0-44-3.

రాజస్థాన్ రాయల్స్: యశస్వీ జైస్వాల్ (సి) అభినవ్ (బి) సిమర్‌జీత్ 1, సంజూ శాంసన్ (సి) క్లాసెన్ (బి) హర్షల్ 66, రియాన్ పరాగ్ (సి) కమిన్స్ (బి) సిమర్‌జీత్ 4, నితీశ్ రాణా (సి) కమిన్స్ (బి) షమి 11, ధ్రువ్ జురెల్ (సి) ఇషాన్ (బి) జంపా 70, హెట్‌మయెర్ (సి) అభినవ్ (బి) హర్షల్ 42, శుభమ్ దూబే (నాటౌట్) 34, ఆర్చర్ (నాటౌట్) 1, **ఎక్స్‌ట్రాలు: 13; మొత్తం: 20 ఓవర్లలో 242/6; వికెట్ల పతనం:** 1-20, 2-24, 3-50, 4-161, 5-161, 6-241; **బౌలింగ్:** షమి 3-0-33-1, సిమర్‌జీత్ సింగ్ 3-0-46-2, కమిన్స్ 4-0-60-0, అభిషేక్ శర్మ 2-0-17-0, ఆడమ్ జంపా 4-0-48-1, హర్షల్ పటేల్ 4-0-34-2.

విశాఖలో ఐపీఎల్ సమరం

రా.7.30 నుంచి

నేడు లఖ్‌నవూ X ఢిల్లీ



కెప్టెన్లు పంత్, అక్షర్

విశాఖపట్నం స్పోర్ట్స్ (ఆంధ్రజ్యోతి): కెప్టెన్లు మారారు.. జట్లలో కూడా భారీ ప్రక్షాళన జరిగింది. ఈనేపథ్యంలో తొలి మ్యాచ్‌లో విజయం సాధించడం ద్వారా ఈ ఐపీఎల్‌లో ఘనమైన బోణీ చేయాలని లఖ్‌నవూ సూపర్ జెయింట్స్, ఢిల్లీ క్యాపిటల్స్ భావిస్తున్నాయి. సోమవారం ఇక్కడి ఏసీఏ-వీడీసీఏ స్టేడియం వేదికగా జరిగే మ్యాచ్‌లో రిషభ్ పంత్ సారథ్యంలోని లఖ్‌నవూ, అక్షర్ పటేల్ కెప్టెన్సీలోని ఢిల్లీ జట్లు తలపడనున్నాయి. విశాఖ స్టేడియాన్ని రెండో హోం గ్రౌండ్‌గా ఎంచుకున్న ఢిల్లీ క్యాపిటల్స్ శుభారంభం చేసేందుకు ఉవ్విళ్లూరుతోంది. ఐపీఎల్ కెరీర్‌లో ఇప్పటివరకు ఢిల్లీకి ఆడిన పంత్..లఖ్‌నవూకు మారి సారథ్య బాధ్యతలు చేపట్టాడు. ఇక గత సీజన్‌లో సూపర్ జెయింట్స్‌కు కెప్టెన్‌గా వ్యవహరించిన కేఎల్ రాహుల్ ఢిల్లీ తరఫున కేవలం ఆటగాడిగా బరిలో దిగుతున్నాడు. అంతే కాదు.. రెండు జట్లూ సమూల ప్రక్షాళనతో ఐపీఎల్‌కు సిద్ధమయ్యాయి.

కొత్త ఫ్లడ్‌లైట్లతో స్టేడియం: ఆధునికీకరణలో భాగంగా ఏసీఏ-వీడీసీఏ స్టేడియాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. రూ. 8 కోట్లతో హాలోజన్ బల్బుల స్థానంలో ఎల్ఈడీ బల్బులను అమర్చారు.

పిచ్ పరిస్థితి: ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలోని పిచ్‌పై 200 పరుగుల వరకు స్కోరు సాధించే అవకాశాలున్నాయని నిపుణులు అంచనా వేస్తున్నారు. అలాగే మ్యాచ్‌కు టాస్ కూడా అత్యంత కీలకంగా మారుతుందని చెబుతున్నారు.

ఖేలో పారా క్రీడల్లో ఏపీకి ఏడు పతకాలు



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ఢిల్లీలో జరుగుతున్న ఖేలో ఇండియా పారా క్రీడల్లో ఆంధ్రప్రదేశ్ అథ్లెట్లు ఆదివారం ఒక్కరోజే ఏడు పతకాలు కొల్లగొట్టారు. ఇందులో 2 స్వర్ణాలు, 3 రజతాలు, 2 కాంస్యాలు ఉన్నాయి. లాంగ్‌జంప్‌లో బాలకృష్ణ, 200 మీటర్ల రేసులో లలితలకు స్వర్ణాలు దక్కగా.. 200 మీటర్లలో రవణి, లాంగ్‌జంప్‌లో స్వరాజ్, జావెలిన్ త్రోలో రవికి రజతాలు లభించాయి. 1500 మీటర్ల రేసులో నవీన్, షాట్‌పుట్‌లో పల్లవి కాంస్యాలు సాధించారు. ఇక, తెలంగాణ తరఫున షూటింగ్ 10 మీటర్ల ఈవెంట్‌లో శ్రీధర్ స్వర్ణం, పావని కాంస్యం అందుకున్నారు.

వీల్‌చైర్‌లో ఉన్నా.. వదలరు!

తన రిటైర్మెంట్‌పై ధోనీ



చెన్నై: టీమిండియా మాజీ కెప్టెన్ ధోనీకి ఇదే చివరి ఐపీఎల్ అనే ఊహాగానాలు బలంగా వినిపిస్తున్నాయి. అయితే, తన రిటైర్మెంట్‌పై వస్తున్న వార్తలను ధోనీ కొట్టిపడేశాడు. తాను ఆడాలనుకున్నంత కాలం ఆడతానని స్పష్టం చేశాడు. 'ఇది నా ఫ్రాంచైజీ. సీఎస్‌కేకు ఎంత కాలం ఆడాలనుకొంటే.. అంతకాలం ఆడతా. ఒకవేళ నేను వీల్‌చైర్‌లో ఉన్నా.. చెన్నై సూపర్ కింగ్స్ ఫ్రాంచైజీ వాళ్లు లాక్కెళ్లిపోతారు' అని సరదాగా ధోనీ వ్యాఖ్యానించాడు.

ప్రియాంక రికార్డు ప్రదర్శన



న్యూఢిల్లీ: భారత స్టార్ రేస్ వాకర్, కామన్వెల్త్ క్రీడల పతక విజేత ప్రియాంక గోస్వామి అంతర్జాతీయ వేదికపై రికార్డు ప్రదర్శనతో ఆకట్టుకుంది. స్లొవేకియాలోని డుడెన్స్‌లో ఆదివారం జరిగిన మహిళల 35 కిలోమీటర్ల రేసును ప్రియాంక 2 గంటలా 56 నిమిషాల 34 సెకన్లలో ముగించి 11వ స్థానంలో నిలిచింది. ఈ క్రమంలో ఆమె జాతీయ రికార్డును బద్దలు కొట్టింది. 2023లో మంజూరాణి నమోదు చేసిన 2 గంటలా 57 నిమిషాల 54 సెకన్ల రికార్డును ప్రియాంక అధిగమించింది.

మళ్లీ చిత్తుగా ఓడిన పాక్

నాలుగో టీ20లో 115 పరుగులతో కివీస్ గెలుపు

3-1తో సిరీస్ కైవసం



ఫిన్ అలెన్ (50)

మౌంట్ మాంగనుయ్: పేసర్లు జాకబ్ డఫీ (4/20), జకారి ఫౌల్క్స్ (3/25) నిప్పులు చెరగడంతో.. పాకిస్థాన్‌తో ఐదు టీ20ల సిరీస్‌ను ఆతిథ్య న్యూజిలాండ్ మరో మ్యాచ్ మిగిలుండగానే 3-1తో సొంతం చేసుకొంది. ఆదివారం జరిగిన నాలుగో టీ20లో కివీస్ 115 పరుగుల తేడాతో పాకిస్థాన్‌ను చిత్తు చేసింది. తొలుత న్యూజిలాండ్ నిర్ణీత 20 ఓవర్లలో 220/6 స్కోరు చేసింది. ఫిన్ అలెన్ (50), బ్రేస్‌వెల్ (46 నాటౌట్), సీఫెర్ట్ (44) దూకుడుగా ఆడారు. హరీస్ రౌఫ్ మూడు, అబ్రార్ అహ్మద్ రెండు వికెట్లు పడగొట్టారు. ఛేదనలో కివీస్ పేసర్ల దెబ్బకు పాక్ 16.2 ఓవర్లలో 105 పరుగులకే కుప్పకూలింది. అబ్దుల్ సమద్ (44), ఇర్ఫాన్ ఖాన్ (24) మినహా మిగతా బ్యాటర్లు ఎవరూ డబుల్ డిజిట్ స్కోరు సాధించలేక పోయారు.

చైనీస్ గ్రాండ్ ప్రీ విజేత ఆస్కార్



షాంఘై: మెక్‌లారెన్ డ్రైవర్ ఆస్కార్ పియాస్ట్రి ఫార్ములావన్ చైనీస్ గ్రాండ్ ప్రీలో చాంపియన్‌గా నిలిచాడు. ఆదివారం జరిగిన ఫైనల్ రేసును పోల్ పొజిషన్‌తో ఆరంభించిన ఆస్కార్.. అందరికంటే ముందంజలో నిలిచి టైటిల్ దక్కించుకున్నాడు. మెక్‌లారెన్‌కే చెందిన లాండో నోరిస్ రెండో స్థానం, మెర్సిడెస్ డ్రైవర్ జార్జ్ రస్సెల్ మూడోస్థానంతో పోడియం ఫినిష్ చేశారు. కాగా, గతేడాది విజేత, రెడ్‌బుల్ డ్రైవర్ మ్యాక్స్ వెర్‌స్టాపెన్ నాలుగోస్థానానికి పడిపోయాడు. ఆస్ట్రేలియాకు చెందిన 23 ఏళ్ల ఆస్కార్‌కు ఇది ఎఫ్1 కెరీర్‌లో మూడో విజయం.

తిప్పేసిన నూర్

మెరిసిన రచిన్

- గైక్వాడ్ అర్ధ శతకం
- 4 వికెట్లతో చెన్నై గెలుపు
- పోరాడి ఓడిన ముంబై
- విఘ్నేష్‌కు 3 వికెట్లు



రచిన్ రవీంద్ర (45 బంతుల్లో 65 నాటౌట్)



నూర్ అహ్మద్ (4-0-18-4)

చెన్నై: ఫామ్‌లో ఉన్న రచిన్ రవీంద్ర (45 బంతుల్లో 2 ఫోర్లు, 4 సిక్స్‌లతో 65 నాటౌట్), రుతురాజ్ గైక్వాడ్ (26 బంతుల్లో 6 ఫోర్లు, 3 సిక్స్‌లతో 53) అర్ధ శతకాలతోపాటు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' స్పిన్నర్ నూర్ అహ్మద్ (4/18) మాయాజాలంతో.. ఐపీఎల్‌లో చెన్నై సూపర్ కింగ్స్ బోణీ కొట్టింది. ఆదివారం జరిగిన మ్యాచ్‌లో చెన్నై 4 వికెట్ల తేడాతో ముంబై ఇండియన్స్‌పై గెలిచింది. దీంతో లీగ్‌లో తొలి మ్యాచ్‌లో ఓడే సంప్రదాయాన్ని ముంబై కొనసాగించింది. తొలుత ముంబై నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లకు 155 పరుగులు చేసింది. తిలక్ వర్మ (31), సూర్యకుమార్ యాదవ్ (29), దీపక్ చాహర్ (28 నాటౌట్) ఫర్వాలేదనిపించారు. ఖలీద్ అహ్మద్ మూడు వికెట్లు పడగొట్టాడు. ఛేదనలో చెన్నై 19.1 ఓవర్లలో 158/6 స్కోరు చేసి నెగ్గింది. స్పిన్నర్ విఘ్నేష్ పుతూర్ మూడు వికెట్లు పడగొట్టాడు. ఆంధ్ర పేసర్ సత్యనారాయణ రాజు, కేరళ స్పిన్నర్ విఘ్నేష్ లీగ్‌లో అరంగేట్రం చేశారు.

రచిన్ తుదికంటా..: ఛేదనలో ఓపెనర్ రాహుల్ త్రిపాఠి (2)ని దీపక్ రెండో ఓవర్‌లోనే అవుట్ చేశాడు. కానీ, మరో ఓపెనర్ రచిన్‌కు జత కలసిన కెప్టెన్ రుతురాజ్ ధాటిగా ఆడుతూ స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. ఆరో ఓవర్‌లో శాంట్నర్ బౌలింగ్‌లో రుతురాజ్ 6,4,4 బాదడంతో చెన్నై 62/1తో నిలిచింది. ఇదే జోరులో గైక్వాడ్ అర్ధ శతకం పూర్తి చేసుకొన్నాడు. అయితే, విఘ్నేష్ మధ్య ఓవర్లలో మూడు వికెట్లు పడగొట్టి చెన్నైకు ఝలక్ ఇచ్చాడు. తను బౌల్ చేసిన తొలి ఓవర్‌లోనే గైక్వాడ్‌ను క్యాచవుట్ చేయడంతో.. రెండో వికెట్‌కు 67 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. ధాటిగా ఆడే ప్రయత్నం చేసిన శివం దూబే (9), దీపక్ హుడా (3)ను కూడా అవుట్ చేసిన విఘ్నేష్.. ప్రత్యర్థిని ఒత్తిడిలోకి నెట్టాడు. సామ్ కర్రాన్ (4)ను జాక్స్ బౌల్డ్ చేయడంతో మ్యాచ్‌లో ఉత్కంఠ రేగింది. ఈ దశలో రచిన్‌కు జత కలసిన జడేజా (17) ఆరో వికెట్‌కు 36 పరుగుల భాగస్వామ్యంతో జట్టును గెలుపు ముంగిట నిలబెట్టాడు. మరోవైపు విఘ్నేష్ బౌలింగ్‌లో సిక్స్‌తో అర్ధ శతకం పూర్తి చేసుకొన్న రచిన్.. మరో భారీ షాట్ ఆడడంతో లక్ష్యం 12 బంతుల్లో 6 పరుగులకు దిగివచ్చింది. జడ్డూ రనౌట్ అయినా.. రచిన్ సిక్స్‌తో ఫినిషింగ్ టచ్ ఇచ్చాడు. ధోనీ క్రీజులోకి వచ్చినా ఖాతా తెరవలేకపోయాడు.

దెబ్బకొట్టిన నూర్: మిస్టరీ స్పిన్నర్ నూర్ మిడిలార్డర్ వెన్నువిరిచినా.. డెత్ ఓవర్లలో దీపక్ మెరుపులతో ముంబై గౌరవప్రద స్కోరు చేసింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ముంబైను ఖలీల్ వణికించాడు. తన వరుస ఓవర్లలో ఓపెనర్లు రోహిత్ శర్మ (0), ర్యాన్ రికెల్టన్ (13)ను పెవిలియన్ చేర్చాడు. విల్ జాక్స్ (11)ను అశ్విన్ క్యాచవుట్ చేయడంతో పవర్‌ప్లేలోనే మూడు టాపార్డర్ వికెట్లు చేజార్చుకొన్న ముంబై 36/3తో కష్టాల్లో పడింది. ఈ పరిస్థితుల్లో తాత్కాలిక కెప్టెన్ సూర్య, తిలక్.. నాలుగో వికెట్‌కు 51 పరుగుల భాగస్వామ్యంతో జట్టును ఆదుకొనే ప్రయత్నం చేశారు. ఎదుర్కొన్న తొలి రెండు బంతులను బౌండ్రీలకు తరలించిన తిలక్ జోరు చూపారు. సూర్య కూడా సిక్స్ బాదడంతో పవర్‌ప్లేను ముంబై 52/3తో ముగించింది. అయితే, మధ్య ఓవర్లలో స్పిన్నర్లు బౌలింగ్‌కు దిగడంతో వీరిద్దరూ స్ట్రయిక్ రొటేట్ చేస్తూ స్కోరు బోర్డును నడిపించారు. అయితే, నూర్ తన వరుస ఓవర్లలో సెటిల్డ్ బ్యాటర్లను అవుట్ చేసి గట్టిదెబ్బ కొట్టాడు. 11వ ఓవర్‌లో నూర్ బౌలింగ్‌లో సూర్య స్టంపౌట్ కాగా.. 13వ ఓవర్‌లో రాబిన్ మిన్జ్ (3), తిలక్‌లను నూర్ పెవిలియన్ చేర్చాడు. అప్పటికి ముంబై స్కోరు వంద మార్క్ కూడా దాటలేదు. ఎదురుదాడి చేసే ప్రయత్నం చేస్తున్న నమన్ ధిర్ (17)ను కూడా నూర్ బౌల్డ్ చేయడంతో ముంబై కనీసం పోరాడగలిగే స్కోరైనా చేస్తుందా? అనే అనుమానం కలిగింది. శాంట్నర్ (11)ను ఎలీస్ అవుట్ చేసినా.. చివర్లో బ్యాట్‌ను ఝుళిపించిన దీపక్ జట్టు స్కోరును 150 మార్క్ దాటించాడు.

13 ఐపీఎల్‌లో ఆరంభ మ్యాచ్‌ను ఓడడం ముంబై ఇండియన్స్‌కిది వరుసగా 13వ సారి. ముంబై చివరిగా తమ తొలి మ్యాచ్‌ను 2012లో గెలిచింది.

స్కోరుబోర్డు

ముంబై: రోహిత్ (సి) శివమ్ దూబే (బి) ఖలీల్ 0, రికెల్టన్ (బి) ఖలీల్ 13, విల్ జాక్స్ (సి) శివమ్ (బి) అశ్విన్ 11, సూర్యకుమార్ (స్టంప్డ్) ధోనీ (బి) నూర్ 29, తిలక్ (ఎల్బీ) నూర్ 31, రాబిన్ మిన్జ్ (సి) జడేజా (బి) నూర్ 3, నమన్ ధిర్ (బి) నూర్ 17, శాంట్నర్ (ఎల్బీ) ఎలిస్ 11, దీపక్ చాహర్ (నాటౌట్) 28, బౌల్ట్ (సి) రుతురాజ్ (బి) ఖలీల్ 1, సత్యనారాయణ రాజు (నాటౌట్) 1, **ఎక్స్‌ట్రాలు: 10; మొత్తం: 20 ఓవర్లలో 155/9; వికెట్ల పతనం:** 1-0, 2-21, 3-36, 4-87, 5-95, 6-96, 7-118, 8-128, 9-141; **బౌలింగ్:** ఖలీల్ అహ్మద్ 4-0-29-3, సామ్ కర్రాన్ 1-0-13-0, నాథన్ ఎలిస్ 4-0-38-1, అశ్విన్ 4-0-31-1, జడేజా 3-0-21-0, నూర్ అహ్మద్ 4-0-18-4.

చెన్నై: రచిన్ రవీంద్ర (నాటౌట్) 65, రాహుల్ త్రిపాఠి (సి) రికెల్టన్ (బి) దీపక్ చాహర్ 2, రుతురాజ్ (సి) జాక్స్ (బి) విఘ్నేశ్ 53, శివమ్ దూబే (సి) తిలక్ (బి) విఘ్నేశ్ 9, దీపక్ హుడా (సి) రాజు (బి) విఘ్నేశ్ 3, సామ్ కర్రాన్ (బి) జాక్స్ 4, జడేజా (రనౌట్) 17, ధోనీ (నాటౌట్) 0, **ఎక్స్‌ట్రాలు: 5; మొత్తం: 19.1 ఓవర్లలో 158/6; వికెట్ల పతనం:** 1-11, 2-78, 3-95, 4-107, 5-116, 6-152; **బౌలింగ్:** బౌల్ట్ 3-0-27-0, దీపక్ చాహర్ 2-0-18-1, సత్యనారాయణ రాజు 1-0-13-0, శాంట్నర్ 2.1-0-24-0, విల్ జాక్స్ 4-0-32-1, విఘ్నేశ్ పుతూర్ 4-0-32-3, నమన్ ధిర్ 3-0-12-0.



విజయనగరం జిల్లా నెల్లిమర్ల-గుర్ల మధ్య చంపావతి నది వంతెన కింద ఇన్‌ఫిల్టర్ బావి వద్ద మురుగునీరు, వ్యర్థాలు

కలుషిత నీటితో డయేరియా

విజయనగరం జిల్లాలోని చంపావతి, గోస్తాని, వంశధార, వేగావతి నదులు వందలాది గ్రామాలకు తాగు, సాగునీరు అందిస్తున్నాయి. ప్రస్తుతం ఈ నదులు కాలుష్య కోరల్లో చిక్కుకున్నాయి. పశువుల కళేబరాలు, మృతదేహాలను ఈ నదుల్లో పూడ్చిపెడుతున్నారు. గ్రామాల్లో మురుగునీటితో పాటు గ్రామాల్లో సేకరించిన వ్యర్థాలను నదుల్లో పడేస్తున్నారు. దీంతో పరివాహక ప్రాంత గ్రామాల ప్రజల దాహం తీర్చే ఇన్‌ఫిల్టర్ బావుల వద్ద జలాలు కలుషితమై పోతున్నాయి. ఇక్కడి నుంచి గ్రామాలకు సరఫరా అయ్యే నీరు తాగి చాలామంది అస్వస్థతకు గురవుతున్నారు. ఇటీవల చంపావతి పరివాహక ప్రాంతమైన గుర్ల, జమ్ము, కొటగం డ్రేడు గ్రామాల ప్రజలు కలుషితమైన నది నీరు తాగి డయేరియా బారిన పడ్డారు. ఇక బొబ్బిలి నియోజకవర్గ పరిధిలోని వేగావతి నదిలో ఇసుకను తోడేస్తున్నారు.



కర్నూలులో ఓల్డ్ పంప్‌హౌస్ దగ్గర తుంగభద్రలో కలుస్తున్న మురుగు

అయ్యో.. తుంగభద్ర!

కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్ అధికారుల నిర్లక్ష్యంతో తుంగభద్ర నది కాలుష్య కోరల్లో చిక్కుకుంది. కర్నూలుకు ఆనుకొని ప్రవహిస్తున్న తుంగభద్రలో.. నగర పరిసరాల్లో ఎటు చూసినా మురుగు నీరే. కర్నూలులోని ఓల్డ్ పంప్‌హౌస్, రోజాదర్గా, సంకల్బాగ్, సాయిబాబా టెంపుల్, బండిమెట్ట, రాంబోట్ల టెంపుల్ ప్రాంతాలు సహా 14 చోట్ల మురుగు నీటిని నేరుగా తుంగభద్రలోకి వదిలేస్తున్నారు. అలాగే.. కల్లూరు, కల్లూరు ఎస్టేట్, దేవానగర్, కృష్ణానగర్, చెన్నమ్మ సర్కిల్ తదితర కాలనీలకు చెందిన మురుగు నీరు హంద్రీనది, వక్కలేరు వాగుల్లో కలిసి.. జొహరాపురం బ్రిడ్జి సమీపంలో తుంగభద్ర నదిలో కలుస్తోంది. కాలుష్య నియంత్రణ మండలి అధికారులు నదిలో మురుగునీటి నమూనాలు సేకరించి పరీక్షలకు పంపగా.. విషపూరితాలు ఉన్నట్లుగా తేలినట్లు సమాచారం. నగర జనాభా 6 లక్షలు పైమాటే. తాగునీటి కోసం రోజుకు 75 మిలియన్ లీటర్లు (ఎంఎల్‌డీ) సరఫరా చేస్తే.. అందులో 80 శాతం అంటే 60 ఎంఎల్‌డీ నీరు మురుగుగా డ్రైనేజీల ద్వారా తుంగభద్రలో కలుస్తోందని ఇంజనీర్లు చెబుతున్నారు. ఇక కర్నూలు, నంద్యాల, కడప జిల్లాల జీవనాడి కేసీ కాలువ.. కర్నూలు నగరం మధ్యలో ప్రవహిస్తోంది. పలు ప్రాంతాల్లో మురుగునీటిని కేసీ కెనాల్‌లో వదిలేస్తున్నారు.

నది పక్కనే డంపింగ్ యార్డు

అనకాపల్లి జిల్లాలో తాగునీటి వనరు అయిన వరహా నది పక్కనే డంపింగ్ యార్డు ఉంది. నర్సీపట్నం మండలం బలిఘట్టం వద్ద నదిని ఆనుకొని 2017లో ఘన వ్యర్థ పదార్థాల నిర్వహణ యూనిట్ ఏర్పాటు చేశారు. డంపింగ్ యార్డు కోసం నిర్మించిన ప్రహరీ అక్కడక్కడ కూలిపోవడంతో చెత్తాచెదారం బయటకు వచ్చి వరహా నదిలో కలుస్తోంది. వర్షాలు కురిసినపుడు చెత్త తడిచి డంపింగ్ యార్డులోని మురుగునీరు నదిలో కలుస్తుంది. డంపింగ్ యార్డు కారణంగా తాగునీరు కలుషితం అవుతోందని, అక్కడి నుంచి వేరే ప్రదేశానికి తరలించాలని ఇటీవల మునిసిపల్ కౌన్సిల్ సమావేశం దృష్టికి కౌన్సిలర్ తీసుకువచ్చారు.



అనకాపల్లి జిల్లాలో వరహా నదిని ఆనుకొని ఉన్న డంపింగ్ యార్డు

నదులు.. విలవిల!

వ్యర్థాలు, మురుగునీటితో జలాలు కలుషితం.. సిక్కోలు నుంచి 'అనంత' వరకు ఇదే దుస్థితి

కాలుష్య కోరల్లో గోదావరి, కృష్ణా, తుంగభద్ర.. గ్రామాలు, కాలనీల నుంచి మురుగు నదుల్లోకి

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

నదీ తీరాలు.. మానవ నాగరికతకు పునాదులు. ఆదిమ మానవుడు వ్యవసాయం నేర్చుకుని ఆధునికత దిశగా అడుగులు వేయడానికి బాటలు వేసిన జలజీవధారలు. మన పూర్వీకుల నుంచి నదీమ తల్లులను దేవతామూర్తులుగా భావించి పూజించడం భారతీయ సంస్కృతి. అంతటి విశిష్టత ఉన్న నదులను.. నేడు చెత్తబుట్టల్లా మార్చేస్తున్నారు. తాగు, సాగునీటితో పాటు విద్యుత్ కాంతులు అందిస్తున్న నదులను కాలుష్య కోరల్లోకి నెట్టేస్తున్నారు. టన్నుల కొద్దీ వ్యర్థాలను కుమ్మరిస్తున్నారు. ఇళ్లు, గ్రామాలు, కాలనీల నుంచి మురుగునీటిని నేరుగా నదుల్లో కలిపేస్తున్నారు. పలు పట్టణాలు, నగరాల్లో ప్లాంట్లలో శుద్ధి చేయకుండా డ్రైనేజీ అవుట్ లెట్లు నదుల్లోకి కలిపేశారు. మన రాష్ట్రంలో వంశధార నుంచి గోదావరి, కృష్ణా, తుంగభద్ర.. ఇటు చివరన చిత్రావతి వరకు నదులన్నింటినీ కలుషితం చేసేస్తున్నారు. డ్రైనేజీలలో ప్రవహించే నీటిని మురుగునీటి శుద్ధి కేంద్రాల్లో శుద్ధి చేశాక సాగు, ఇతర అవసరాలకు వినియోగించాలి. కానీ చాలా చోట్ల ప్లాంట్లు ఏర్పాటు చేయలేదు. ఉన్నవి కూడా నామమాత్రంగా పనిచేస్తున్నాయి. మురుగునీటిని నేరుగా నదుల్లోకి వదిలేస్తున్నారు. ఫలితంగా తాగే నీరు, కాలువల ద్వారా పంటలకు అందించే సాగు నీరు విషతుల్యంగా మారుతున్నాయి. కొన్నిచోట్ల తాగడానికి కాదు కదా కనీసం స్నానం చేయడానికి కూడా పనికి రాని పరిస్థితి. చాలా చోట్ల నదీ పరివాహక గ్రామాల్లోని భూగర్భ జలాలూ కలుషితమవుతున్నాయి. కొన్నిచోట్ల బోర్లు, బావుల్లో నీరు ఉప్పగా మారుతోంది. నాడు మానవ నాగరికతకు దోహదపడ్డ నదులు నేడు తన సహజ స్వరూపాన్ని కోల్పోయి వ్యర్థాలు, మురుగుతో నిండిపోయాయి. ప్రజల బాధ్యతారాహిత్యం, అధికారుల నిర్లక్ష్యం, నాయకుల అలసత్వమే ఇందుకు కారణం. ఎన్నో ఏళ్లుగా ఇదే పరిస్థితి కొనసాగుతోంది. ఈ పరిస్థితి మారకపోతే 'భవిష్యత్' మరింత దారుణంగా ఉండే ప్రమాదముంది. రాష్ట్రంలోని నదుల దుస్థితిపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.



మురుగు, చెత్తతో అధ్వానంగా ఉన్న తాండవ నది

నదిలోకి డ్రైనేజీ అవుట్ లెట్లు

అనకాపల్లి, కాకినాడ జిల్లాల సరిహద్దున తాండవ నది పరిస్థితి ఇది. ఇటు పాయకరావుపేట పంచాయతీ, అటు తుని మునిసిపాలిటీ డ్రైనేజీల అవుట్ లెట్లు ఏర్పాటు చేయడంతో కలుషితమవుతోంది. ఆ నీరు ఇంకి భూగర్భ జలాలు కూడా కలుషితం కావడంతో ప్రజలు రోగాల బారినపడుతున్నారు. పాయకరావుపేట, తుని నియోజకవర్గాల్లో సుమారు 18 వేల ఎకరాలకు సాగునీరందించాలన్న లక్ష్యంతో 2009లో పాయకరావుపేట వద్ద తాండవ నదిపై ఆనకట్టలు నిర్మించారు. పాయకరావుపేట పంచాయతీ, తుని మునిసిపాలిటీల మురుగు కాలువల అవుట్ లెట్లు ఎక్కడికక్కడ నదిలోకి పెట్టడంతో ఆనకట్టల మధ్య స్టోరేజీ ఏరియాలో ఉన్న నీరు మురికిగా మారుతోంది. దీనికితోడు ఈ రెండు పట్టణాల ప్రజలు చెత్తను నదిలో పారేస్తున్నారు. నదీ పరివాహక ప్రాంతాల్లో బోర్లు, బావుల్లో నీరు ఉప్పగా మారుతోంది.



ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం ఫెర్రీ ఘాట్ వద్ద ప్రధాన డ్రైనేజీ ద్వారా మురుగు నీరు కృష్ణా నదిలో కలుస్తున్న దృశ్యం

కాలుష్య కృష్ణా!

పదమూడు లక్షల ఎకరాల ఆయకట్టుకు జీవనాధారం... ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు, పల్నాడు జిల్లాల దాహార్తిని తీరుస్తున్న కృష్ణా నది కాలుష్యం కోరల్లో చిక్కుకుంది. రాష్ట్ర విభజన తర్వాత టీడీపీ ప్రభుత్వ హయాంలో స్వచ్ఛ కృష్ణా కార్యక్రమానికి పిలుపునివ్వటంతో.. చాలావరకు నదీ కాలుష్యాన్ని అరికట్టారు. అయితే మేజర్ గ్రామ పంచాయతీల అలసత్వం, విజయవాడ మునిసిపల్ కార్పొరేషన్ అధికారుల నిర్వాకం కారణంగా పలుచోట్ల మురుగునీరు కృష్ణా నదిలో కలుస్తోంది. ఇబ్రహీంపట్నం ఫెర్రీ దగ్గర భారీ అవుట్ ఫాల్ డ్రెయిన్ నేరుగా నదిలో కలుస్తోంది. ఈ డ్రెయిన్ క్యాచ్‌మెంట్ పరిధిలో ఉన్న పశ్చిమ ఇబ్రహీంపట్నం, ఫెర్రీ డౌన్ ఏరియా, ఆర్టీసీ కాలనీల నుంచి వచ్చే మురుగు నీరంతా కూడా కృష్ణా నదిలో కలుస్తోంది. తుమ్మలపాలెం దగ్గర మరో మైనర్ డ్రెయిన్ నుంచి మురుగునీరు నేరుగా కృష్ణా నదిలోకి కలుస్తోంది. ప్రకాశం బ్యారేజీ దిగువ ప్రాంతాలలో విజయవాడ నగర పరిధిలో రెండు చోట్ల అవుట్ ఫాల్ డ్రైనేజీల నుంచి నేరుగా కృష్ణానదిలోకి కలుస్తోంది. రాణిగారితోటలో మురుగునీటితో పాటు చెత్త కూడా కొట్టుకువస్తూ కృష్ణానదిలో కలుస్తుంది. విజయవాడ తూర్పు నియోజకవర్గం పరిధిలో పిన్నమనేని పాలీ క్లినిక్ రోడ్డు, బెంజ్ సర్కిల్ ఏరియా, ఎన్టీఆర్ సర్కిల్ ఏరియాల నుంచి వచ్చే మురుగునీరు కృష్ణవేణి రోడ్డు మీదుగా పటమట దర్శిపేట, అంబేడ్కర్ నగర్‌ల మీదుగా కృష్ణా నదిలో కలుస్తోంది. విజయవాడ నగరంలో కాల్వ గట్లపై ఉన్న ఇళ్లలో మురుగుదొడ్లలోని వ్యర్థాలు నేరుగా కాల్వలలోకి వదులుతున్నారు. నగరంలోని బందరు కాల్వ, ఏలూరు కాల్వలపై ఇలాంటి పరిస్థితి ఉంది. ఇదే నీటిని దిగువ ప్రాంతాల వారికి తాగునీటి కోసం చెరువులను నింపుతారు.

మురుగునీరే తాగునీరు



ఏలూరు నవాబ్‌పేట కాలనీ వద్ద కృష్ణా కాలువ దుస్థితి

ఏలూరు నగరానికి ప్రధాన తాగునీటి వనరు గోదావరి, కృష్ణా కాల్వలు. ఈ కాల్వల్లో నీటిని తాగునీటిగా మార్చి సరఫరా చేస్తున్నారు. ఈ కాల్వలను ఎప్పుడూ శుభ్రం చేయరు. పిచ్చి మొక్కలు, నాచు, తూడుతో నీళ్లన్నీ దుర్వాసన వెదజల్లుతుంటాయి. ఈ కాల్వల్లోనే ప్రజలు చెత్తా చెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలు, హోటళ్ల యజమానులు కుళ్లిన వ్యర్థాలన్నీ విసిరేస్తుంటారు. పందులు, కుక్కలు, ఇతర జంతువుల కళేబరాలు కొట్టుకొస్తుంటాయి. ఈ నీటిని శుద్ధి చేయడానికి మురుగునీటి శుద్ధి కేంద్రాలు ఏలూరులో నిర్మించలేదు. ముఖ్యంగా కృష్ణా కాల్వ నుంచి ఏలూరు పంపుల చెరువు నింపుతారు. మున్సిపల్ అధికారులు క్లోరిన్, ఫిల్టర్ బెడ్స్ ద్వారా శుద్ధి చేసి మాత్రమే తాగునీటిని సరఫరా చేస్తుంటారు. ఇది సురక్షితం కాదు. దీంతో ఏలూరు నగర ప్రజలు తరచూ అనారోగ్యాల పాలవుతున్నారు. నాలుగేళ్ల క్రితం వింత వ్యాధితో ఎంతో మంది అస్వస్థతకు గురయ్యారు. దీనికి కారణం శుద్ధి చేయని నీరేనని కొన్ని జాతీయ ప్రయోగశాలలు నివేదికలు ఇచ్చాయి. అయినా నగర పాలక సంస్థ అధికారులు... కాల్వల్లో వ్యర్థాలు వేయవద్దని చాటింపులు వేయడం, బోర్డులు పెట్టడం మినహా ఎలాంటి చర్యలూ తీసుకోలేదు. దెందులూరు వద్ద 117 ఎకరాల్లో తాగునీటిని అందించేందుకు చెరువును తవ్వారు. ఈ రెండు ట్యాంకుల ద్వారా నగరంలోని మూడు లక్షల మంది జనాభాకు తాగునీటిని సరఫరా చేస్తున్నారు. దశాబ్దాల తరబడి ప్రజలు తాగునీటి సమస్య ఎదుర్కొంటున్నారు.

గోదారంతా అపవిత్రం!



తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరం రామపాదాల రేవు వద్ద గోదావరి గట్టుపై పేరుకుపోయిన వ్యర్థాలు

తూర్పుగోదావరి జిల్లాలో చారిత్రక రాజమహేంద్రవరంలో పవిత్ర గోదావరి తీరం అపవిత్రమవుతోంది. నగరంలో చెత్తంతా తీసుకొచ్చి గోదావరిలో పడేస్తున్నారు. అలాగే నగరంలోని మురుగునీరు గోదావరి నదిలో కలుస్తోంది. అదే గోదావరి నీటిని ప్రజలు తాగుతున్నారు. లక్షల మంది జీవించే రాజమహేంద్రవరంలో వాడకపు నీటిని పంపించడానికి ఏళ్ల తరబడి చేస్తున్న ప్రయత్నాలు పూర్తిగా ఫలించలేదు. అధికశాతం మురుగునీరు నల్లా చానల్ గుండా నేరుగా గోదావరిలో కలిసేది. అయితే ప్రస్తుతం గేట్లు మూసేసి ఈ చానల్‌లో నీటిని ఆవలో ఉన్న ఎస్‌టీపీకి పంపిస్తున్నారు. అక్కడ నామమాత్రంగా శుద్ధి అవుతోంది. మురుగునీరు ఆవ చానల్ గుండా ధవళేశ్వరం సాయిబాబా గుడి సమీపంలో గోదావరిలో కలుస్తోంది. దీనివల్ల కాలువలకు వెళ్లే నీరు కలుషితం అవుతోంది. రాజమహేంద్రవరంలో నల్లా చానల్‌తో పాటు పుష్కర ఘాట్ సమీపంలోనూ, మార్కండేయ స్వామి గుడి సమీపంలోనూ అవుట్ లెట్లు గోదావరిలోకే ఉన్నాయి. కోటిలింగాల ఘాట్ వద్ద కూడా ఒకటి ఉంది. దీంతో మొత్తం గోదావరి ఘాట్లన్నీ మురుకుగా మారుతున్నాయి. పేపరు మిల్లు వ్యర్థాలు ఎగువ భాగంలోని వెంకటనగర్ లంక భూముల్లో పంపింగ్ చేస్తారు. ఇక్కడ నుంచి చాలా మురుగునీరు వస్తుంటుంది.



శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తిలో చిత్రావతి నదిలోకి పారుతున్న మురుగునీరు

నది, చెరువూ కలుషితం

శ్రీసత్యసాయి జిల్లాలో అతిపెద్ద నది చిత్రావతి. అతి పెద్దచెరువు బుక్కపట్నం చెరువు. సత్యసాయి నడయాడిన చిత్రావతి నదిని భక్తులు పరమ పవిత్రంగా భావిస్తారు. అలాంటి నదిలోకి పుట్టపర్తి పట్టణ పరిధిలోని మురుగునీరు చేరుతోంది. నది నుంచి నీరు బుక్కపట్నం చెరువులోకి వెళుతుంది. తద్వారా నది, చెరువు నీరు కలుషితమవుతున్నాయి. పుట్టపర్తి, కొత్తచెరువు, బుక్కపట్నం ప్రాంతాలకు తాగునీరు అందించే మంచినీటి పథకాలు చిత్రావతి, బుక్కపట్నం చెరువులో ఉన్నాయి. కలుషిత నీటి కారణంగా రోగాలు ప్రబలుతాయనే భయం ప్రజలను వెంటాడుతోంది. పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలో భూగర్భ డ్రైనేజీ నీటిని కర్నాటక నాగేపల్లి వద్ద ఉన్న శుద్ధిచేసే ప్లాంటుకు తరలిస్తారు. అక్కడ మురుగు నీటిని శుద్ధి చేసి పొలాలకు సరఫరా చేస్తారు. కానీ పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలోని సాయినగర్ డ్రైనేజీ వాటర్ పంపింగ్ ప్లాంటు సరిగా పనిచేయడం లేదు. దీంతో మురుగునీటిని చిత్రావతిలోకి వదులుతున్నారు. సత్యసాయి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ప్రాంతంలో ప్రశాంతి గ్రామం వద్ద ఉన్న మురుగునీటి పంపింగ్ ప్లాంట్ సైతం పనిచేయడం లేదు. దీంతో అక్కడి మురుగునీరు బుక్కపట్నం చెరువులో చేరుతోంది.

15-20 తేదీల మధ్య

అమరావతికి ప్రధాని?

- 250 ఎకరాల్లో భారీ బహిరంగ సభ
- వెలగపూడి సచివాలయం వెనుక ఎన్-9 రోడ్డు సమీపాన ఏర్పాటు
- రాజధానికి మోదీ వరాలిస్తారని రైతుల్లో ఆశలు



ప్రధాని మోదీ సభ కోసం సిద్ధం చేస్తున్న ప్రాంగణమిదే

మంగళగిరి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): నవ్యాంధ్ర రాజధాని అమరావతికి శంకుస్థాపన చేసిన ప్రధాని మోదీ.. పునర్నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టడానికి మరోసారి రానున్నారు. సుమారు రూ.42 వేల కోట్ల విలువైన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసేందుకు రావాలని సీఎం చంద్రబాబు ఆయన్ను ఆహ్వానించారు. ఈ ఆహ్వానాన్ని ప్రధాని కార్యాలయం (పీఎంవో) వర్గాలు ఆమోదించినప్పటికీ.. నిర్దిష్టమైన తేదీని ఖరారు చేయలేదు. అయితే ఏప్రిల్ 15-20 తేదీల నడుమ ఏదో ఒక రోజు ఆయన వస్తారని రాష్ట్రప్రభుత్వం ఇప్పటికే వెల్లడించింది. అధికారిక షెడ్యూల్ విడుదల కానప్పటికీ భారీ బహిరంగ సభ ఏర్పాటుకు సన్నాహాలు మొదలుపెట్టింది. వెలగపూడిలోని సచివాలయ భవన సముదాయానికి వెనుకవైపు ఎన్-9 రోడ్డుకు పశ్చిమంగా ఉన్న ప్రాంతాన్ని సిద్ధం చేస్తున్నారు. ఇందుకోసం సదరు ప్రాంగణాన్ని ఆదివారం నుంచి చదును చేయడం మొదలుపెట్టారు. సుమారు 16 పొక్లయిన్లు, 4 భారీ క్రేన్లు, 6 ట్రక్కులతో పనులు పెద్దఎత్తున మొదలుపెట్టారు. ఈ నెల 30వ తేదీన ఈ ప్రాంతంలోనే 30-40 ఎకరాల్లో ఉగాది ఉత్సవాలు నిర్వహించనున్నారు. ప్రధాని సభను కూడా ఇక్కడే ఏర్పాట్లు చేసే ఉద్దేశంతో విస్తీర్ణాన్ని 250 ఎకరాలకు పెంచి ఇప్పటి నుంచే సంబంధిత పనులు మొదలుపెట్టారు. ఇంకోవైపు.. తమకు మేలు చేకూర్చే విధంగా రాజధానిపై ప్రధాని మరిన్ని వరాలు ప్రకటిస్తారని రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

ఈదురుగాలుల బీభత్సం

అకాల వర్షానికి దెబ్బతిన్న పంటలు.. శ్రీసత్యసాయి జిల్లా గంజివారిపల్లెలో 33.25 మి.మీ. వాన

- అనంతలో ఉద్యాన పంటలకు రూ.36.11 కోట్ల నష్టం
- కడప జిల్లాలో 2455 ఎకరాల అరటి పంట నేలమట్టం
- బెంగళూరులో విమానాల రాకపోకలకు అంతరాయం
- పంట నష్టం అంచనా వేయండి: మంత్రి అచ్చెన్న

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)



కడప జిల్లా తాతిరెడ్డిపల్లెలో నేలకొరిగిన అరటి తోట




అనంతపురం జిల్లా పుట్లూరు మండలంలో ఈదురుగాలులకు విరిగిపడిన బొప్పాయి చెట్లు

అకాల వర్షానికి ఈదురుగాలులు తోడవడంతో రాష్ట్రంలోని కొన్ని జిల్లాల్లో పంటలకు నష్టం వాటిల్లింది. ఉమ్మడి అనంతపురం జిల్లాలోని పలు మండలాల్లో శనివారం సాయంత్రం ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. రూ.36.11 కోట్ల విలువైన పలు రకాల ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయి. పంట కోత దశలోని అరటి, బొప్పాయితోపాటు మామిడి, మొక్కజొన్న పంటలకు నష్టం వాటిల్లింది. అనంతపురం జిల్లా పుట్లూరు, యల్లనూరు, యాడికి, శింగనమల మండలాల్లోని 557.20 హెక్టార్లలో రూ.34.82 కోట్ల విలువైన అరటి పంట దెబ్బతింది. అలాగే, 2 హెక్టార్లలో రూ.7.50 లక్షల విలువైన బొప్పాయి, రూ.లక్ష విలువైన మామిడి పంట దెబ్బతిన్నాయి. యల్లనూరు, పుట్లూరు మండలాల్లో 35 హెక్టార్లలో రూ.30.09 లక్షల విలువైన మొక్కజొన్న దెబ్బతింది. శ్రీసత్యసాయి జిల్లా తాడిమర్రి, ముదిగుబ్బ మండలాల్లో 110.5 హెక్టార్లలో చేతికొచ్చిన రూ.1.20 కోట్ల విలువైన అరటి పంట దెబ్బతింది. కడప జిల్లా పులివెందుల నియోజకవర్గంలోని లింగాల మండలంలో శనివారం రాత్రి దాదాపు గంటపాటు వీచిన ఈదురుగాలులకు వడగండ్లు కూడా తోడవడంతో అరటి తోటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. దిగుబడులు వచ్చే సమయానికి పంట నేలమట్టమైందని రైతులు వాపోతున్నారు. లింగాల మండలంలో దాదాపు 2455 ఎకరాల్లో పంట నష్టం జరిగిందని ఉద్యానశాఖ అధికారి రాఘవేంద్రరెడ్డి తెలిపారు. దాదాపు రూ.20 కోట్ల మేర నష్టం వాటిల్లినట్లు అంచనా వేశామన్నారు. నష్ట నివేదికను ప్రభుత్వానికి పంపిస్తామని తెలిపారు. బెంగళూరు అంతర్జాతీయ విమానాశ్రయ ప్రాంతంలో వర్షం కురవడంతో విమానాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. శనివారం రాత్రి పలు విమానాలు ఆలస్యంగా రాకపోకలు సాగించినట్లు విమానాశ్రయ అధికారులు తెలిపారు. శనివారం రాత్రి కురిసిన వర్షం బెంగళూరులో విమానాల ల్యాండింగ్, టేకాఫ్‌పై ప్రభావం చూపిందని ఇండిగో సంస్థ 'ఎక్స్'లో తెలిపింది. సూక్ష్మంగా గమనిస్తున్నామని, ఎప్పటికప్పుడు సమాచారం పంపుతామని పేర్కొంది. ప్రయాణాల్లో మార్పులు అవసరం అనుకుంటే వెబ్‌సైట్ ద్వారా రీబుకింగ్‌ను ఎంపిక చేసుకోవచ్చని తెలిపింది. ఎయిరిండియా కూడా ఇలాంటి అభిప్రాయాన్నే వ్యక్తం చేసింది. ప్రయాణికులు ఎయిర్‌పోర్టుకు వెళ్లేముందు విమానం స్టేటస్‌ను పరిశీలించాలని 'ఎక్స్'లో పోస్ట్ చేసింది. బెంగళూరులో కొన్ని రోడ్లపై వర్షం నీరు చేరి, ట్రాఫిక్ స్తంభించిన అంశాలను ప్రస్తావించింది. విమానాశ్రయానికి వెళ్లే మార్గంలో హుణసమారనహళ్ళి వద్ద రోడ్డుపై భారీగా వర్షం నీరు నిలవడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఆదివారం తెల్లవారుజాము నుంచి విమానాలు యథాతథంగా రాకపోకలు సాగించాయి. వడగళ్ల వానతో జరిగిన పంట నష్టాన్ని వెంటనే అంచనా వేయాలని వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయి అధికారులు రైతులకు అందుబాటులో ఉండి, తగిన సూచనలు చేయాలని ఉద్యాన శాఖ అధికారులను నిర్దేశించారు.

నేడూ ఈదురుగాలులు.. వడగళ్ల వాన ముప్పు

విదర్భ నుంచి మధ్య మహారాష్ట్ర, కర్ణాటక మీదుగా కేరళ వరకు ఉపరితల ద్రోణి విస్తరించింది. మరోవైపు బంగాళాఖాతంలో కొనసాగుతున్న అధికపీడనం ప్రభావంతో సముద్రం నుంచి భూఉపరితలంపైకి తేమగాలులు వీస్తున్నాయి. వీటికి వాయవ్య భారతం నుంచి వీచే పొడిగాలులు కలుస్తున్నాయి. వీటన్నింటి ప్రభావంతో రాయలసీమ, కోస్తాలో వాతావరణంలో అనిశ్చితి నెలకొని పలుచోట్ల తేలిక పాటి నుంచి మోస్తరు వర్షాలు కురిశాయి. అక్కడక్కడ గాలులు వీచాయి. శ్రీసత్యసాయి జిల్లా గంజివారిపల్లెలో 33.25 మి.మీ., అన్నమయ్య జిల్లా వలసపల్లెలో 29.75 మి.మీ.ల వర్షపాతం నమోదైంది. రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో ఆదివారం మేఘాలు ఆవరించడంతో ఎండ తీవ్రత స్వల్పంగా తగ్గింది. రానున్న 24 గంటల్లో రాయలసీమ, కోస్తాలో అక్కడక్కడ ఉరుములు, ఈదురుగాలులుతో వర్షాలు కురుస్తాయని, ఒకటి, రెండుచోట్ల వడగళ్ల వాన కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది.

రైతులను ఆదుకుంటాం: సీఎం



అమరావతి, మార్చి 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వడగళ్లతో కూడిన అకాల వర్షాలకు పంట నష్టపోయిన రైతులను ఆదుకుంటామని, రైతులెవరూ ఆందోళన చెందవద్దని సీఎం చంద్రబాబు భరోసా ఇచ్చారు. బాధిత రైతులకు ప్రభుత్వ పరంగా సాయం అందించాలని అధికారులను ఆదేశించారు. పంట నష్టంపై ఆదివారం రాత్రి సీఎం సమీక్షించారు. అనంతపురం జిల్లా యల్లనూరు మండలం వీర్లంపల్లిలో ఇద్దరు అరటి రైతుల ఆత్మహత్యాయత్నంపై మంత్రి అచ్చెన్నాయుడు, జిల్లా కలెక్టర్, వ్యవసాయ అధికారులతో సీఎం మాట్లాడారు. ప్రస్తుతం ఇద్దరు రైతుల పరిస్థితి కాస్త మెరుగ్గా ఉందని, ప్రాణాపాయం తప్పిందని అధికారులు సీఎంకు చెప్పారు. మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలిస్తున్నట్లు వివరించారు. వడగళ్ల వానతో పాటు ఈదురు గాలుల కారణంగా కడప, అనంతపురం, శ్రీసత్యసాయి, ప్రకాశం జిల్లాల్లో 10 మండలాల్లోని 40 గ్రామాల్లో పంట నష్టం జరిగినట్లు ఉద్యాన శాఖ డైరెక్టర్ శ్రీనివాసులు సీఎంకు తెలిపారు. మొత్తం 1,364 మంది రైతులకు చెందిన 1,670 హెక్టార్లలో ఉద్యాన పంటలకు నష్టం వాటిల్లినట్లు క్షేత్రస్థాయి సందర్శనలో గుర్తించినట్లు తెలిపారు. అనంతపురం జిల్లాలో రెండు మండలాల్లో 47 మంది రైతులకు చెందిన 35హెక్టార్లలో మొక్కజొన్న గాలుల వల్ల దెబ్బతిన్నట్లు వ్యవసాయ శాఖ డైరెక్టర్ డిల్లీరావు తెలిపారు.

27న పోలవరానికి సీఎం

ఏలూరు, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ నెల 27న పోలవరం ప్రాజెక్టును సందర్శించనున్నారు. ఇప్పటి వరకు జరిగిన, జరుగుతున్న, పెండింగ్‌లో ఉన్న పనులపై సమీక్షిస్తారు. 25, 26వ తేదీల్లో కలెక్టర్ల సమావేశం పూర్తి చేసుకుని.. మర్నాడే పోలవరం వస్తుండడం గమనార్హం.


అమృత్‌సర్‌లోని స్వర్ణ దేవాలయం వద్ద మంత్రి లోకేశ్, బ్రాహ్మణి, దేవాన్ష్

అందరూ బాగుండాలని ప్రార్థించా: లోకేశ్

అమరావతి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): మంత్రి లోకేశ్ తన భార్య బ్రాహ్మణి, తనయుడు దేవాన్ష్‌లతో కలిసి ఆదివారం పంజాబ్‌లోని అమృత్‌సర్‌లో ఉన్న స్వర్ణ దేవాలయాన్ని సందర్శించారు. ఈ మేరకు తన 'ఎక్స్' ఖాతాలో ఫొటోలు పంచుకున్నారు. అందరూ సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో ఆనందంగా ఉండాలని ప్రార్థించానన్నారు. వారు అక్కడి కొలను, లంగర్ (అన్నదాన సత్రం)ను కూడా సందర్శించారు.

'కొవ్వూరు కంఠకుల'పై విచారణ

- మట్టి, ఇసుక తవ్వకాలపై నిఘా.. 'ఆంధ్రజ్యోతి' కథనంపై అధికారుల వివరణ

రాజమహేంద్రవరం మార్చి 23(ఆంధ్రజ్యోతి): "కొవ్వూరులో కంఠకులు" శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురించిన కథనంపై తూర్పుగోదావరి జిల్లా యంత్రాంగం స్పందించింది. గతంలో వాడపల్లి వన్ ర్యాంప్ నుంచి రోజుకు 250 లారీలు వెళ్లిన మాట వాస్తవమేనని, ప్రస్తుతం కొవ్వూరు మండలం పరిధిలోని అన్ని ర్యాంప్‌ల నుంచి 190 లారీలే వెళ్తున్నాయని కొవ్వూరు తహసీల్దార్ ఎం.దుర్గాప్రసాద్ వివరించారు. దేచర్లలో మట్టి తవ్వకాలపై మైన్స్ అధికారులు పనులను ఆపినట్టు చెప్పారు. చిడిపి వద్ద మట్టి తవ్వకాల కోసం గోదావరికి అడ్డంగా వేసినట్టు పేర్కొన్న రహదారిని ఇసుక రవాణాకు గతంలో నిర్మించారన్నారు. ఇక్కడ నిఘాపెట్టి మట్టి తవ్వకాలను నిలిపివేసినట్టు తెలిపారు. కుమాదేవంలో ఎస్సీలకు ఇచ్చిన వ్యవసాయ భూమిలో మట్టి తవ్వకాలు ఆపివేశామని వివరించారు.

ఆ తప్పిదాలను ఈ ప్రభుత్వం చేయదు

- ఉద్యోగులకు రూ.7,500 కోట్లు విడుదల: ఏపీ జేఏసీ చైర్మన్ శివారెడ్డి

అమరావతి, మార్చి 23(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత ప్రభుత్వం అనుభవంతో కూడినదని ఏపీ జేఏసీ చైర్మన్ కేవీ శివారెడ్డి అన్నారు. ఆదివారం విజయవాడ ఎన్జీవో భవన్‌లో రాష్ట్ర వ్యవసాయ విస్తరణాధికారుల కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగుల పట్ల అవలంబించిన వైఖరి వల్ల గత ప్రభుత్వాన్ని సాగనంపారని.. ఆ తప్పిదాలను ప్రస్తుత ప్రభుత్వం చేయదన్నారు. కూటమి ప్రభుత్వం జనవరిలో రూ.1,300 కోట్లు, ప్రస్తుతం రూ.6,200 కోట్లు ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు మంజూరు చేసిందని తెలిపారు. రైతు సేవా కేంద్రాల నుంచి ఏఈవోలను తొలగించొద్దని, జాబ్‌చార్ట్, పదోన్నతి స్కేళ్లు, ఏజీబీఎస్సీ సీట్లను కొనసాగించాలని వ్యవసాయ విస్తరణాధికారుల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు డీవీ వేణుమాధవరావు ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా సంఘం 2025 డైరీని శివారెడ్డి, ఎన్జీవో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విద్యాసాగర్ ఆవిష్కరించారు.

బెంగళూరు నుంచి పులివెందులకు జగన్

పులివెందుల, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సమీప బంధువు విజయశేఖర్‌రెడ్డి(69) ఆదివారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందారు. దీంతో జగన్ సతీసమేతంగా బెంగళూరు నుంచి హెలికాప్టర్లో పులివెందుల చేరుకున్నారు. విజయశేఖర్‌రెడ్డి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన వెంట ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి, మాజీ ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాషా, మాజీ ఎమ్మెల్యే రవీంద్రనాథరెడ్డి, కడప మేయర్ సురేశ్‌బాబు తదితరులు పాల్గొన్నారు. ఆ తర్వాత జగన్ భాకరాపురంలోని తన ఇంటికి వచ్చారు. సోమవారం లింగాల మండలంలో పర్యటిస్తారు. శనివారం రాత్రి పెనుగాలులకు పెద్దఎత్తున ధ్వంసమైన అరటితోటలను పరిశీలిస్తారు. తర్వాత పులివెందులకు తిరిగొచ్చి తాడేపల్లికి బయల్దేరతారని వైసీపీ వర్గాలు తెలిపాయి.

రెవెన్యూలో 'ఫండ్' పట్టాడు



(మొదటి పేజీ తరువాయి)

నిర్ణయించి, ప్యానళ్లు ఖరారుచేసినా, ఇంకా సర్దుబాటు చేయానికి 175 మంది అధికారులు లేరు. దీంతో ఆగమేఘాల మీద 175 మందికి డీటీలుగా పదోన్నతులు ఇచ్చారు. సర్వీసు కమిషన్‌తో సంబంధం లేదు. ప్రభుత్వంతో సంబంధం లేదు. సారు అనుకున్నారు...పదోన్నతులు ఇచ్చారు. ఇంత వరకు బాగానే సాగింది. కానీ ఇక్కడే చిక్కు వచ్చిపడింది.

జాయింట్ అకౌంట్ స్ర్కీన్ తీసి..

ప్రభుత్వానికి తెలియకుండా, జిల్లా కలెక్టర్ల భాగస్వామ్యం లేకుండా పోస్టుల సృష్టి, ఆగమేఘాల మీద ఇచ్చిన పదోన్నతుల వెనక భారీ వసూళ్ల దందా సాగినట్లు ఆరోపణలున్నాయి. ఎన్నికల్లో పోటీచేయాలన్న సంకల్పంతో ఉన్న సదరు రెవెన్యూ అధికారి కోసం ఓ వ్యక్తి వసూళ్లకు పాల్పడినట్లు తెలిసింది. ప్రభుత్వానికి తెలియకుండానే సృష్టించిన డీటీ పోస్టుల ద్వారా 7.50 కోట్లు; తహసీల్దార్ పదోన్నతులు, సర్వీసు(క్రమశిక్షణ చర్యల ఎత్తివేత) కేసుల రివిజన్ ద్వారా మరో 2 కోట్లు సొంత మనిషి ద్వారా వసూలు చేసినట్లు సమాచారం. ఇందులో అత్యధిక శాతం నగదు రూపంలో, మిగతా సొమ్మును ఆయన భార్యతో కలిపి ఉన్న జాయింట్ అకౌంట్‌లో డిపాజిట్లు చేయించినట్లు తెలిసింది. ఆ జాయింట్ అకౌంట్ పాస్ పుస్తకం స్ర్కీన్‌షాట్‌లు తీసి సారు చర్యలతో లబ్ధి పొందిన వారికి ఆ వ్యక్తి వాట్సప్‌ద్వారా పంపించారు. ఆ అకౌంట్‌లో డబ్బులు డిపాజిట్లు చేయించారని తెలిసింది. బ్యాంక్ డిపాజిట్, ఆన్‌లైన్ చెల్లింపుల కన్నా నేరుగా నగదు వసూళ్లే చాలా ఎక్కువగా జరిగాయని సమాచారం. కర్నూలు జిల్లాకు చెందిన ఓ వ్యక్తి, రెవెన్యూలోనే ఓ జూనియర్ అధికారి కలిసి ఈ వసూళ్లను స్వయంగా నిర్వహించినట్లుగా తెలిసింది. కొత్తగా పోస్టులు, పదోన్నతులు వస్తున్నాయని ఆశపడ్డ కొందరు చాలా పెద్దమొత్తంలోనే ఆయనకు సమర్పించుకున్నారు. గత ఎన్నికల్లో పోటీ చేసేందుకు నోటిఫికేషన్‌కు ముందే సదరు అధికారి తన పోస్టుకు రాజీనామా చేశారు. అయితే, ఏడాదిన్నర దాటినా ఆ పోస్టులు, పదోన్నతులకు ఆర్థికశాఖ ఆమోదం రాలేదు. అసలు ఫైలే వెళ్లకుండా ఆమోదం ఎలా లభిస్తుంది? కాబట్టి విషయం బోధపడిన వారు బాధితులయ్యామని ఆందోళన చెందుతున్నారు.

కథ అడ్డం తిరిగింది...

కొత్తగా సృష్టించిన పోస్టులను, వాటి ఆధారంగా ఇచ్చిన పదోన్నతులను ప్రభుత్వం ర్యాటిఫై చేయించాలి. ఆర్థికశాఖ ఆమోదం తీసుకోవాలి. అయితే, ఫైలును ఆర్థికశాఖకు కాకుండా కేవలం రెవెన్యూశాఖ స్థాయిలోనే సెటిల్ చేయిద్దామని సదరు అధికారి ప్రయత్నించారు. దీన్ని సచివాలయం స్థాయిలో రెవెన్యూ అధికారులు వ్యతిరేకించారు. ఫైలును విధిగా ఆర్థికశాఖ ఆమోదానికి పంపించాలని నోట్ ఫైల్స్‌పై రాశారు. ఆర్థికశాఖ ఆమోదం ఉంటే తప్ప ఆ పోస్టులకు విలువ ఉండదని, కేడర్ సంఖ్య పెంపు అనేది ప్రభుత్వ స్థాయిలో తీసుకొనే నిర్ణయం అని, దీనికి సంబంధించిన ఫైలుపై క్రిస్టల్ క్లియర్‌గా రాశారు. దీంతో భలే చిక్కువచ్చిపడింది. ఆర్థిక శాఖకు ఫైలు వెళ్తే ఆమోదించరు. తిరస్కరించడంతో పాటు చీవాట్లు పెడుతారు. మరేం చేయాలి? ఫైలును వెనక్కి తెప్పించుకొని రెవెన్యూ స్థాయిలోనే 'స్పీకింగ్ ఆర్డర్' జారీ చేశారు. దీన్నే జిల్లా కలెక్టర్‌లకు పంపించారు. దీన్ని చూసి నాటి కలెక్టర్లు కంగుతిన్నారు. తమకు తెలియకుండా, మాటమాత్రమైనా డీటీల ప్యానళ్లు సిద్ధం చేయాలని తమకు చెప్పకుండా కొత్తగా పోస్టులు సృష్టించడం, వేగంగా వాటిని పదోన్నతులతో భర్తీ చేయడంపై విస్తుపోయారు. అయితే, పెద్దల పని కావడంతో ప్రశ్నలు వేయకుండా కలెక్టర్లు మౌనంగా ఉండిపోయారు.

ఆ భూములను ఖాళీ చేయండి

- వారంలోగా సమాధానం ఇవ్వండి
- శారదా పీఠానికి రెవెన్యూ శాఖ నోటీసులు

అమరావతి, విశాఖపట్నం, మార్చి 23(ఆంధ్రజ్యోతి): విశాఖలోని శారదాపీఠం ఆక్రమణలో ఉన్న ప్రభుత్వ భూములపై ఎట్టకేలకు కదలిక వచ్చింది. పీఠం ఆక్రమించుకున్న భూములను వెంటనే ఖాళీచేయాలని, ఈ విషయంలో వారంరోజుల్లోగా సమాధానం ఇవ్వాలని, లేదంటే తామే ఆక్రమణల తొలగింపునకు చర్యలు తీసుకుంటామంటూ రెవెన్యూశాఖ నోటీసులు ఇచ్చింది. ఆదివారం రాత్రి పీఠం మేనేజర్‌కు ఈ నోటీసులు అందచేశారు. పెందుర్తి మండలం చినముషిడివాడలో శారదా పీఠం ఉంది. ఆ సంస్థ చుట్టుపక్కల విలువైన ప్రభుత్వ భూములున్నాయి. వాటి విలువ వందల కోట్లపైనే. అయితే, ఇటు రెవెన్యూ, అటు మున్సిపల్ భూములను పీఠం ఆక్రమించుకుని నిర్మాణాలు చేసిందని అధికారులు గుర్తించారు. వాటిపై సర్వేకు ప్రయత్నించగా పలుమార్లు అడ్డుకున్నారు. దీనిపై అనేక విమర్శలు వచ్చినా గత ప్రభుత్వం పట్టించుకోలేదు. ఇటీవల ఇదే అంశంపై 'ఆంధ్రజ్యోతి' 'పీఠం వెనక మోసం' శీర్షికన భూఆక్రమణలను వెలుగులోకి తీసుకొచ్చింది. ప్రభుత్వం ఈ అంశంపై దృష్టి సారించి కలెక్టర్, జేసీలను అమరావతికి పిలిపించి మాట్లాడింది. ఆక్రమణలపై నోటీసులివ్వాలని ఆదేశించింది. ఈ నేపథ్యంలో ఆదివారం పెందుర్తి తహసీల్దార్ శారదాపీఠానికి ఆంధ్రప్రదేశ్ భూ ఆక్రమణ చట్టం-1905లోని సెక్షన్ 7 కింద నోటీసులు ఇచ్చారు. "సర్వే నంబర్ 90లో ఉన్న రహదారి భూమిని ఆక్రమించుకున్నారు. ఇది ప్రభుత్వ భూమి. ఇందులో నిర్మాణాలు చేశారు. ఆ భూమిని ఎందుకు స్వాధీనం చేసుకోకూడదో, అక్రమ నిర్మాణాలను ఎందుకు జప్తుచేయకూడదో వారంరోజుల్లోగా వివరణ ఇవ్వాలి" అని ఆదేశించారు. ఇదిలా ఉంటే వీఎంఆర్‌డీఏ ఆమోదించిన మున్సిపల్ స్థలం కూడా పీఠం ఆక్రమణలో ఉంది. దాన్ని స్వాధీనం చేసుకునేందుకు వీఎంఆర్‌డీఏ కమిషనర్ హోదాలో కలెక్టర్ మరో నోటీసు ఇవ్వనున్నారు.

కట్టుకథలతో నాపై అక్రమ కేసు

- ఎంపీ లావు ప్రోద్బలంతోనే: విడదల రజిని

చిలకలూరిపేట, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): కట్టు కథలు అల్లి తనపై అక్రమ కేసు పెట్టారని మాజీ మంత్రి విడదల రజిని ఆరోపించారు. ఈ కేసు పెట్టినవారెవరో తనకు తెలియదని, ఎప్పుడూ వారితో మాట్లాడలేదని, చూడనూ లేదని ఆదివారమిక్కడ విలేకరులతో అన్నారు. వాళ్లు తనకు ఎలాంటి లంచాలు ఇవ్వలేదని స్పష్టం చేశారు. నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయల ప్రోద్బలంతోనే తనపై ఏసీబీ కేసు నమోదైందని తెలిపారు. ఆయనకు తనపై ఎందుకో విపరీతమైన కోపమన్నారు. 2020 వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు సెప్టెంబరు 2 వైఎస్ వర్ధంతి రోజున గురజాల సర్కిల్ డీఎస్పీ, సీఐలిద్దరికి లంచాలిచ్చి.. నా ఫోన్ నంబరు. మా ఇంట్లో వాళ్ల నంబర్లు, సిబ్బంది నంబర్ల కాల్ డేటా తీసే ప్రయత్నం చేశారని ఆరోపించారు. ఒక ఎంపీ ఒక ఎమ్మెల్యే కాల్‌డేటా తీస్తారా... తన వ్యక్తిగత జీవితంలోకి ఎందుకు రావాలనుకున్నారో అంతటి నీచమైన ఆలోచన ఎందుకు వచ్చిందని ప్రశ్నించారు. రాష్ట్రంలో రెడ్ బుక్ పాలన పరాకాష్ఠకు చేరిందన్నారు. అధికారాన్ని అడ్డం పెట్టుకొని తప్పుడు కేసులు పెడితే భయపడేది లేదని చెప్పారు. విద్యుత్ చార్జీల అంశంపై చిలకలూరిపేటలో ధర్నా చేస్తే ఎమ్మెల్యే తనపై ఎస్సీ, ఎస్టీ కేసు పెట్టించారని ఆరోపించారు.

పుష్ప కాదు.. గోఖలేనే నిజమైన హీరో!

- 600 మంది రోగుల ప్రాణాలు కాపాడారు
- ఇదే స్ఫూర్తితో వైద్యులు సేవలందించాలి
- వైద్య విద్యార్థులకు మంత్రి సత్యకుమార్ పిలుపు

గుంటూరు మెడికల్, మార్చి 23(ఆంధ్రజ్యోతి): "సినిమా హీరోలు వినోదం మాత్రమే పంచుతారు. కానీ మన మధ్య నిజమైన హీరో ఉన్నారు. ఆయనే డాక్టర్ ఆళ్ల గోపాలకృష్ణ గోఖలే. ఆయన ఏకంగా 600 మంది ప్రాణాలు కాపాడారు. విలువైన రూ. కోట్ల సంపాదన వదులుకొని గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రిలో ఉచితంగా 600 మంది రోగులకు గుండె ఆపరేషన్లు చేశారు. ప్రాణాలు నిలబెట్టిన గోఖలే నిజమైన హీరో" అని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ కొనియాడారు. గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రి కార్డియాలజీ విభాగంలో 9 నెలల కాలంలో 115 గుండె ఆపరేషన్లు నిర్వహించడంతో ఆయా వైద్య నిపుణులను జీఎంసీ ఆడిటోరియంలో ఆదివారం సన్మానించారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జీజీహెచ్ కార్డియాక్, సీటీ సర్జన్లను పాల్గొన్నారు. 2015-19 మధ్య గుంటూరు జీజీహెచ్‌లో పద్మశ్రీ గ్రహీత, కార్డియో థొరాసిక్ సర్జన్ డాక్టర్ గోపాలకృష్ణ గోఖలే, 600 మందికి గుండె ఆపరేషన్లు చేయడాన్ని ప్రస్తావిస్తూ.. ఆయనను ఘనం గా సన్మానించారు. మంత్రి సత్యకుమార్, ఆరోగ్య శాఖ మాజీ మంత్రి డాక్టర్ కామినేని శ్రీనివాస్, వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక ముఖ్యకార్యదర్శి ఎంటీ కృష్ణబాబు తదితరులు వైద్యులను సన్మానించారు. కాగా, ఈ కార్యక్రమానికి వైద్య విద్యార్థులు గైర్హాజరవడం పట్ల మంత్రి సత్యకుమార్ అసంతృప్తి వ్యక్తం చేశా రు. చాలా మంది విద్యార్థులు వినోద కార్యక్రమాలకు, సినిమాలకు వెళ్లినట్లు వైద్యాధికారులు చెప్పడంతో మంత్రి పైవిధంగా స్పందించారు. గోఖలే స్ఫూర్తితో ఇతర వైద్యులు సమాజ సేవకు ముందు కు రావాలని మంత్రి పిలుపునిచ్చారు. ప్రభుత్వ వైద్య కళాశాలల్లో ఒక్కొక్క విద్యార్థిపై ఐదేళ్లల్లో రూ.1.71 కోట్లు ఖర్చు చేస్తున్నామని తెలిపారు. వీరు తిరిగి సమాజానికి సేవ చేయాలని మంత్రి కోరారు. ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జి. నందకిశోర్ మాట్లాడుతూ.. ఐఎంఏ రాష్ట్ర శాఖ 'పల్లెకు పోదాం' కార్యక్రమంలో గ్రామాలను దత్తత తీసుకుని ఉచిత వైద్య శిబిరాలుతో పాటు గ్రామస్తులకు పూర్తి ఆరోగ్య పరీక్షలు చేస్తున్నట్లు తెలిపారు. ఏపీలో 100 గ్రామాలను దత్తత తీసుకుంటున్నట్లు తెలిపారు.

175 నియోజకవర్గాల్లో మల్టీస్పెషాలిటీ ఆస్పత్రులు

సత్తెనపల్లి, మార్చి 23(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు నాయకత్వంలో పేదలకు నాణ్యమైన వైద్యం అందించేందుకు రాష్ట్రంలోని 175 నియోజక వర్గాల్లో పీపీపీ పద్ధతిలో మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రులు ప్రారంభిస్తామని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ తెలిపారు. ఆదివారం పల్నాడు జిల్లా సత్తెనపల్లి ఏరియా వైద్యశాలలో అదనపు భవనాన్ని ఆయన ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణతో కలసి ప్రారంభించారు. సత్తెనపల్లిలోని రాజుపాలెం మండలంలో వంద పడకల మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిని ప్రారంభిస్తామన్నారు. రాష్ట్రంలో 300 సివిల్ అసిస్టెంట్ సర్జన్ పోస్టులను త్వరలో భర్తీ చేసి, డాక్టర్ల కొరత తీరుస్తామన్నారు. క్యాన్సర్ బాధితులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామని చెప్పారు. దేశంలో ఎక్కడా లేని విధంగా కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో వైద్య సేవలు అందిస్తోందన్నారు.


మాట్లాడుతున్న సినీ నటుడు ఆర్.నారాయణమూర్తి

డీలిమిటేషన్‌పై అదానీ, అంబానీ, మోదీ కుట్ర!

- జనాభా ప్రకారం చేపడితే దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం
- కమ్యూనిస్టులు ఏకం కావాలి
- సీఎం చంద్రబాబు నిర్ణయం భేష్
- సినీనటుడు ఆర్.నారాయణమూర్తి

నరసన్నపేట, మార్చి 23(ఆంధ్రజ్యోతి): పార్లమెంటు నియోజకవర్గాల పునర్విభజన(డీలిమిటేషన్) పేరుతో కేంద్ర ప్రభుత్వం పెద్ద కుట్రకు తెరదీసిందని సినీ నటుడు, దర్శకుడు ఆర్. నారాయణమూర్తి విమర్శించారు. జనాభా ప్రాతిపదికన డీలిమిటేషన్ చేపడితే.. అది దక్షిణాది రాష్ట్రాలకు తీవ్ర అన్యాయం చేసినట్టే అవుతుందన్నారు. "నాడు దేశ క్షేమం కోసం కుటుంబ నియంత్రణను పక్కాగా అమలు చేసి, భారీ స్థాయిలో పన్నులు కడుతున్న దక్షణాది రాష్ట్రాలుకు అన్యాయం జరుగుతుంది. యూపీ, బిహార్ వంటి రాష్ట్రాల్లో నేడు జనాభా ఎక్కువగా ఉన్నారు. ఆ ప్రాంతం వారు రాజ్యం ఏలడం కేంద్ర పెద్దలకు కావాలి. అందుకే జనాభా దామాషా మేరకు ఎంపీ సీట్లు కేటాయింపునకు కుట్ర పన్నారు జనాభా దామాషా ప్రకారం నియోజకవర్గాల ఏర్పాటు.. అంబానీ, అదానీ, మోదీ, అమిత్‌షాల కుట్రే" అని నారాయణమూర్తి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆదివారం శ్రీకాకుళం జిల్లా నరసన్నపేట మండలం కోమర్తిలో అమరవీరుల స్థూపం వద్ద ప్రముఖ కథారచయిత అట్టాడ అప్పలనాయుడు రాసిన 'కామ్రేడ్ మామిడి అప్పలసూరి' జీవిత చరిత్ర పుస్తక ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. దీనిలో పాల్గొన్న నారాయణమూర్తి మాట్లాడుతూ.. ఉత్తరాంధ్ర, ఆదివాసీ ప్రాంతాల్లో ఉద్యమాలు రావడానికి సంపదను తరలించుకుపోవడమే ప్రధాన కారణమన్నారు. "భూతలం మీద పేదవాడి ఆకలి ఉన్నంత కాలం.. దోపిడీ జరుగుతున్నంత కాలం... మావోయిజం అంతం కాదు. కమ్యూనిస్టులు ఎన్ని పోరాటాలు చేసినా.. ఎన్ని త్యాగాలు చేసినా... ప్రజలు పట్టించుకోవడం లేదు. ఈ నేపథ్యంలో ఐక్య ఉద్యమాల కోసం మీరంతా(వామపక్షాలు) ఏకం కావాలి. ప్రపంచంలో ఉన్న కమ్యూనిస్టులు ఐక్యం కావాలి" అని నారాయణమూర్తి పిలుపునిచ్చారు. ఏపీ సీఎం చంద్రబాబు నలుగురు పిల్లలను కనండి అని చెబుతున్న నిర్ణయం మంచిదేనన్నారు. అయితే, జనాభా ప్రాతిపదికగా కేంద్రం చేపడుతున్న పార్లమెంట్ నియోజకవర్గాల పున్వరిభజన విధానాన్ని కూడా సీఎం ఖండించాలని కోరారు. "మీకు దండం పెడుతున్నా.. సీఎం చంద్రబాబుతో పాటు డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, వామపక్షాల నాయకులు, వైసీపీ అధినేత జగన్ కూడా ఈ విధానాన్ని ఖండించాలి" అని వ్యాఖ్యానించారు. కార్యక్రమంలో సీపీఐ, సీపీఎం(ఎల్), సీపీఐ(ఎంఎల్), ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

అంతా ఉచితం..

అయినా కోట్లు పెట్టి కొంటాం!

- ఆర్టీసీలోని సీసీఎస్ ఆఫీసు కోసం రూ.4 కోట్లతో ఫ్లాట్
- పాలక మండలి నిర్ణయంపై సర్వత్రా విమర్శలు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

కార్యాలయానికి అద్దె లేదు. కనీసం కరెంటు బిల్లు కూడా లేదు. సభ్యులకు అంతా సౌకర్యంగా ఉంది. కానీ పాలక మండలికి నచ్చలేదు. ఉచితంగా ఎందుకంటూ రూ.4 కోట్లు ఖర్చు చేసి ఫ్లాట్ కొనుగోలు చేస్తోంది. ఇంత ఖర్చు చేసినా సభ్యులకు అనుకూలంగా ఉంటుందా? అంటే అడ్రస్ కనుక్కోవడం కూడా కష్టమే. మరి ఎవరి స్వార్థ ప్రయోజనాల కోసం చేస్తున్నారు? ఏపీఎస్‌ఆర్టీసీ ప్రధాన కార్యాలయం ఆర్టీసీ హౌస్‌లో జరుగుతున్న చర్చ ఇది. క్రెడిట్ కో-ఆపరేటివ్ సొసైటీ(సీసీఎస్) కార్యాలయం ప్రస్తుతం విజయవాడ బస్టాండు ప్రాంగణంలోని ఆర్టీసీ హౌస్‌లో ఉంది. రూపాయి కూడా అద్దె చెల్లించాల్సిన అవసరం లేదు. అలాంటిది.. ఎక్కడో ఆరు కిలోమీటర్ల దూరంలో రూ.4 కోట్లు పెట్టి ఫ్లాట్ ఎందుకు కొనుగోలు చేస్తున్నారు? ఈ డబ్బు బ్యాంకులో వేసినా ప్రతి నెలా మూడు లక్షల దాకా వడ్డీ వస్తుంది. యాజమాన్యం ఉచితంగా ఇవ్వబోమని అంటే.. అదే ఆర్టీసీ హౌస్‌లో ఇతర ఆఫీసులకు ఇచ్చినట్లు అద్దె లేదా లీజుకు తీసుకోవడానికి ఖాళీ ఉంది కదా! అక్కడ సీసీఎస్ ఆఫీసు ఉంటే సభ్యులకు వచ్చి వెళ్లేందుకు ఎంతో సౌకర్యంగా ఉంటుంది. ఒకవేళ సొంత భవనం కావాలనుకుంటే విద్యాధరపురంలోని ఆర్టీసీ ఆసుపత్రి ప్రాంగణంలో గతంలో ఇచ్చిన 500 గజాల్లో నిర్మాణం చేపడితే బాగుంటుందని వినిపిస్తున్నాయి. సీసీఎస్ పాలకమండలి స్వలాభం కోసం ఫ్లాట్ కొనాలనే నిర్ణయం తీసుకుందని, ఏదో మమ అనిపించేందుకు ఈ నెల 26న తీర్మానం చూపించి, ఇప్పటికే చేసుకున్న అగ్రిమెంట్ ప్రకారం భారతీనగర్‌లో కొనుగోలు చేసేందుకు సిద్ధమైందని చెబుతున్నారు. ఈ భవనం నిర్వహణతో పాటు విద్యుత్ బిల్లులు ఇతరత్రా ఖర్చులు అన్నీ కలిపి నెలకు రెండు లక్షలకు పైనే వస్తాయని చెబుతున్నారు. నాలుగు కోట్ల రూపాయలకు వడ్డీ కోల్పోవడంతో పాటు ఏటా పాతిక లక్షల వరకూ అదనపు భారం సీసీఎస్‌పై పడుతుందని ఆర్టీసీ హౌస్‌లో బహిరంగంగా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఆ డబ్బంతా వృథా

ఏటా వేల కోట్లు ఆర్జిస్తున్న సంస్థగా, ప్రయాణికుడి రూపాయికీ లెక్క చెప్పే ఏకైక సంస్థగా ఆర్టీసీకి పేరుంది. కండక్టర్ వద్ద రూ.2 అదనంగా ఉన్నా ఉద్యోగం తొలగించేటంత క్రమశిక్షణ చర్యలు ఇందులో ఉన్నాయి. అటువంటి సంస్థలో చిన్న కార్మికుడి నుంచి ఈడీ వరకూ సొమ్ము పొదుపు చేసుకునేందుకు సీసీఎస్ ఏర్పాటైంది. ఆర్టీసీలో పనిచేసే ప్రతి ఉద్యోగితో పాటు రిటైరైనవారి డబ్బులు కూడా ఇందులో పొదుపు చేసుకోవచ్చు. ప్రస్తుతం సీసీఎస్‌లో ఉన్న 46,500 మంది సభ్యులకు 8.5-9.5 శాతం వరకూ వడ్డీ చెల్లిస్తోంది. అవసరాల కోసం లోన్లు తీసుకునే ఉద్యోగుల నుంచి 11 శాతం వరకూ వడ్డీ వసూలు చేస్తుంది. అలా వచ్చిన రూపాయిన్నర ఆదాయాన్ని రిటైర్డ్ ఉద్యోగులకు పింఛను రూపంలో, సిబ్బంది పిల్లలకు వృత్తి విద్యలో స్కాలర్‌షిప్పులు, తదితర సంక్షేమ కార్యక్రమాలకు ఖర్చు చేస్తుంది. ఏటా రూ.2,500 కోట్ల టర్నోవర్ కలిగిన సీసీఎస్ పాలక మండలికి ఐదేళ్లకోసారి ఎన్నికలు జరుగుతాయి. 9 మంది డెలిగేట్స్‌గా ఎన్నికవుతారు. చైర్మన్‌గా ఆర్టీసీ ఎండీ వ్యవహరిస్తారు. ఆర్టీసీ సొమ్ములో ప్రతి రూపాయిని జాగ్రత్తగా కాపాడే ఎండీ, సిబ్బంది కోసమే తాము పోరాటాలు చేస్తున్నామంటూ వినతులు, ప్రకటనలతో మభ్యపెట్టే యూనియన్ల ప్రతినిధులు సీసీఎస్ పాలక మండలిలో ఉన్నారు. ఆ సొమ్మును జాగ్రత్తగా కాపాడుకోకుండా తమ అవసరాలు, కమీషన్ల కోసం విజయవాడలోని భారతీనగర్‌లో ఒక అపార్ట్‌మెంట్లోని ఐదో అంతస్తు మొత్తం(6వేల చదరపు అడుగులు) కొనేందుకు ఒప్పందం చేసుకున్నట్లు తెలిసింది. బిల్డర్‌తో తెర వెనుక ఒప్పందం చేసుకుని మార్కెట్ ధర కన్నా ఎక్కువ చెల్లించి సీసీఎస్‌కు చెందిన 4 కోట్లు వృథా చేసేందుకు సిద్ధమైనట్లు సమాచారం. ఈ నెల 26న పాలక మండలి సమావేశం కోనసీమ జిల్లాలో ఏర్పాటు చేయడం.. అపార్ట్‌మెంట్లో ఫ్లాటు కొనుగోలు తీర్మానం కోసమేననే చర్చ జరుగుతోంది.

రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమిస్తాం: ఈయూ

ఆర్టీసీలో పనిచేస్తున్న, రిటైరైన 70 వేల మంది సొమ్మును ఏడుగురు ఇష్టారాజ్యంగా కృష్ణా నదిలో పారబోస్తామంటే చూస్తూ ఊరుకోబోమని ఉద్యోగ అసోసియేషన్ ఈయూ హెచ్చరించింది. అన్ని అసోసియేషన్లతో కూటమి ఏర్పాటు చేసుకుని ఎన్ఎంయూ మెజారిటీలో ఉన్న సీసీఎస్ పాలకమండలి చర్యల్ని అడ్డుకుంటామని ఈయూ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదర్ రావు అన్నారు. ఎవరి ప్రయోజనాలు, స్వలాభాల కోసం వేలాది మంది సొమ్ముతో గెస్ట్ హౌస్‌లు కొనుగోలు చేస్తున్నారని ప్రశ్నించారు.


మోక్షితతో మాట్లాడుతున్న ఐసీపీఎస్ అధికారులు

మోక్షితకు కొండంత అండ!

- విద్యార్థినికి స్కాలర్‌షిప్, కేజీబీవీలో సీటు
- స్పందించిన డీఈవో, ఐసీపీఎస్ అధికారులు
- సొంతింటి నిర్మాణానికి ఎమ్మెల్యేతో మాట్లాడతానన్న సీఐ


శనివారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనం

చిత్తూరు అర్బన్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): మండే ఎండలో.. చెట్టు నీడలో రిక్షాపై కూర్చొని ఓ పక్క చదువుకుంటూనే.. మరో పక్క పండ్లు అమ్ముతున్న విద్యార్థిని మోక్షిత దీనగాథపై ప్రభుత్వం స్పందించింది. 'అమ్మా.. నాన్నలు లేక.. అక్షరమే ఆలంబనగా' అనే కథనం 'ఆంధ్రజ్యోతి'లో ఆదివారం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన రెండో పట్టణ సీఐ నెట్టికంఠయ్య ప్రభుత్వపరంగా లేదా వ్యక్తిగతంగా వారికి ఏం అవసరమో తెలుసుకోవడానికి విద్యార్థిని మోక్షిత అవ్వాతాతలతో మాట్లాడారు. సొంత ఇంటి నిర్మాణానికి ఎమ్మెల్యేతో తానే వెళ్లి మాట్లాడతానని సీఐ తెలిపారు. అనంతరం డీఈవో వరలక్ష్మి దృష్టికి మోక్షిత విషయాన్ని తీసుకెళ్లారు. స్పందించిన విద్యాశాఖ అధికారులు ఆమెకు కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయ(కేజీబీవీ)లో సీటు ఇవ్వడానికి ముందుకొచ్చారు. అలాగే ఇంటిగ్రేటెడ్ చైల్డ్ ప్రొటెక్షన్ స్కీమ్ (ఐసీపీఎస్) ఆధ్వర్యంలో డీసీపీవో సుబ్రహ్మణ్యం, సోషల్ వర్కర్ మురళి తదితరులు మోక్షిత అవ్వాతాతలు పండ్లు అమ్ముతున్న చిత్తూరు జిల్లా పరిషత్ కార్యాలయం వద్దకు ఆదివారం వెళ్లి వివరాలను తెలుసుకున్నారు. మోక్షితకు మిషన్ వాత్సల్య పథకం కింద నెలకు రూ.4500 స్కాలర్‌షిప్ ఇస్తామని తెలిపారు.

బెట్టింగ్ యాప్స్ రచ్చలోకి అగ్ర నటులు

- బాలకృష్ణ, ప్రభాస్, గోపీచంద్‌పై సైబర్ క్రైం విభాగానికి న్యాయవాది ఫిర్యాదు

హైదరాబాద్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): బెట్టింగ్ యాప్స్ ప్రమోషన్ల రచ్చలోకి తెలుగు సినీ రంగ అగ్రనటులు వచ్చి చేరారు. ఈ మేరకు సినీనటులు బాలకృష్ణ, ప్రభాస్, గోపీచంద్‌పై సైబర్ క్రైం విభాగానికి ఆన్‌లైన్‌లో న్యాయవాది ఇమ్మనేని రామారావు ఆదివారం ఫిర్యాదు చేశారు. నందమూరి బాలకృష్ణ, తొట్టెంపూడి గోపీచంద్, ఉప్పలపాటి వెంకట సూర్యనారాయణ రాజు అలియాస్ ప్రభాస్ చైనీస్ బెట్టింగ్ యాప్ అయిన ఫన్-88ను ప్రమోట్ చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. యాప్ నిర్వాహకులు మ్యూల్ (ఇతరుల ఆధార్ నంబర్లతో వారికి తెలియకుండానే తీసుకున్న) ఖాతాల ద్వారా కోట్లాది రూపాయలను చైనాకు తరలించారని వివరించారు. దేశ భద్రతకే సవాల్‌గా మారిన ఫన్-88 బెట్టింగ్ యాప్ గూగుల్ ప్లేస్టోర్‌లో అందుబాటులోనే ఉందని, దాన్ని వెంటనే బ్లాక్ చేయాలని రామారావు కోరారు. కాగా, బెట్టింగ్ యాప్స్, వెబ్‌సైట్లపై రాష్ట్రంలోని వివిధ పోలీసు స్టేషన్లు, సైబర్ క్రైం, సైబర్ సెక్యూరిటీ బ్యూరోల్లో ఇప్పటిదాకా 385 కేసులు నమోదైనట్లు సమాచారం. అయితే, బెట్టింగ్ యాప్స్ ప్రమోషన్లలో పాల్గొన్న వారికి నోటీసులు ఇచ్చి విచారించడానికి ముందు భిన్న కోణాల్లో దర్యాప్తు చేపట్టాలని ఉన్నతాధికారుల నుంచి స్టేషన్‌హౌస్ ఆఫీసర్లకు ఆదేశాలు అందినట్లు తెలుస్తోంది. బెట్టింగ్ యాప్స్ వలలో చిక్కుకుని, అప్పులు తీర్చలేక ఆత్మహత్యలు చేసుకున్న కేసులను రీఓపెన్ చేయాలని సూచించినట్లు సమాచారం.

వేల కోట్ల దందా... ఎక్కువ చైనా కంపెనీలే

బెట్టింగ్ యాప్స్‌లో అధిక శాతం వాటా చైనా కంపెనీలదేనని దర్యాప్తు అధికారులు పేర్కొంటున్నారు. ఆన్‌లైన్ గేమింగ్ ప్లాట్‌ఫామ్‌కు సంబంధించి ప్రభుత్వ అనుమతులు ఉన్న భారతీయ కంపెనీలు 28శాతం జీఎస్టీ చెల్లించాల్సి ఉంటుంది. బెట్టింగ్‌పై నిషేధం లేని రాష్ట్రాల్లోనే ఆయా యాప్స్, వెబ్‌సైట్ల ద్వారా కార్యకలాపాలు నిర్వహించుకోవచ్చు. కానీ, చాలా సంస్థలు ఆయా నిబంధనలు పాటించడం లేదు. జీఎస్టీ చెల్లించని గేమింగ్ యాప్స్ సంస్థలపై ఇటీవల జీఎస్టీ ట్యాక్స్ ఇంటెలిజెన్స్ అధికారులు కొరడా ఝులిపించారు. 357 వెబ్‌సైట్లను బ్లాక్ చేయడంతోపాటు బ్యాంకు ఖాతాలను ఫ్రీజ్ చేశారు. మరోవైపు రాష్ట్రంలో జియో ఫెన్సింగ్ టెక్నాలజీ ద్వారా బెట్టింగ్ సైట్లు యాక్సెస్ కాకుండా అడ్డుకోవడానికి సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు ప్రయత్నిస్తున్నారు. ఇప్పటి వరకు 108 అక్రమ బెట్టింగ్ వెబ్‌సైట్లను బ్లాక్ చేయడంతో పాటు 133 భారతీయ బెట్టింగ్ ప్లాట్‌ఫామ్ సంస్థలకు నోటీసులు జారీ చేశారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N.Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.